పెద్దకథ :

# ఓబయ్య

మనుగుడుపునకు వెళ్లిన మఱునాఁడే అహోబలుని సంగతి బజారునఁబడెను. లేఁత లేఁత పెండలపుటాకులు చుట్టి యీయఁగా నతఁడు తములపుటాకులచిలుకలే యనుకొని నమలిమ్రింగెను. నాలుక పండుటయు పండకుండుటయు నతఁడు గమనింపలేదు. నోరు పుక్కిలించి యుమియను లేదు. అతని కించుకయు సందియము లేదు. సందియములు కలిగించుటకుఁగాని, పోగొట్టుటకుఁగాని అతని వెనువెంట తోడిపెండ్లికొడు కెవఁడును రాలేదు. కావున నతఁడు గుర్రుకొట్టి నిదిరించెను.

మఱునాఁడాతఁడు గ్రామమునందలి పెద్దలను దర్శింపఁబోయెను.

బస్తీలో నేయింటి కాయింటి కొకొక్క పల్లె. పల్లెయంతయు నొకకుటుంబము. కావున ఆ పల్లెలో నతఁడు బంధువుల యిండ్లను, దూరబంధువుల యిండ్లను, బంధువులుకాని వారియిండ్లనుగూడ క్రొత్త పెండ్లికొడుకు గౌరవమును చూఱఁగొనెను.

అహోబలుఁ డొక అవధానులవారి యింటికి వెళ్లెను. అవధానులవారు భువనేశ్వరునిముందు కూరుచుండి, ముఖవస్త్రము వేసి కొని జపము చేసికొనుచుండిరి. అవధానుల వారి కూఁతురు మంగమ్మ, 'మాది చేదస్తపు ఇల్లు, ఇచట కుర్చీలా బెంచీలా? మఱఁదిగా రీపీఁటపయి జాగ్రత్తగాఁ గూరుచుండవలయు' నని ఒక ఓటిపీఁట వయిచెను. అతఁడు ఆ పీఁటమీఁదఁ గూరుచుండి అచటఁగల వస్తువుల నన్నిటిని పరిశీలించు చుండెను. తీఁగలు ప్రాఁకినటులున్న ముగ్గులును, ముగ్గుమీఁదనున్న పూలపళ్లెరమును, తోమియుంచిన దేవవిగ్రహములును అతని నొక పవిత్రమగు భావన లోనికిఁ గొంపోయెను.

జర్మనీవారు అధర్వణవేదములోని మంత్రములను జదివికొని జెప్‌లినులను, బెలూనులను, బాంబులను, మరఫిరంగులను తయారు చేసిరని అతఁడు వేదము వల్లె వేసినవారి వలన వినియుండెను. అతఁడా వినుకలి నిపుడు కనుకలి చేసికొనుచుండెను.

అతఁడిటులు పయిమెట్టులో నాలోచించుచు తల పయికెత్తెను. ఎత్తు దూలములపై అడ్డగడలు, వానిమీఁద మడిబట్టలు! 'ఇవి యింత యెత్తున కెటులు పోయినవి?' అని అతఁడాశ్చర్యముగా చూడఁదొడఁగెను.

ఇంతలో అవధానులవారు ముఖవస్త్రము తీసి ఆకాశమువంక అదేపనిగా చూచుచున్న క్రొత్తపెండ్లికొడుకును జూచిరి. అవధానులవారు సంతోషప్రియులు. వా రతని వాలకమును కనిపట్టి కొంచెము దగ్గిరి. వారి దగ్గుసకలింపునకు సహాధ్యాయి.

అహోబలుఁ డింతవఱకును ఆకాశవిహార మొనరించుచుండెను. హఠాత్తుగా అవధానులవారి సకిలింపు!

ఈ సకిలింపుతో నతఁడు కనులను క్రిందికి దింపుసరికి పీఁట కర్ణుని రథమువలె ఒఱగఁబడెను. అతఁడు క్రిందఁబడెను. పీఁటక్రిందికోడు దూరముగాఁబడెను.

అవధానులవారు వడివడిగా దాపునకుఁబోయి తలమీఁద చిటుకలు వేయుచు, వేలాడించుచు లే నాయనా లే' అను మాటలనే ఊఁతయిచ్చిరి.

అహోబలుఁడు వడివడిగా లేచి కోడు సర్దుకొని కూరుచుండెను.

'వచ్చి యెంత సేపయినది?'

అహోబలుఁ డామాటకు సమాధానమిడక 'మామగారూ, ఈ మడిబట్ట లంతయెత్తున నెటు లమరినవి? ఎంత సేపటినుండియో యా లోచించుచుంటినిగాని అంతసులువుగా తేలలేదు. నిచ్చెన వేసికొని వేయవచ్చునుగాని–' అవధానుల వారహోబలుని మాట సమాప్తి చేయనీయక – 'రోజును అది యొక పనియా? నిచ్చెన లేక'

'లేక వేఱుపాయము?'

'అది చెప్పఁ దగినది కాదు. చూపఁదగినది.'

'దయయుంచి నాకుఁ జూపుదురా?'

'సమయమునకు వత్తువేని నాకు పక్షపాత మిసుమంతయు లేదు.'

అహోబలుఁడు నాఁటికి సెలవు గొనెను. అతఁ డీయాశ్చర్యమును జూచుటలో నితరులకు పాలీయఁదలఁపలేదు. పొడువుగా నెదిగిపోవుచున్న యొక మహాపురుషుఁ డు రేయుంబవ లతని కనులముందు గోచరించుచు ఒడలు జలదరింపఁజేయుచుండెను. అతఁడు తెలవాఱుజాముననే లేచి స్నాన మొనరించెను. వార్చెను; రెండుమూఁడుమాఱు లవధానులవారి యిల్లు చూచిపోయెను.

అవధానులవారు చక్కగా బట్టల నుతికికొని తెచ్చి పీఁటమీఁద నిడికొనిరి. అహోబలుఁడు వచ్చి భయభక్తులతో నెదుట నిలువఁబడెను.

'నీవు తలుపు మూసి మెల్లలో నుండుము. నేను 'ఊ' అనినపుడు తలుపోరగాఁ దీయుము. నిండారఁ దీయరాదు. తెలిసెనా? ఓరగాఁ దీసి చూడుము.'

'బారలుగాఁ దీసినచో భయపడుదునా?'

'ఆ సంగతి నీకే తెలియవలయును. కాని ఓరగాఁ దీసి చూడుము.'

అహోబలుఁడు లోలోపల భయపడెను. 'చిత్తము' అని తలుపుమూసి, మెల్లలోనికి వెళ్లి, తలుపు నానుకొని నిలువఁబడి యుండెను.

అవధానులవారు పడమటిదెస తలుపులు సగము మూసిరి. చీఁకటియు వెలుతురును ఇరుచేతులతో నొండొండ కౌఁగిలించుకొనెను.

అవధానులవారు ఒక బట్టతీసికొని, పాతిక పాలు ముద్దగాఁజుట్టి, దాని నొకసన్నని గడచివరఁబెట్టి పయినున్నగడలలో నొకగడమీఁద నీముద్దను బడవయిచిరి. పిదప నేలవఱకును వ్రేలాడుచున్న వస్త్రమును వెడలుపుగాఁజేసి తమకు అడ్డముగా నుంచుకొని గడను ఆకాశవీథి కెత్తిపట్టి నిటారుగా నిలువఁబడి 'ఊ' యని సంకేతించిరి.

గడగడలాడుచున్న గుండెలను బిగియఁబట్టికొని అహోబలుఁడు తలు పోరగాఁ దీసెను. బట్టచాటున ధూమలమయిన వెలుఁగులో మసకమసకగా నొకయెత్తయిన పదార్థమతనికి గోచరించెను. నిన్నటినుండియుఁ దన కనుల వ్రేలుచున్న దీర్ఘపురుషు నిపుడు సాక్షాత్కరింపఁ జేసికొనెను. అతఁడు కెవ్వున కేకపెట్టి మెల్లాలో వెనుక వెనుకకు వ్రాలెను.

అవధానులవారు వస్త్రముల నన్నిటిని ఆఱవయిచుకొని మెల్లగా మెల్లాలోని కేతెంచిరి. క్రమక్రమముగా కోలుకొనుచున్న అహోబలుఁడు కనులు మూసియు తెఱచియుఁ జూడఁదొడఁగెను. అవధానులవారు లోనికి మరలి పడమటితలుపు చక్కగాఁ దెఱచి నిండువెలుఁగులో పొట్టిగాఁ గనఁబడిరి. అహోబలుఁడు నక్కినక్కి చూచి మెల్లగా లేచెను.

'నాయనా! 'తలుపు నిండారఁ దీసినచో భయపడుదునా' యని యంటివే? ఇంటికి వచ్చిన క్రొత్తయల్లుని భయపెట్టితినే! పాపము! ఎంతపని యెంతపని! ఎక్కడను జెప్పకుము.'

ఈబుజ్జగ మహోబలుని బులిపించెను. భయపెట్టి పశ్చాత్తపము గొనువానికడ లంచము గొనుట కధికారము కలదుగదా!

'అయ్యా! అవధానులారూ! నాకొక మంచి తేలుమంత్రము– '

'నాయనా! ఆ, మంచిది. ఊరక భయపడితివి. ఈ మంత్రమునయినను జెప్పి - పాపము - నిన్నుఁ బంపుదును నీవి మడిబట్ట లేనా?'

'శుద్ధ - మడి.'

'అగుచో లోనికి రమ్ము'.

అహోబలుఁడు గడపలో కాలుపెట్టుటకుఁ గొంచెము జంకెను.

'ఇంకను భయమా?'

'లేదు లేదు.'

'ఆ పీఁటమీదఁ గూరుచుండుము.'

అహోబలుఁడు పీఁటకోడు చేతితో తడుముకొని కూరుచుండెను.

'నిన్న కుంటిపీఁట యనుకొని నేఁడును కుంటిపీఁట యనుకొంటివా?' అని అవధానులవా రతని కెదురుగా మఱియొక పీఁట వయిచుకొని కూరుచుండి భయపడవలదని హెచ్చరించి యుత్తరీయ మతనిపయి ముసుగు వయిచిరి.

అహోబలుఁడు కొంచెము గోడ కొఱగఁజొచ్చెను. అవధానులవారు పట్టుకొని 'ఇదిగో నేను పొట్టివాఁడనే' అని దాపునకుఁ దీసికొని ముసుఁగునదూఱి నొసట విభూతి రాచి చెవికడ నోరుంచి - 'హే వృశ్చిక రాజ! మమ అధఃప్రదేశ దశ దిశో' అను మంత్రమును జెప్పి నూఱుమాఱులు చెప్పించి ముసుఁగుదీసి 'నీవిఁకఁబోయి ఇంటి పంచలో ఏకాంతముగాఁ గూరుచుండి బిగ్గఱగా లక్ష జపముచేసి పిదప లెమ్మ'ని యాదేశించిరి.

అహోబలుఁ డత్తింటి కేఁగి వంటియింటి పంచలోఁ గూరుచుండి బిగ్గఱగా జపింపఁ దొడఁగెను.

## 2

పెండ్లికూఁతురు వసుమతియు, తండ్రికైలాసరావును, శిష్యుఁడు వాసుదేవరావును ప్రార్థనలను ముగించి గీతాపారాయణ మొనరించి చావడిలోనికి వచ్చిరి. కైలాసరావు కూర్చుండి 'వాసూ! అల్లుని పిలు! వసూ! మీయమ్మను బార్లీనీళ్లు తెమ్మను' అనెను. వారిరువురును వారివారి పనులకు వెళ్లిరి.

కైలాసరావు భార్య సోమమ్మయు, అవధానులవారి కూఁతురు మంగమ్మయు వంటింట మాటలాడుచుఁ గూరుచుండిరి. వసుమతి లోనికి రాఁగానే వారి సంభాషణ మాఁగిపోయెను. సోమమ్మ మంగమ్మను బంపివయిచి కూఁతును బార్లీ తయారొనరించుటకు నియోగించి తాను మెల్లగా చావడిలోనికి వచ్చెను.

'అల్లుఁ డేఁడీ?'

'ఈ కాలమున పెండ్లికూఁతుండ్ర సిగ్గు పెండ్లికొడుకులకు బదలాయింపఁబడినది. ఆయన వంటయింటిపంచలో మకాము. మీరు మీ కూఁతున కేమి పాఠములు చెప్పుదురో కాని నే నూరిలో తలయెత్తుకొనలే కున్నాను. దానికి రవంత సిగ్గు నేర్పుఁడు. ఆఁ డుదానికి సిగ్గే లేనిచో కొజ్జా.'

ఈ మాటలు కొన్ని సత్యములే కాని సోమమ్మ తన యల్లునిమీఁది కోపము నంతయు కూఁతుమీఁదికి త్రిప్పెను. ఈ మాటలకు కైలాసరావు మాటాలాడలేదు. సోమమ్మ కొంచె మాఁగి యాలోచించి మెల్లగా నిటులనెను - 'వెదకి వెదకి వేయిరూపాయలు వచ్చునని మంచి యల్లుని దెచ్చినారు! అప్పుడే ఊరిలో నందఱును నామకరణము చేసినారు - ఓ- బ-య్య. ఛీఛీ! కలిపి యుచ్చరింపఁజాలను.' అని యిటులు చెప్పుచుండఁగా నామె కనులలో నీ రుబికెను.

కైలాసరావు తెల్లఁబోయి చూచుచుఁ గూరుచుండెను. సోమమ్మ యిటులనెను - 'మీరెన్నఁడును మాటకు మాట చెప్పరు. నాకు నడుమనడుమ కసి వచ్చును. వేయి మాట లెందులకు? పిల్లదాని గొంతుక కోసి వేసితిరి. నలుగురిలో నాకు తలవంపులు తెచ్చితిరి. మీరు హెడ్‌మాస్టరుతరువాత హెడ్‌మాస్ట రంతవారాయె. నూటముప్పది జీతమాయె. బాలురసంగతులు మీకు తెలియనివికావాయె. కట్నమనిన మీకు తప్పాయె, తెచ్చితి రొక రాతిని, కట్టుకొనుఁడు కంఠమునకు-' అని యిటులు పలుకుచుండఁగా సోమమ్మ కంఠము గద్గదమయి బిగిసికొని పోయెను.

కైలాసరా విటు లనెను - 'కన్యావరయతే రూపమ్' అని అమ్మాయికి కుఱ్ఱని జూపితిని. అది సంతసించినటులు కానిపించెను. 'మాతా విత్తమ్' అన్నటులు వేయి రూపాయలు వచ్చునని నీ వేనుఁగును ఎక్కితివి. పెండ్లి జరిగి పట్టుమని పదినాళ్లు కాలేదు. అప్పుడే గోఁజిలుటయా?

సోమమ్మ యిటు లనెను - 'పదునాలు గేండ్ల పిల్లకు దాని కేమి తెలియును? చదువు రాని సోమమ్మకు నాకేమి తెలియును? తెలివి గలవాఁడని మీరు సంతసించితిరి. అతఁడు వట్టి తెలివితక్కువవాఁడు. ఎందులకును పనికిరానివాఁడు.'

'మనకు తెలియకకాని సృష్టిలో పనికి రానిదేది? మనుష్యుఁడు సృష్టిలో ఒరవడి. దానిలో కుఱ్ఱఁడు మేలుబంతి. అట్టివానినా పనికిమాలినవాఁ డనుచున్నావు?'

ఈమాటలకు సమాధానము చెప్పినను లాభము లేదని కడుపు పగిలి సోమమ్మ చూచుచు నిలువఁబడిపోయెను. వాసుదేవరావు చావడిలోనికి వచ్చెను. కైలాసరావేమో యాలకించుచు 'అది తుమ్మెద మ్రోఁతయా యేమి'? అనెను. వాసుదేవరావిటులనెను - 'కాదు. అల్లుఁడుగారి కెవరో ఇంపోజిషనిచ్చినటులున్నారు. ఆయన నామాట వినఁదలఁచు కొనలేదు.'

కైలాసరా వాలోచించి 'అది కిండర్ గార్టన్ పద్ధతిగాని, మాంటిసోరీ పద్ధతిగాని కాదు. ఫక్తు ప్రాచీన ఆర్యవిద్యాపద్ధతి' అనెను.

నగవును కోపమును ఆఁపుకొనలేక సోమమ్మ 'నానెత్తిపద్ధతి' అని యేమేమో చెప్పఁబోవుచుండఁగా కైలాసరావు 'వాసూ! నీవు పోయి అతనిని కలవరపెట్టక ఆ యింపోజిషనును తెలిసికొనిరమ్ము' అని చెప్పఁగా నవ్వుచు వాసుదేవరావు మరల లోనికి వెళ్లెను.

సోమమ్మ యిటు లనెను – 'కలవరపెట్టుటయే! రాయయిన కలవరపడునుగాని మీ యల్లుఁ గుఱ్ఱఁడే?'

'సరికాని అతని తెలివి తేటలలో లోటేమి కొంచెము చెప్పు!'

"చెప్పవలెనా? అమ్మాయిని అతనిని కూరుచుండఁబెట్టి పరీక్షచేయుఁడు!'

'అది యెటులు? అమ్మాయి మూఁడవ ఫారమాయె; అతఁడు అయిదవ ఫారమాయె. అదియుఁగాక పరీక్షవలన నేమి తేలును? తెలివిగలవా రెందఱెందఱు పరీక్షలు తప్పుదురో తెలియునా?'

'ఔను. ఎ–మ్మే ప్యాసయిన తరువాత యల్–టి ముమ్మాఱు మీరు తప్పితిరి. మీరేమి తెలివిమాలినవారా? మీవంటి పంతుళ్లకు మీయల్లునివంటి బాలురు మేధావులు! సరికాని, ప్యాసగుచో పైక్లాసులో వేయుచున్నారా, తప్పుచో వేయుచున్నారా?'

'ఆ మాట వేఱు.'

'ఈ పరీక్షలగోల యేల? అతనికి లోకజ్ఞానమే లేదు.'

'అదియా? నాకు బాలుర యనుభవమెంత కలదో నీకు తెలిసినదేకదా! లోకజ్ఞానము తక్కువగా నున్నవారికి తెలివి హెచ్చు.

'ఎందుల కీవాదన? మీ యల్లుఁడు బృహస్పతి!'

వంటయింట నున్న వసుమతి యీమాటలనాలకించుచునే యుండెను. పెండ్లి యెప్పుడదలలో తనపాలుగూడ కలదనుమాట వసుమతికి లెస్సగా నాటెను. వసుమతి బార్లీకెటిలు పట్టుకొని చావిడిలోనికి వచ్చెను. వెనువెనుకనే వాసుదేవరావు వచ్చెను. అతఁడు నవ్వుచు 'ఆ యింపోజిషనుకు అంతుపొంతులు లేవు' అనెను.

అల్లుని తెలివితక్కువతనము వసుమతి ముందు ప్రచురమగుట కిష్టపడక సోమమ్మ 'వసూ! నేను వచ్చి పాలు కలిపి అందిత్తును గానినీవు పోయి ఆ కెటిలు లోపలనుంచి పాలుపొంగి పోకుండఁజూచుచుండుము' అనెను.

కైలాసరావునకు భార్యయుద్దేశము తెలిసెను. అతఁడు తొందరతొందరగా నిటులనెను. – 'సిన్ ఆఫ్ సీక్రెసీ! రహస్యము పాతకము. పిల్లల కిప్పటినుండియు దాఁపరికము నేర్పుచున్నావు. వసూ! నీవిచటనే యుండుము! వాసూ! ఆయింపోజిష నేదో చెప్పు!'

సిగ్గుచే, కోపముచే క్షోభముచే సోమమ్మ తుకతుకలాడిపోయెను. వసుమతి ముఖము కొంచె మెఱ్ఱఁబాఱుటచూచి యోర్వఁజాలక 'వసూ! నీవు లోనికిరా' అని శాసించి కూఁతురు తనవెంట వచ్చుటయు, రాకుండుటయు గమనింపకయే రివ్వున లోనికి వెళ్లెను. వాత్సల్యము గుఱియు తండ్రిచూపుల వాగురలో వసుమతి నిలువఁబడిపోయెను.

'వాసుదేవా! ఏదా యింపోజిషన్?'

'హే వృశ్చి రాజ! మమ అధఃప్రదేశే దశ దశ!'

'ఏమీ? హే వృశ్చికరాజ? అనఁగా తేలు రాజా అనికదా! పైని జెప్పు.

'మమ అధః ప్రదేశే'

'అనఁగా?'

'నా క్రింది ప్రదేశమునందు.'

'లిటరల్ ట్రాన్సులేషనా? నాముడ్డిమీఁద అనిచెప్పు.'

వసుమతి పెదవులమీఁద నొక హాస్యరేఖ యుదయించెను.

కైలాసరా విటులనెను. 'మంచిది. ఓ తేలురాజుగారూ, నా ముడ్డిమీఁద ఊఁ, పైని?'

'దశదశ.'

'ఇదేఘట్టము! దశ యనఁగా పది. నాముడ్డి మీఁద పది యేమిటి? అర్థసందర్భము లేదు. వాసూ! ఇది యేదో మహామంత్రము.'

'కాదండీసార్. క్రియలేక వాక్యముండదుగదా! దశ యనున దేదోక్రియ.'

కైలాసరావు తలయూఁపి 'ఆ! దశధాతువయియుండును. ఆ.. తేలినది, కుట్టుమని యర్థము. ఇపుడంతయు కలుపు' అనెను.

'ఓ తేలురాజుగారు నాముడ్డిమీఁద కుట్టుఁడు!'

వసుమతిముఖము సిరా యాయెను. కైలాసరావది గ్రహించి 'వాసూ! నమ్మిక వంటి దినుసీ ప్రపంచకమున వేఱొకటి లేదు. 'మరామరా' రామరామ యాయెనా లేదా? సరి, మీ రెవరును అహోబలుని కదలింపకుఁడు. జపమయిన పిదపనే అతఁడు వచ్చుఁ గాక. వసూ! మీ యమ్మను – ఆమె యెందులకులే! నీవే బార్లీ పట్టుకొని రా' అనెను.

గంభీరమగు ముఖముతో మందమగు గమనముతో వసుమతి లోన కేఁగెను. కూఁతు మొగమును, పిదప నడకను జూచు తండ్రిముఖమున నగ వంకురించెను. అది దుఃఖమునకే వ్యంజకమో, సుఖమునకే వాచ్యమో యెవరు చెప్పఁగలరు?

## 3

మనుగుడు పాయెను. అహోబలుండింటికి వచ్చి యిరువదిరోజులాయెను. నేఁడో రేపో పరీక్షాఫలితములు వచ్చునని తెలిసెను. అతఁడు వెంటనే పంతులుకడకు వెళ్లెను. తిరిగి వచ్చిన నాఁ డన్నము తినక ముసుఁగు పెట్టుకొని పడుకొనెను.

మనుగడుపయి వచ్చిన తరువాత నతఁడు కాఫీ మొదలుపెట్టెను. అహోబలునితల్లి వీరవెంకమ్మ పెత్తనమునకు వెళ్లి యిరుగుపొరుగమ్మలతో 'మా అబ్బాయికి కాఫీవేళ దాఁటి పోవుచున్న దమ్మా; ప్రొద్దు గ్రుంకునపుడు మరల వచ్చెద'నని వినయమున విన్నవింప మొదలిడెను.

అహోబలుఁ డీనాఁడు తల్లికి తీరికను పనినిగూడ నిచ్చి పడుకొనెను. తనవినయము విన్నవించుకొనుట కీనాఁ డవకాశము లేదుకాని 'మావాఁడీనాడు కాఫీ తాగలేదమ్మా!' అని మాత్ర మొక రిద్దఱితో చెప్పుకొనెను.

పదిగంట లాయెను.

'ఏమిరా నాయనా! ప్రొద్దున కాఫీ త్రాగవయితివి! ఎంతపొద్దెక్కెనో చూచితివా? లేచి రెండు మెతుకులు గతికి పడుకో'.

అహోబలుఁడు మాటాడలేదు.

'ఎంత పొద్దెక్కిపోయిందెంత పొద్దెక్కిపోయిం దమ్మమ్మగారూ! నన్నింటికి పంపెయ్యండి' అని దాసి తొందరపెట్టెను.

'ఇదిగో - అబ్బాయి - ఈ పొద్దు కాఫీ తాగలేదు. ఇంతవఱకు లేవనేలేదు. ఏకముగా గిన్నెలన్నియు మధ్యాహ్నము వేయుదును లే. పోయి తొందరగా మాత్రము రా.'

'ఇంతసేపు ఉట్టినే కూచోఁబెట్టా రెందుకండీ? తలనొప్పికూడా తగిలింది. ఈసంగతి ఇందాఁకే చెపితే ఈపాటికి కూలికో నాలికో పోయివుందును. ఆరింట్లో పని చేసుకున్నప్పుడే బావుండేది.'

'అదిగో నీ కదేరోగము. ఆరింట్లో అంఛావు. ఆరింట్లోకన్న జీతం ఎక్కువ తీసుకుంఛూ ఇదేమి మాటంఛ? అలికీజాతి మోహం మండ!'

"ఏంటండీ? 'ఇథంసెడి యీడిగాణ్ణి సేస్కుంటే సచ్చిందాఁకా సాఁపలు మోయించా'దని మీరిచ్చే జీతానికి సతపొద్దూ పడి గాపులాయె."

'సరేగాని మాచీ! ఈ వేళ అట్టే మాటాడకు. అబ్బాయి కాఫీ తాగలేదని చెప్పలా? నీవే, తొందరగా పోయిరా!'

అహోబలుఁడు కాఫీ ఆరంభించినపిదప తనశక్తి చేనయిననేమి, వీరవెంకమ్మ యుదారతచే నేమి మాచికిఁగూడ కాఫీలో వాటా దొరకుచుండెను. నేఁడు పస్తు. దాన తలనొప్పి. కాఁబట్టి మాచి తన యుపవాసకోపమును తగు మాత్ర మమ్మమ్మగారిమీఁదఁ జూపి వెళ్లి పోయెను. పదకొండు గంటలాయెను.

'ఏమిరా నాయనా! రెండుజాములు కావచ్చెను.'

అహోబలుఁడు మాటడలేదు. కాని కాళ్లు తన్నిపట్టి నిద్ర నీల్గి నారి బెతికిన వింటివలె సాగి 'మరల' లబ్బరుబెల్టువలె ముడుచుకొనెను.

'నాయనా! సుస్తీగా నున్నదా?'

'ఊ.'

'చెప్పకపోతివి! శివల మల్లయ్యను పిలిపించి యీపాటికి ఉండ వేయించి యుందునే. నజ్జు చేసినదేమో! మడిగట్టు కొనియుంటిని. ముట్టుకొనుటకు వీలులేదు. నాయనను.'

'ఊ'.

'అయ్యయో. ఇందాఁకనే కనుఁగొనక పోతిని! వట్టి తెలివిమాలినదానను. మతిలేని దానను నాయనా! మాచిని మల్లయ్యకొఱకుఁ బంపినచో నీపాటికి వచ్చియుండును.'

అహోబలుఁడు మఱి మాటాడలేదు. వీరవెంకమ్మ వంటయింటి తలుపులను దగ్గఱఁ బెట్టి బడివద్దకు వెళ్లెను. బడిపిల్ల లూరివారందరకును నవుకరులేగదా!

'ఒరే విస్సాయ్! నీవే నీవే, మాణిక్యం లాటివాఁడవు. నీకే మా అబ్బాయి - మా అబ్బాయే - కాఫీ తాగేవేళే - కొంచెం కాఫీ యిస్తాఁగాని - ఇదిగో ఒక్కసారి పరిగెత్తి - ఒళ్లుపరుగే - ఒళ్లుపరుగే - మధ్య ఆఁగకేం - శివల మల్లయ్యని, నేను వెంటనే రమ్మన్నానని వెంటఁ బెట్టుకుని తీసుకొనిరా.'

విస్సాయికి కాఫీపేరు స్వర్గములోనిది. ఆ యూరంతటిలో వీరవెంకమ్మగారి యింటనే కాఫి యను దినుసు తయారగునని బడిపిల్ల లందఱకును దెలియును. బడిపిల్లలు వీరవెంకమ్మ యింటి ముందునుండి పోవుచు 'మన మేష్టారుకు కాఫీ తెలియదు. అహోబిళం అన్నకే ఎప్పుడూ కాఫేరా. అహోబిళం అన్నే మనకు మేష్టారయితేనా?' అని చెప్పుకొనుచుందురు.

విస్సాయి పంతులుగారి దెసఁజూచెను. ఆయన ముఖమిచట లేదు. విస్సాయి రివ్వున మల్లయ్య యింటికిఁ బరువెత్తెను. 'మానాయనే మానాయనే' యనుకొనుచు వీరవెంకమ్మ యింటికి మరలి యొకసారి కుమారుని బిలిచెను. ప్రత్యుత్తరము రాలేదు.

అంత నామె గుమ్మముకడకు వచ్చి వైద్యునికొఱ కెదురు చూచుచు నిలువఁబడెను. విస్సాయి రోఁజు కొనుచువచ్చి 'కాపీ యియ్యి' అనెను.

'మల్లయ్య యేఁడీ?'

'అడుగో అడుగో' అని వేలితోఁ జూపి 'ఆలస్యమయితే పంతులు తంతాఁడు. నాకు కాపీ యియ్యి' అని విస్సాయి వంటియింటి కడకుపరువిడెను.

'ఒరేయ్ బడిగుడ్డలు! ఒకజాతివాళ్లని కాదు. ఆఁగు' అని వీరవెంకమ్మ లోపలి కేఁగి 'అహోబలమే - పొద్దున్న - కాఫీ తాగలేదు. మద్దాన్నం మూఁడుగంటల వేళే- తాగుతాఁడు. అప్పుడు రా' అనెను.

'ఏం? ఎందుకు తాగలా?'

'ఇవ్వేళే - జబ్బు - జబ్బు చేసింది.'

'కాపీ తాగేవాళ్లకు జబ్బు చేయదుగా. బలం చేస్తుంది. బలం చేస్తే నేను బడిపెద్దను కొడతానుగా!'

'కాదు నాయనా కాదు. కాఫీ దొరలు తాగుతారు. మద్ధాన్నం రా. పొద్దున్న మాచికిఁగూడా ఇయ్యలా.'

'మాచిగూడా తాగుతున్నదీ?'

'ఆ'

విస్సాయి కొంచె మాలోచించి 'నేను మీ కాపీగిన్నెలు తొలుస్తాగాని దాన్ని మాని పించి రోజూ నాకు కాపీ పోస్తావూ?' అనెను. వీరవెంకమ్మనవ్వెను. 'ఏం ఏం? పొయ్యాలి పొయ్యాలి' అని విస్సాయి అనుచుండఁగా బడిపెద్ద పంతులుగారి యధికారమును స్వయముగా మోసికొనివచ్చెను. విస్సాయి తలుపు తెఱచికొని వంటయింటిలోనికి దూఱెను.

'ఒరే ఒరే మాలబట్టలు! బయటికి రా, బయటికిరా!, అని వీరవెంకమ్మ యనెను. బడిపెద్ద లోనికి దూఱఁబోయెను. వీరవెంకమ్మ యదలించెను. బడిపెద్ద చూపుడువేలితో బెదరించి వెళ్లిపోవుచుండెను. 'ఒరే రామాయ్! విస్సాయిని నేను తీసికొనివచ్చానని మీ పంతులుతో చెప్పు. మీ పంతులు రేపు మాయింట్లోనే వారంలే' అని వీరవెంకమ్మ యనెను. బడిపెద్ద రుసరుసలాడుచు వెళ్లిపోయెను. ఇంతలో బడిపిల్ల లందఱును పలకలు పుచ్చుకొని యింటికిఁబోవుచుండిరి. విస్సాయి తన పలక పుస్తకములదెసఁబోక యాపిల్లలతోఁ గలిసి యింటికిఁబోయెను. ఇంతలో శివలమల్లయ్య వచ్చెను.

'ఏమండీ, పిలిచినారఁట?'

'ఔను నాయనా! అబ్బాయి లేవలేదు.'

'గాలిపాటు బాగుగాలేదు. ఎక్కడఁ జూచినను చలిజ్వరములు. కాని అబ్బాయి గారికి మనగుడుపు బరువుచేసియుండును.'

'రా నాయనా లోపలికిరా!'

మల్లయ్యయు వీరవెంకమ్మయు లోనికేఁగిరి.

'చేయేదీ?'

'అహోబలుఁడు నిద్రనీల్గెను.'

'ఏఁబలంగారూ, ఏమిటి సుస్తీ?'

'ఊ.'

'మీదంతయు గొట్టాలవైద్యము. ఏదిచేయి?'

అహోబలుఁడు చేయిచ్చెను. మల్లయ్య చేయిచూచెను. కడుపుమీఁద చేయివేసి చూచెను. అతనికి రోగమేమియో తెలియలేదు. వేఁడిలేదు. నాడిలో తేడాలేదు. ఊయను మూలుగు గూడ బరువుగా లేదు. ఏమి చెప్పవలయునో వైద్యునకు తోఁచలేదు. వీరవెంకమ్మ 'ఏమి మల్లయ్యా, జబ్బు దాఁగి యున్నటులున్నదా?' అనెను.

'ఏఁబలంగారూ! అటులు పడుకొంటి రేమండీ? ఈపాటికి వసంతకుసుమాకరము, పూర్ణచంద్రోదయము తినుచుండవలసిన రోజులు!'

అహోబలుని కింకను శృంగారరసము తరవాయి, అందులో మందులలోని శృంగార రసముదెస మఱియు మందుఁడు. ఇట్టి యహోబలుఁడు వెంటనే యిటు లనెను– 'వసంత కుసుమాకరము, పూర్ణచంద్రోదయము తినినచో పరీక్ష ప్యాసగుదురా?'

'అదీ దారి. మంచిది వీరవెంకమ్మగారూ! అబ్బాయికి జబ్బుకాదు. పరీక్ష జబ్బు.'

అహోబలుఁడు మాటాడక తలవంచి కూరుచుండెను. మల్లయ్య అహోబలునివంక నొకమాఱును, వీర వెంకమ్మవంక నొకమాఱును జూచి వెళ్లిపోయెను.

పరీక్షలు తప్పినవారు విసమును ద్రింగి మఱి పరీక్ష లీయవలసిన యపాయమును దాఁటుదురని వీరవెంకమ్మ వినియుండెను. ఆమె యాపాదమస్తకము కంపించెను. మెల్లమెల్లగా కోలుకొని 'ఏల నాయనా గుంజాటన? పరీక్ష తప్పిననేమి? చదువుకొనువారు తప్పుదురు గాని యీ శివల మల్లయ్యగాని, నేనుగాని తప్పుదుమా?' అనెను.

'అమ్మా! నే నిఁకఁ జదువను.'

వీరవెంకమ్మ కొంచె మాలోచించెను. ఇటులనెను. : – 'మీ తండ్రిగారు చదివినారా, మీతాతగారు చదివినారా? చదువుకున్న మగవాని కేమిలోటు? కాని కోడలు చదువుల సరస్వతి యఁట గదా! నీకన్న రెండు కళాసులే తక్కువ యఁటగా! అందులకనియే యాలోచించుచున్నాను.'

'అమ్మా! నేనింకఁ జదువను.'

'నామాట కొంచెము విను నాయనా! మీపంతులు మనకు చుట్టము; నామాట దాఁటఁడు. నేను చెప్పి పయికళాసులో పడవేయింతును.'

అహోబలుఁ డీతూరి మాటాడలేదు.

'నాయనా! ఈ యేడు జరుగనీ! ఈ యేఁడే పెండ్లి అయినదా; ఈయేఁడే బడిమానుకొన్నచో పెండ్లి చదువందురు. ఈయేఁడు కోడలిచదువు మానిపింతును. అంతగా నీకు బాగుండనిచో పైయేఁడు మానుకొందువుగాని నేఁడో రేపో పిల్ల కాఁపురమునకు రాఁగలదు. దానితో చిక్కులన్నియు తీఱిపోఁగలవు. లే ఇఁక లే.'

అహోబలుఁడు మొగము చేరెఁడుచేసి కొని 'అమ్మా! నీవు పంతులుగారికడ కెపుడు వెళ్లుదువు?' అనెను.

'రేపు.'

'సారి ఇదా? నాకు అన్నమువలదు.'

'మంచిది సాయంకాలమే వెళ్లెదను. లే! నాయనా! లే!'

## 4

అల్లున కావాహన విసర్జనములయిన కొలఁది దినములలోనే యింటిని బంధువుల కప్పగించి కైలాసరావు కుటుంబము కాకినాడఁజేరెను. వసుమతి పెండ్లిమోజుచే మూఁడవ ఫారము తప్పలేదు. నాలుగవ ఫారములోఁజేరెనుగాని యిందుల కొక తంటా వచ్చెను. 'చూచిచూచియింత యీడువచ్చిన పిల్లను బడిలోని కా తల్లి యెటులు పంపుచున్నది? తానిటు లింతయీడు వచ్చినపిదప బడిలోనికి వెళ్లి చదివినదా?' అని వీరవెంకమ్మ కైలాస రావు బందుగులకొకరికి ఉత్తరము వ్రాయించెను. సోమమ్మ కీవార్త తెలియవలసినరీతిగాఁదెలిసెను.

సోమమ్మకు తనతప్పిదమిపుడుతెలిసి వచ్చెను. పెండ్లికి ముందు సోమమ్మ స్వయముగా వెళ్లి పెండ్లికొడుకునకు వేయిరూపాయలు రాఁబడియనియు, వియ్యపురా లమాయికురాలనియు, వియ్యంకుఁడు పదేండ్ల క్రిందనే పోయెననియు తెలిసికొని వచ్చెను. వీనిలో నొకవార్తకన్న మఱొకవార్త సోమమ్మ కానందదాయక మాయెను. ఇపుడా యమాయికురాలగు వియ్యపురాలే యింతపని చేసికూర్చుండెను. వీరవెంకమ్మ యిటులు వ్రాయించుట కల్లుఁడు తప్పుటయే ముఖ్యమయిన హేతువయియుండునని సోమమ్మ యనుమానించెను.

కైలాసరావు కంటఁబడుఁగనే – 'మీ యల్లుని పరీక్ష యేమయినదో కనుఁగొంటిరా?' యని సోమమ్మ యడిగెను.

'లేదు'.

'మీ రటులందురని నాకుఁదెలియును. ఇఁక నల్లుని నచట నుంచి చదివించినచో లాభములేదు. కట్టుకొన్న తరువాత మనకుఁదప్పదు. అల్లునిఁ దెచ్చి పెట్టుకొని యిచటనే చదివింపుఁడు.'

'అది యంత మంచిపని కాదు. అతఁడిచట నున్నచో పరతంత్రుఁడయిపోవును. బాలుర పెంపునకు స్వాతంత్ర్యమే జీవగఱ్ఱ.'

'మీయుపన్యాసములు లోకులకుఁగాని మనకుఁ గొఱగావు. మీకుఁ జెప్పి లగ్గ లేదు గాని యిఁక అమ్మాయిచదువునకు విడుదల యొసఁగుఁడు.'

'ఏల?'

'వియ్యపురాలి హుకుము.'

'ఆఁడువారి కేమియుఁ దెలియదు. కాలమిపుడు మాఱుచున్నది, మాఱినది. నే నామెకుఁ జెప్పి యొప్పింతునులే. నీవు గడబిడ పడకుము' అని కైలాసరావనుచుండఁగా పేదవిద్యార్థు లయిదుగురు వచ్చి నమస్కరించిరి. కైలాసరావు ఆశీర్వదించి 'కూర్చుండుఁడు' అనెను. వారు కూర్చుండిరి. వారు ఉత్తరీయములను గప్పుకొనియుండిరి. ఆ యుత్తరీయములయు, చొక్కాలయు చిల్లులనుండి వాడువాఱిన చర్మములును, ఎముకలును అచటనచటఁ గానిపించుచుండెను.

'వసూ!'

చదువుకొనుచున్న పుస్తకమున వేలు గుర్తుపెట్టుకొని వసుమతివచ్చి కూర్చున్నవారిని జూచి వెంటనే వెనుదిరిగిపోయి అలమరు తెఱచెను. రాత్రియే తండ్రికిజీతము వచ్చెను. ఇరువదియయిదు రూకలు తెచ్చి యొకొక్కని కయిదేసి యిచ్చెను.

'అమ్మాయీ! క్రొత్త బట్టలమూటలో అయిదు'త్తరీయములు తెచ్చి వీరి కిమ్ము.'

వసుమతి లోనికేఁగి తెచ్చి యొకొక్కని కొకొక్కటి యిచ్చెను. సోమమ్మ అదంతయు రెప్పవాల్పక చూచుచుండెను.

విద్యార్థులు మీఁదఁ గప్పుకొని కైలాస రావునకును, సోమమ్మకును నమస్కరించి వెళ్లిపోయిరి.

కైలాసరావునకు వచ్చు జీతమున ఏఁబది రూకలు పోను మిగిలినదెల్లను ధర్మ–ఖర్చు. సోమమ్మ కీ విషయమున ఎన్నఁడును అనంగీకారములేదు. పైఁగా ఇటులు ధర్మముచేయు భర్తయెడల నామెకు భక్తి కలదు. ఇంతియకాక మిగిలిన యేఁబదితోడనే

యామె సంసారమును చల్లగా సాగించును. ఆమె యేనాఁడును క్రొత్తనగకుఁగాని, క్రొత్తకోకకుఁగాని కోరికగొని యెఱుఁగదు. కూఁతుపెండ్లి యయిన తరువాత జరిగిన మార్పువలన ఈసంసారమునకు రాఁబోవుచున్న చిక్కు ఆమెకు విస్పష్టముగాఁ గానిపించెను. ఆమె తన మనసులోని వేదనను తన మనసులోనే యడఁచుకొని వంటయింటిలోని కేఁగెను.

ఇంతలో వాసుదేవరావు వచ్చి 'పిన్నమ్మగారూ! మీకుఁ గావలసిన బజారుసరుకు లేవియో చెప్పుఁడు!' అనెను.

'నాయనా! కూర్చుండుము, కూర్చుండుము!'

ఈ పలుకుబడిలోని కోరికను గనిపట్టి వాసుదేవరావు కూరుచుండెను.

'నాయనా! నీవు రేపే ఊరికి వెళ్లవలయును.'

'బాబయ్యగారు చెప్పలేదే?'

'వారు చెప్పరు, చెప్పరు, చెప్పరు. వారికి వెనుజూపులేదు. ముందుచూపు మునుపే లేదు.సరి. అల్లుఁడు పరీక్షయిచ్చెనో లేదో నీవు కనుఁగొనిరావలెను.'

'దీనికి ఇంతప్రయత్నమేలండీ? బాబయ్యగారొకచీటి వ్రాయుచో రేపీపాటికి తిరుగు టపాలో మేష్టరుగారికడ నుండి ప్రత్యుత్తరము రాఁగలదు.'

'మీ బాబయ్యగారు వ్రాయరు. అల్లుని పరీక్ష తెలిసికొనుట అనధికార ప్రవేశమునందొక వ్యాసఘట్టము.'

వాసుదేవరావు సమాధానము చెప్పఁబోవుచుండఁగా వసుమతి వచ్చెను. వాసుదేవరావు నోటిలోనిమాట నోటలోనే యాఁగి పోయెను.

'ధ్యానమునకు వేళ కాలేదా? తీరికగా కూరుచుండి బాతాఖానీ వేయుచున్నావు?' అని వసుమతి యనెను.

కైలాసరావునకే మతమును ఇష్టము లేదు కాని అన్నిమతములును పరమ-ఇష్టములు. భగవంతు నెల్లపుడును ధ్యానించుట తక్క నతనికి మతములలోని సూక్ష్మాంశము లతోఁగాని వ్యాఖ్యానములతోఁగాని పేచీలేదు. అతఁడిదివఱకు సోమమ్మనుగూడ తన ధ్యానపుబడిలోనికి రావింపఁజూచెను. గాని శక్యముకాక విడిచిపెట్టెను. అందఱకును అన్నము పెట్టినపిదప తులసికోటముందుగాని ఆమెకు ధ్యానము కుదరదు. అటులగుటఁ జేసి వీరి మూవురకే ధ్యానపుబడి. ఈధ్యానపుబడిలో నలువదేండ్ల యీడుగల కైలాసవరావు వసుమతితోడను, వాసుదేవరావుతోడను సమానమయిన వయసుకలవాఁడయిపోయి యానంద బాష్పములు రాల్చుచుండును.

'నీవు ముందరవెళ్లు వసుమతీ! వాసు ఇపుడే వచ్చును' అని సోమమ్మ యనెను.

'కలిసియే వెళ్లుదు' మని వసుమతి యనెను.

సోమమ్మకు తల తిరిగినటులాయెను. 'అతనితో నేనొకమాట చెప్పవలసియున్నది. నీవు బయటికిఁబొమ్ము' అని సోమమ్మ యనెను.

వసుమతి చిన్నఁబోయి తలవంచుకొని మఱిమాటాడక యటనుండి మెల్లగా వెళ్లి పోయెను.

'ఏమి నాయనా! రేపు నీవు వెళ్లవలెను.'

'బాబయ్యగారి కిది యనధికార ప్రవేశమగుచో మనకుఁ గాదాయేమి?'

వాసుదేవరావుకడనుండి యిట్టి ప్రత్యుత్తరము వచ్చునని సోమమ్మ తలఁచి యుండలేదు. ఆమెయెడ వసుమతి యెంత వినయవతియో వాసుదేవుఁ డంత వినయవంతుఁడు. ఇట్టి చింతలోఁగూడ ఈ పరాయి పిల్లవానిపై కోపపడు దుస్స్వభావ మామె కరిది. ఆమె హృదయమందలి జ్వాల హృదయమందే యడఁగాఱెను. అంతట సోమమ్మ 'నాయనా! మంచిది' అనెను.

వాసుదేవరావు గూడ సోమమ్మకడనుండి యిట్టి ప్రత్యుత్తరము వచ్చునని యనుకొన లేదు. అతఁడు పిడుగుపడునని యెదురు చూచుచుండెను. గాని అమృతమును చవిగొనియెను. అతఁ డామెకు నమస్కరించి ధ్యానపు బడిలోనికి వెళ్లిపోయెను.

## 5

స్కూల్ ఫైనలుక్లాసు - బాలురు ఆంధ్రోపాధ్యాయునికడ బోధ పడయుచుండిరి. క్లాసులోఁ గూరుచున్న బాలురందఱును నూఱుతలలు గల యొక యల్లరి జంతువు.

నూఱుతలలు గల యొక జంతువునకు బుద్ధుఁడహింస బోధించెను. అది యఱిగించుకొనలేక పలుమాఱులు వగమనము చేసికొని తుట్టతుదకు జీర్ణించుకొనెను గాని యీక్లాసు జంతు వెన్నఁటికిని జీర్ణించుకొనఁజాలదు.

ఈ జంతువునకు మిగిలిన క్లాసులన్నియు బందిలిదొడ్లు. తెలుఁగు క్లాసు ముక్తి. 'స్వేచ్ఛగా తిరుగుదువా, లేక తెలుఁగుక్లాసులోఁ గూరుచుందువా;' యని యే బాలునడిగినను అతఁడు 'తెలుఁగుబడిలోఁ గూరుచుండుదు' ననును. అహోబలుఁడు తెలుఁగుబడిలో నడుమనడుమ నక్షత్రమువలె మినుకుమినుకు మనుచుండును.

ఉపాధ్యాయుఁడు బాలవ్యాకరణమును బోధించుచు అహోబలుని జూచి - 'వాటీజ్ కళ?' అని యడిగెను.

'కళ యనఁగా ఆర్టు' అని అహోబలుఁడనెను. కొందఱు బాలురు పాదములతో నేల మట్టిరి.

'వెఱ్ఱికళ, పిచ్చికళ'యని యుపాధ్యాయుఁడనెను. అహోబలున కిపుడు స్మృతి వచ్చెను; తెల్లఁబోయెను.

అహోబలుని ప్రక్కనే పూర్ణచంద్రరావు. అతఁడు వామనమూర్తి. తెలుఁగుపండితుఁ డతనికి కుబ్జ యను పేరిడెను.

ఉపాధ్యాయుఁడు – 'ఏమిరా కుబ్జా! నీవు?' అనెను.

"'నీవు' అనునది మధ్యమపురుష!" అని పూర్ణచంద్ర రావనెను.

'స్టాం డప్ ఆన్ ది బెంచ్.'

పూర్ణచంద్రరావు బల్లమీద నిలువఁబడెను. 'నీవు ప్రతిదినమును ఇటుల బల్ల మీఁద నిలువఁబడియుందువేని పొడు గెదుగఁగల' వని ఉపాధ్యాయుఁడనెను. 'కాదండీ. పాఠముతోపాటు వాఁ డెదుగుట మఱచిపోయెను. గొఱ్ఱె యెంత యెదిగినను తోఁక బెత్తెఁడే! ఇఁక మీకుబ్జను సాగఁదీయుటకు భార్యాదేవి శ్రీకృష్ణమూర్తి రావలెను' అని సుబ్బారా వనెను. 'ఓహోహో! రైలులో నీకునిండు తిక్కట్టా? సగము తిక్కట్టా?' అని యుపాధ్యాయుఁడనెను. అందఱును 'గీ' యని యఱచిరి.

'నేను అర తిక్కటుతోనే వెళ్లుచున్నాను గాని మొన్న హైదరాబాదా వెళ్లినప్పుడు మిగుల పరీక్షచేసిరి. తుదకు తూఁచిరి. ఇది సామానే యగుచో నాలుగురూపాయలు చార్జీ అయ్యేడిదని రెట్టింపుచార్జి వసూలుచేసిరి.'

'ఓకుబ్జా! నీపెండ్లాము పొడుగుదా? లేక పొట్టిదా?' అని యుపాధ్యాయుఁడు ప్రశ్నించెను.

'పెండ్లాము అనుపదము నడుమఁ గూడ నున్న దండి పొడుగు! అదేనండి చిక్కు! ఎపుడేని ప్రేమకలిగినపుడు ముద్దు పెట్టుకొనుటకుఁగాని, తిన్నగా సమాధానము చెప్పనపుడు లెంపకాయ పుచ్చుకొనుటకుఁగాని యెత్తుబల్ల యొకటి చేయించుకొనవలసి యున్నది.'

'మంచిది, మామగారరణ మిచ్చెదరులే.' తరువాత 'వెంకటరావూ! మధ్యమ పురుష యన నేమి?' అని యుపాధ్యాయుఁ డడిగెను.

'అహోబలుఁడును, కుబ్జయు, నేనును నిలువఁబడియుంటిమికదా! కుబ్జగనుక మగవాఁడగుచో మధ్యమపురుష; ఆఁడుది యగుచో మధ్యమస్త్రీ' అని వెంకటరావనెను.

'కాపిటల్ పనిష్మెంట్' అని తెలుఁగు పండితుఁ డనెను.

ఆంధ్రోపాధ్యాయుల కాపిటల్ పనిష్మెంటునకు నోరు మూసికొని కూరుచుండుట అని అర్థము. వెంకటరావు వెంటనే చేతులతో నోరు మూసికొని కూరుచుండెను.

ఉపాధ్యాయుఁ డీమాఱు మొదటికిఁబోయి " 'కళ' యన నేమి" యని గోపాలు నడిగెను.

'ద్రుతప్రకృతులుగాని శబ్దంబులు కళలనంబడు' అని గోపాలుఁడు చెప్పెను. క్లాసంతయును 'ద్రుతప్రకృతులుగాని శబ్దంబులు కళలనంబడు' అని అఱచెను.

లక్షణము మెల్లగా లక్ష్యములలోనికి దిగెను. ప్రసక్తానుప్రసక్తముగా శ్రీనాథుఁడును, రామలింగఁడును వచ్చిపడిరి, వారి చాటువులతో రసపుఁజెలమ బయటఁబడెను. బాలురందఱును ఒహోహో యని నవ్వుచుండిరి. నవ్వనివాఁడొక యహోబలుఁడు.

తెలుఁగుపండితుఁ డది కనిపట్టెను. "ఏమోయి 'సరసగుణహోరి' " అనెను. బాలురందఱును 'ఓబయ నరసశౌరి' అని పూరించిరి. అహోబలుఁ డులికిపడెను.

'గోదావరి రెం డొడ్లు దఱిసి పాఱుచున్నను నీకుఁ బడిసెఁడు నీరు దొరకలేదా?' అని యుపాధ్యాయుఁ డనెను.

ప్రక్క నున్న పూర్ణచంద్రరా విటులనెను - 'మందార మకరంద మాధుర్యమునఁ దేలు మధుపంబు వోవునే మదనములకు?'

అహోబలుని కందఱిచూపులును ముండ్లవలె గ్రుచ్చుకొనెను. ఉపాధ్యాయుఁడు లోఁగడఁ జెప్పుచున్న విషయమతఁ డేమియు వినలేదు. కావున నతఁడు లేచి నిలుచుండెను.

'ఏల నిలిచితివి? అని పండితుఁడనెను.

ఎందులకుఁ దాను నిలువఁబడెనో యహోబలుఁ డెఱుఁగఁడు కావునఁ గూరుచుండెను.

'నిలుచుటయుఁ గూలఁబడుటయు నీ వంతేనా?' అని యుపాధ్యాయుఁ డనెను. అహోబలుఁడు నిలువఁబడియెను. అందఱును నవ్విరి.

'ఏల నిలువఁ బడితివి?'

'తమ యాజ్ఞ చేత.'

'ఇపుడు గాదు ; లోఁగడ?'

'తాము చెప్పుచున్నది నేను వినలేదు. ఆయపరాధమునకు నేను నిలువఁబడితిని' అని యిటులు పలుకుచుండఁగా అహోబలుని కనులు తడిసికొనుచువచ్చెను.

ఈ గుంజీలనడుమ నహోబలుని జేబునుండి తొంగిచూచుచున్నటు లున్న కవరొకటి పూర్ణచంద్రరావు కనులఁ బడెను. మగవారి యక్కరము లాకవరుపయి నున్నచో పూర్ణ చంద్రరావంతగా పాటించియుండెడివాఁడు కాఁడు. అవి యాఁడువారి చేతినుండి రాలిన ముత్తెములు. పూర్ణచంద్రరావుచేతిలో నింద్రజాలము కలదు. దానిబలమున నతఁడా చీటిని వశపఱిచికొనియెను.

ఆంధ్రోపాధ్యాయుఁడు బోధించుచున్న విషయ మప్రకృతము, ప్రకృత మాబోధ వినకున్నను ఎవరికిని లోటు లేదు. కాని అహోబలుఁడు నిక్క మొప్పుకొనియెను. అహోబలుని బరిహసించుటలోఁ దెలుఁగుపండితుఁ డిదివఱకు సరసభూపాలీయము నంతయు కొల్లపెట్టెను గాని నేఁటి యాఘటన యతని చిత్తమును ద్రవింపఁజేసెను. కొంతనడికిఁ దెలుగుఁగుపండితుఁడిటు లనెను - 'నీ వేల వినలేదు?'

'నాకు నేఁ డందిన యొకయుత్తరమును గుఱించి యాలోచించుచున్నాను.'

'ఓహో మేఘసందేశము కాదుగదా!'

'పోస్టుసందేశము' అని పూర్ణచంద్రరావనెను.

అహోబలుఁడు జేబు తడుముకొనెను. బాలురందఱును హోహోయని నవ్విరి. అహోబలుని ముఖము పారాణి యాయెను. అతఁ డా ముఖముతో ప్రక్కనున్న పూర్ణ చంద్రరావును జూచెను. సుబ్బారావుచేతి నుండి యాయుత్తరము క్రమక్రమముగా క్రిందిక్రిందికిఁ జనుచుండెను.

'ఆయుత్తర మిటు లిమ్ము' అని ఆంధ్రోపాధ్యాయుఁ డనెను. ఆపలుకుబడిలో రాజశాసనము గర్జించెను. ప్రక్కప్రక్కనే పితృవాత్సల్యము ప్రవహించెను. హాస్యోన్మత్తములగు బాలుర మోము లన్నియు గంభీరము లాయెను. ఆ కవరు ఉపాధ్యాయునిముందరి బల్ల మీఁది కెక్కెను. అతఁ డాకవరుమీఁది యక్కరములఁ జూచి అహోబలుని 'ఇటురమ్ము' అనెను.

తండ్రికడ కరుగు కుమారునివలె అహోబలుఁ డుపాధ్యాయునికడ కరిగెను.

'ఈయుత్తరమును నేను చదివికొనవచ్చునా?'

'నిస్సంశయముగా చదివికొనవచ్చును.'

'ఓ! చాలనాపదలో ముంచితివే! అక్కఱలేదు గాని భద్రపఱిచికొనుము.'

అహోబలుఁడు సంతుష్టుఁడాయెను. కవరు తీసికొని జేబునఁ బెట్టుకొని వెనుదిరిగివచ్చి తనతావునఁ గూరుచుండెను. ఒకతూరి కవరెత్తి దులిపెను. ఇంతలో గణగణ మని గంట మ్రోఁగెను.

బాలు రందఱహోబలుని జూచుచుండిరి. అతఁడు మఱొకతూరి దులిపెను. ఉత్త కవరు!

బాలురందఱును కాళ్లతో నేలను బాఁది, అఱచి యీలలువయిచి నవ్విరి. మఱు నిమిషమున ఆప్రదేశమంతయు అహోబలుని కవరుతోపాటు శూన్యమాయెను.

## 6

కొండమీఁద నుండి సెలయేటివలె బాలురబారు స్కూలునుండి నిర్గమించు చుండెను.

కొంత జట్టును వెనక వేసికొని పూర్ణచంద్రరావు వడివడిగా నడచివచ్చి అహోబలుని భుజముమీఁద చేయివయిచెను. అహోబలుఁ డొక నిశితకటాక్షమును పూర్ణ చంద్రరావు ముఖమున గ్రుచ్చి యెడమెడముగాఁ దొలఁగిపోయెను. పూర్ణచంద్రరావును, పూర్ణ చంద్రరావు జట్టులోనివారును ఒకరి మొగము లొకరు చూచుకొనిరి. 'ఓరి ఓబయ్యా! ఇదిగో నీయుత్తరము!' అని పూర్ణ చంద్రరావొక యుత్తరము నెత్తి పట్టుకొనెను.

తీసికొనుటకు దాపునకు వెళ్లినచో అది యొకరి చేతులనుండి యింకొకరి చేతులకుఁ బోయి మాయామృగమగునని యహోబలుఁడెఱుఁగును. కావున నతఁడా ప్రయత్నమును మానుకొని మాటాడక వడివడిగా నడవఁదొడఁగెను.

పూర్ణచంద్రరావహోబలుని దాపునకుఁ బరువెత్తి 'ఇదిగో నీయుత్తరము' అని విసిరి పాఱవయిచెను.

ఈతూరి యహోబలునకుఁ గొంచెము లోభము కలిగెను. ఒకనిమేష మాఁగెను; అందఱను పరికించెను. ఉత్తర మందుకొనుటకుఁ బరువు లెత్తుకొని రాఁదొడఁగెను. ఆయుత్తరమును దన కందనీయకుండుట కాజట్టులోనివారెవరును ప్రయత్నము చేయకుండు టతని కక్కజము కలిగించెను.

అహోబలునకును ఉత్తరమునకును ఇఁక నొకగజ మెడ ముండెను. పూర్ణ చంద్రరావు మరల నాయుత్తరమును దీసికొనుటకుఁ బోలెఁ బరువెత్తు టభినయించెను. అహోబలుఁడు ప్రాణ పణముగాఁ బరుగెత్తెను. ఉత్తరమును దొరకించుకొనును. వెను దిరిగి మరల రివ్వునఁ బరువెత్తఁ దొడఁగెను.

పూర్ణ చంద్రరావు పరుగిడ నభినయించెనే కాని పరుగిడలేదు.

'పాపము! వాని యుత్తరమును వాని కిమ్ము' అని జట్టులోనివా రందఱును అఱచిరి. అహోబలుఁడు దీర్ఘముగా వచ్చు శ్వాసలను ఒకనిమిషములో నియమించుకొని నిలిచి చేతిలోని కాకితమును జూచుకొనెను. అది చిత్తు కాకితము!

అతనికి క్రోధమును దుఃఖమును వచ్చెను. అతనికి వలసినంత బలము కలదు. ఆ బలమును ఉపక్షీణము చేయఁగలిగినంత అధైర్యము కలదు. అతనికి మనుజునకు రాఁగలిగినంత క్రోధము మొదలగు భావములు కలుగును. వానిని వెంటనే వశపఱిచికొనఁ గలుగునంత ధీరత కలదు. అతఁడు దెబ్బకు జంకఁడు. పరిహాసమునకు లొంగును. అతఁ డొకనిని దెబ్బకొట్టఁడు. తాను దెబ్బలు తినఁగలడు.

అతఁడు వెనుకనున్న వారిమాటలు చెవింబడకుండుటకు తూనీఁగవలెఁ బరుగిడఁ జొచ్చెను. పట్టణమునందలి ఘంటాపథమున నిటులు పరుగిడుట అసభ్యమని యతనికిఁ దట్టలేదు. అతఁడిటులు చాల దవ్వు పరువెత్తి వెనుదిరిగి చూచెను. చూపుమేరలో బాలుఁ డెవఁడును లేఁడు. అతఁడు రోఁజక, యలయక మెల్లగాఁ దనగదిలోఁ బ్రవేశించి తలుపులను మూసికొనెను. అతఁడొక గవాక్షమునయినను దెఱవలేదు. పుస్తకములను అలమరులోఁ బెట్టి రొజాయిమీఁదఁ బడుకొనెను. ఏడుగంటలు ఎనిమిది గంటలు తొమ్మిది గంటలు వినఁబడెను. సద్దు మణఁగెను. కనులు మూసికొనియే యుండెనుగాని యతని మనస్సు తెఱచుకొని యుండెను.

తనతలక్రింది దిండు వేఁడియెక్కి యుండుటచే నతఁడు దానిని నేలమీఁదికిఁ ద్రోసివయిచెను. కొంచెముసేపు చెవులు దోరఁబెట్టుకొని యాలకించెను. వాకిట నేమియుఁ జప్పుడులేదు. పిదప లేచి దీపము వెలిఁగించెను. దాని వెలుఁ గతని కనులకు మొదట ముండ్లవలెఁ, బిదప దుమ్మువలె నాయెను. కనులు నులుముకొని కొంచెముసేపు కూరుచుండెను. మెల్లమెల్లగా లేచి, యలమరు తెఱచి, కాకితమును కలమును గొనివచ్చి ముందిడుకొని కూరుచుండెను. చాలసేపాలోచించెను.

లోఁగద నతఁ డుత్తరము వ్రాసి యెఱుఁగఁడు. ఉత్తరములు వ్రాయుటొక కళ యని యతఁడు వినియుండెను. అతఁడు తనకళా నైపుణ్యము చూపుట కిదియే మొదలు.

ఆలోచించి యాలోచించి తుద కొక యుత్తరమును తెలుఁగున వ్రాసి పూర్తి చేసెను. తిరిగి చదివికొనెను. చింపివయిచెను.

మరల నాలోచించి యొకయుత్తర మింగ్లీషులో వ్రాసెను. చాల సర్దుబాటులు చేసి దిద్ది తీర్చెను. దాని నొకకవరులో పుడఁచి మూసెను. పయిపేరు వ్రాయవలసివచ్చుసరికి తలప్రాణము తోఁకకు వచ్చెను. భార్యపేరు వ్రాయనగునా?

మామగారి పేరు వ్రాయఁ దలఁచెను. అటు లగుచో మామగారీ యుత్తరము చదివికొందురు. అత్తగారిపేరు వ్రాయఁదలఁచెను. ఆమెకును ఉత్తరములు చదువుకొనుపాటి భాష వచ్చును.

భార్య భర్తపేరు వ్రాసెంగదా! భర్త మాత్రము భార్యపేరేల వ్రాయరాదు?

కొంచె మాలోచించి యావత్పక్షముగాఁ దలపోసి Vasumathi అని వ్రాసెను.

తనకడ బిళ్లలు లేవు. అదియు మంచిదే యనుకొనెను. పిదప 'నట్పేటు'నకు స్పెల్లింగు విచారించి యన్ యు టి = నట్, పి యే టి యి = పేట్ అని నిశ్చయించి Nutpate అని వ్రాసెను. కొంచెముసే పీనట్పేటును పరికించెను.

అహోబలునకుఁ జిన్ననాఁట నింగ్లీషు మీఁద నాదరముమెండు, ఇంగ్లీషు-అక్షరములు వచ్చిన తరువాత తెలుఁగుమాటల నన్నిఁటిని అతఁడు ఇంగ్లీషులోనికి తర్జుమా చేయుచుండెడివాఁడు – 'వి యే = వా, డి యు = డు; వాఁడు, ఆర్ యే = రా, కె యస్ హేచ్ యే = క్ష, యస్ యు = సు, డి యు = డు; రాక్షసుఁడు వాడు రాక్షసుఁడు' ఇటులు తర్జుమాచేసి ఇంగ్లీషు భాషాజలధిని తరించితి ననుకొనెడివాఁడు. ఈ Nutpate పద మాకోటిలోనిదే.

పదముల పుట్టుకను గుఱించి ఫైలాలజిస్టులే తాఱుమాఱగుచుందురు! తపాలాభాష యెఱుఁగనివారికి 'Not paid' నట్పేటయినదో, నట్పేటే 'Not Paid' అయినదో యెటుల తెలిఁయగలదు? అహోబలుని తెలుఁగు నట్పేటు ఇంగ్లీషులో Nutpate గా మాఱెను.

అతఁ డీనట్పేటును పరికించి డిక్షనరీ తెఱచిచూచెను. ఆపదము దాన లేదు. అపుడతనికిఁ దనచిన్న తనమునందలి తన యింగ్లీషు తర్జుమా గుఱుతువచ్చెను, దానితోపాటు కొంచెము నవ్వుగూడ వచ్చెను. పుస్తకము మూసి మరలఁ జూచుచుఁ గూరుచుండెను.

'నట్‌పేట్... నట్‌పేడ్... నాట్‌పేడ్... నాట్‌పెయిడ్... భేష్ 'Notpaid' అని యనుకొనెను. 'ఇట్టి యజ్ఞాన మీకవరులో నెంతయున్నదో' అని యనుకొని చింపి మరలఁ దెలుఁగున వ్రాసెను. కవరును అంటించెను. కవరును కలమును జేబునఁ బెట్టుకొనెను. దీపమును తగ్గించెను. మెల్లగా తలుపుతీసి వీధియంతయుఁ బరికించెను. తలుపు తాళముపెట్టి, తపాలా కచేరికిఁ బోయి, యాయుత్తరమును పెట్టెలోఁ బడవయిచి వెనుదిరిగివచ్చి శయనించెను. పూర్వవృత్తాంత మంతయు నాలోచింపఁ దొడఁగెను.

అతనికనుఱెప్పలు చల్లగా వ్రాలెను. ఆలోచన క్రమక్రమముగా శూన్యమాయెను. శ్వాసలు సమాంతరాళము లాయెను. ఇంద్రియము లుపరించెను. నిదుర తల్లియొడి!

రెండుమూఁడు కలలలో పూర్ణచంద్రరావు వచ్చి అల్లరిచేసిపోయెను. అతఁడు నిదుర నుండి లేచువఱకు బారెఁడు ప్రొద్దెక్కెను. కాల్యకృత్యములను ముగించుకొని యతఁడు కాఫీహోటలున కేఁగెను.

నాఁడు శనివారము. స్కూలు తొందరలేదు. కాఫీ త్రాగి బల్లమీఁదఁ బడియున్న పత్రిక నందుకొనెను. అది నడవలేదు. అతని లోలోపల పూర్ణచంద్రరావు పనిచేయు చుండెను. అతఁ డాపత్రిక నటఁ బడవయిచి వీథిలోనికి వచ్చి యటిటు చూచెను. లోని కొక యడుగు వైచెను. పిదపఁ దనగదికి బయలుదేఱెను.

జవా నొకఁడు దారిలోఁ గనఁబడి సలాము చేసి 'అయ్యా, ఈయుత్తరముమీఁది పేరు కొంచెము చదివిపెట్టుఁడు' అని యడిగెను. అహోబలుఁడు కొంచె మెడము జరిగి 'ఒకరి చీటిమీఁది యక్షరములు మఱియొకరు చూడరాదు. నేను చదవను పొమ్ము' అనెను. హతభాగ్యుఁడగు ఆజవాను అహోబలుని బెదరిబెదరి చూచుచు పరిక్రమించెను.

అహోబలుఁడు వడివడిగాఁ దనవీథిలోనికిఁ బోయెను. వీథితలనుండి పాఱఁ జూచెను. తనగదితలుపులముందు అయిదాఱుగు రొక గుంపుగా నిలువఁబడి చూచుచుండిరి. వారి నతఁడు పరికించి చూచెను. వారు స్కూలు బాలురు కారు. ఇతరు లెవరును తనకొఱకు వచ్చు నలవాటు లేదు. నేఁడు తన కీ యాహ్వాన మెక్కడనుండి?

అహోబలుఁడు వడివడిగా నడవఁదొడఁగెను. తనకంటె ముందు వెళ్లుచున్న పౌరులొకరొక్కరే తనగదిముం దాఁగి తలుపుల కెదురుగా నిలిచి చూచుచుండిరి. తనగది ముందు ఏమి వింత గలదు?

అతఁడు చివాలున వెను దిరిగి, కొంత ద వ్వరిగి, యచట నాఁగి వెనుకకుఁ జూచెను. గుంపు క్రమక్రమముగాఁ బెరుఁగుచుండెను. ఆగుంపుననుండి ఒకరిద్దఱు నవ్వుమోములతో వెడలిపోవుచుండిరి. కొంద అహోబలుని దెసకు వచ్చుచుండిరి. వారిని జూచి యతఁడు మరల నడకను ముందులకు సాగించెను. కొంత దవ్వరుగుసరికి 'ఇవి కొంటెకుఱ్ఱవాండ్ర పనులు' అనుకొనుచు నవ్వుచు ఇరువురు వచ్చుచుండిరి. అహోబలుని గుండెలు జల్లుమనెను. అతఁడు మాటాడక రివ్వున నడచెను. తనకును ఆగదికిని ఇసుమంతయు సంబంధము లేనటులు తలుపులమీఁద నంటించియున్న బొమ్మను, ఉత్తరమును జూచుచు ముందులకు నడచి సందుచివరకు వెళ్లి నిలువఁబడెను.

గుంపెక్కువ యగుచుండెను. అతఁడు రివ్వున వెనుదిరిగి వచ్చెను. గుంపును తప్పుకొని గది మెట్టెక్కి గోళ్లతో కాకితమును చింపఁజూచెను. కాకితము రాలేదు. తాళము తీసి గదిలోనికివెళ్లి చాకు తెచ్చి కోసివైచెను. తలుపు అరంగుళము లోఁతు గాఁడిపడెను.

గుంపులోనివారిలోఁ గొంతమంది 'మీరేనటండీ ఓబయ్యగారు?' అని అడిగిరి. అహోబలుఁడు గదిలోని కేఁగి తలుపులు మూసికొనెను.

# 7

ఆదివారమునాఁడు చీఁకటిపడఁగనే బిక్కు బిక్కుమనుచున్న యహోబలుఁడు ధైర్యముఁబడసి బజాఱునకు బయలుదేఱెను. ఒక పెద్ద యంగడిలోనికిఁ జని ఒక పడక కుర్చీ, ఒక కాంప్ కాట్; ఒక అలారపు గడియారము కొనెను. చదువునకు తిలోదకములు విడిచి యింటి కిది ప్రయాణసన్నాహము. పూర్ణ చంద్రరావు నిష్కారణముగా నొనరించిన యవమానమున కిది ప్రతిక్రియ! వసుమతి వ్రాసిన జాబున కిది జవాబు!

వసుమతి వ్రాసిన యుత్తరములో విశేష మేమియు లేదు. అందెన్నియో పఙ్క్తులు లేవు. ప్రేమాలాప మిసుమంతయు లేదు. దాననున్నవి కడుఁ గొలఁదిపఙ్క్తులు. కార్డుగూడ ఆ పఙ్క్తులకు ఎక్కువ. ఆఁడువారి గౌరవమునకు మాత్రమే కవరు. ఆ కొలఁదిపఙ్క్తులలో నీపఙ్క్తియొకటి – 'మీరు ప్యాసయినారా?'

ఈపఙ్క్తికి ప్రతిక్రియ యేది? ఇంటికి మూట కట్టుటయేనా? కాఁబోలు!

తానీరాత్రి రయిలులో పూర్ణచంద్రరావు కనులలో కారము చల్లి చల్లగా నింటికిఁ బోవచ్చును. కాని వసుమతి ప్రత్యుత్తరమునకు వేచియుండవలయును.

తాను కొనిన వస్తువుల నన్నిఁటిని భద్రపఱచికొనెను. గడియారమునకు కీ పెట్టెను. పూఁటకూలియింటికిఁ బోయి భుజించి వచ్చుచుండెను. దారితల నున్న యొకయింటి చావడిలో ఏసుదాసు ఉపన్యసించుచుండుట వినెను.

ఏసుదాసు కిరస్తానీ; బి.యే. విద్యార్థి. గంధియెడ నతని కాదరము మెండు. బడిలోని మాడరేట్లలో నతనికి 'జెంట్లిమన్' అని పేరు. ఎక్ స్ట్రిమిస్టులలో క్రీస్తనియు, ఫూలనియు ఆదరము. పలువురు బాలు రతనికడ ప్రతిరాత్రియు బైబిలు మంత్రములు వినుచుందురు.

మతమునెడ శ్రద్ధగల కొందఱు హైందవ విద్యార్థులు ఒకపఙ్క్తిగా మునిముందు కూరుచుండిరి. వారివెనుక మతము పుచ్చుకొని బోర్డింగులో నున్న బాలురు నాలుగయిదు పఙ్క్తులుగా కూలఁబడియుండిరి. వారి శరీరములన్నియు తారువేయఁబడియున్నటు లుండెను. వారిబల మెల్లయు తేజోరూపముగా చక్షురింద్రియమునుండి పోయియుండును. క్షయ లేకయే వారిశరీరము లాఱిపోయెను. ఆధ్యాత్మికశక్తిని ప్రవేశపెట్టుటకు ముందు వారిశరీర బలము నెల్ల మెల్ల మెల్లగా నచటి బోర్డింగు భవనము జలూకవలె లాఁగి కొనుచుండఁబోలు. వారి వస్త్రములు బొచ్చుతో నేయఁబడని గొంగళ్లు. వారికన్నులు దుః

ఖములకు తెన్నులు. వారిమోములు వగపుతూములు. ఇట్టిసభలో విచిత్రమగు తెలుఁగుబాసలోఁబడిన శుద్ధమగు బైబిలు సగ మఱవ పలుకుబడితోడను, సగ మింగ్లీషు-అక్సెంటుతోడను మిళితమయి యేసుదాసుకంఠనాళమున నొకొక్కమాట యొకొక్క కీచురాతివలె ధ్వనించుచుండెను.

లోఁగడ పలుమాఱు లేసుదాసుకంఠస్వర మహోబలు నాకర్షించియుండెను. అహోబలునకు రాగజ్ఞానము కలదు. కంఠము శ్రవ్యము. స్వయముగా రాగ మాలపించుకొని యానందింపఁగలఁడు. అతని శరీరము బలిష్ఠము. కంకాళసారమయిన యాకిరస్తానీ బాలుర శరీరముగూడ నతని నొకవిధముగా నాకర్షించెను.

అహోబలుఁడు కొంచెముసేపు వాకిట నిలిచి వినెను. తన్నెవరును రమ్మనలేదు; పొమ్మనను లేదు. 'పెద్దమనిషి' తనమున కిదియే యొఱపిడిరాయి యని యతని కభిమతము. ఈ పరీక్షతో నతఁడు మెల్లగా లోనికేఁగెను. దాపుననున్న వారతనికిఁ జోటొసఁగిరి.

ఏసుదాసు తెలుఁగుబైబిలునుండి చదువఁదొడఁగెను: 'కంటికి కన్ను పంటికి పన్ను అని చెప్పఁబడినమాట మీరు విన్నారు.'

'ఎక్కడ విన్నారు?' అని అతఁడు బల్లగ్రుద్ది సభవారిని జూచి యొకసారి పుస్తకము క్రింది ఫుట్‌నోట్ చూచి, తలయెత్తి 'నిర్గమకాండలో' అని తెలిపి మరల బైబిలు చదువఁ దొడఁగెను.

'అయితే నేను మీతో చెప్పేది ఏమనగా, దుష్టుని ఎదిరించక నిన్ను కుడిచెంప మీద కొట్టువానితట్టు రెండవదికూడ త్రిప్పుము. నీతో వ్యాజ్యమాడుచు, నీఅంగీ తీసుకొనగోరువానిని నీపై వస్త్రముకూడ తీసుకొననిమ్ము. ఒకడు ఒకమైలుదూరము రమ్మని నిన్ను బలవంతము చేసితే, వానితో రెండు మైళ్లు వెళ్లుము. నిన్ను అడుగుకొనువానికిమ్ము. నీయొద్ద అప్పు పుచ్చుకొన కోరేవాని నుంచి నీముఖము త్రిప్పుకొనవద్దు.

అనగా తెలిసినదా? Turn not thou away సోదరులారా వినుడి! పిమ్మట : మీ శత్రువులను ప్రేమించుడి! మిమ్ము తఱుము వారికొఱకు ప్రార్థించుడి! మీరు ఆకాశమందున్న మీతండ్రికి కుమారులై యుండునట్లు ఆలాగు చేయుడి.'

'తెలిసినదా? ఆలాగు చేయుడి!' అని అర్థము చెప్పి ఏసుదా సొకతూరి కంటిజోడు సర్దుకొని అందఱను జూచి మరల పుస్తకమెత్తెను.

'ఆయన చెడ్డవారిమీదను మంచివారిమీదను తనసూర్యుని ఉదయింపజేసి, నీతిమంతులమీదను అనీతిమంతుల మీదను వర్షము కురిపించును.'

ఏసుదాసు పుస్తకమును బల్లమీఁదనిడి తలయెత్తెను. "ఈవేదము తెలిసిన శాస్త్రులు ఘనము! అందఱకు తెలుసునటుల చేసును. మంచిశాస్త్రులు ఈబైబిలువేదము తెలుగు

చెయ్యుటకు వచ్చుకపోవుతే ఏమిచేసును? కొత్తశాస్త్రులు ఇటులు తెలుగును - 'ఆయన పాడుమీదను మంచిమీదను సూర్యుని లేపుటకు చేసును - He make the sun to rise on the evil and on the good, and send the rain on the just and on the unjust - సరిమీదను అసరిమీదను వానపంపును' అని చేసును."

సభవారి నవ్వడఁగిన తరువాత ఏసుదాసిటులు ఉపన్యసింపఁదొడఁగెను :'హిందువులు మాలలకు మాదిగెలకు సదువు సెప్పనియ్యరు. చదువు చీకటికి వెలుగు. నేను చెప్పిన దేమనగా మీరు చీకటిని వెలుగుడి! తుంచివేసుడి! మీకు వచ్చుకుండిన దానిలో మీమీ పల్లెలోనున్న చీకటివారికి వెలుగుడి! మా మతమువారు బడులుపెట్టుదురు. ఏసు గుడులు కడుదురు. మీరును అటులు సేసుడి! ఆమెన్.'

అనంతరము సభవారిలోఁ గొందఱు మోఁకారిలఁబడి లేచిరి. ఒకొక్కరే నిర్గమించిరి.

అహోబలుఁడు దారిని బోవుచు 'నేను ఏసుదాసు నగుచోనా?' అని యనుకొనుచు తన గది ముంగలకు వచ్చెను. తలుపులు పరీక్షించెను. తాళముతీసి లోని కరిగి రజాయి పఱచికొని పండుకినియెను.

అతఁడు బడిని వదలెను. దయ్యా మతనిని వదలెను. ఏసుదాసు నుపన్యాస మాలకించెను. అనంతమగు నాకాశమున విహరింపఁజొచ్చెను.

గ్రామములనుండి బస్తీలకు వలసవచ్చి చదువుకొను బాలురను కనిపట్టి నడపించువాఁడెవఁడును ఉండఁడు. కడుపు నిండెనో, యెండెనో కనుఁగొనుటకు తల్లి యుండదు. చదువువెటులున్నదో, వృత్త మెటులున్నదో యాచార్యుఁడు కనుఁగొనఁడు. తనబుద్ధియే తనకుఁ దండ్రి. పూఁటకూటియిల్లే తల్లి. పూర్వజన్మ వాసనలు తోడిబాలుర సాహచర్యమున వికసించును. బడిలో నీతికి దోహదము లేదు. భగవంతునకు టికాణా లేదు.

ప్రతివాఁడును గొప్పఁదన మభిలషించును. ప్రతిబాలుఁడును ప్యాసగుటకే బడిలోఁ జేరును; లేక చేర్పఁబడును. కాని వాఁడు చేయు ప్రయత్నము సున్న. కాని వాఁడు గొప్పవాఁడు కావలెను. అహోబలుఁ డీ యభిలాషలోఁ బడెను. లోకములోఁ దనకుఁ బేరక్కఱలేదు. కాని తాను గొప్పవాఁడు కావలెను. ఎటులు? తానొకబడి పెట్టవలెను. బాలుర కుచితముగా చదువు చెప్పవలెను. ఇదియొక గొప్ప పని. దీనిచేఁ దాను గొప్పవాఁ డగును.

నిక్కమున కహోబలుఁ డెన్నఁడును గొప్పఁదన మాసింపలేదు. అతఁడు పెండ్లియయిన క్రొత్తలోమాత్రము కాఫీ నేర్చికొనెను. నేఁటివఱకు బజాఱుమిఠాయి తినియెఱుఁగఁడు. సిగరెటు కాల్చు టెఱుఁగఁడు. రైలులో ఇంటర్మీడియేటు టికెట్టు కొనియెఱుఁగఁడు. వస్త్రములిస్త్రీ చేయించుకొనుట యెఱుఁగఁడు.

అతఁడు పాఠము నోటికి వచ్చినదాఁక కదు నోపికతో వల్లించును. నిదురించును. మేలుకనువఱకు మఱచిపోవును.

అతఁ డీబుద్ధిమాంద్యమును పలుమాఱులు ఉపవాసములచే శిక్షించెను. శరీర శోషణమే ఫలించెను. కొన్నాళ్లు కనులు వాఁచునటు లేడ్చెను. ఏడిచి లాభము లేదని తెలిసికొనియెను.

అతఁడు ప్రతిదినమును శరీరపరిశ్రమ మొనరించును. హృష్టపుష్టమగు నతని శరీరము చూడ ముచ్చటగా నుండును. దానికి చొక్కా దిష్టిబొమ్మ.

అతఁడు రజాయిమీఁదనుండి గబగబ లేచి నాలుగుగంటలకు అలారపు కీ పెట్టి వచ్చి సుఖముగా నిదురించెను.

## 8

కాలమునకుఁ బ్రతినిధియు, సోమరులకు విరోధియునగు గడియారా మాయర్ధరాత్రము యొక్క జాడ్యగర్వమును భేదించి గణగణలాడెను. అహోబలుఁ డులికిపడిలేచెను. అతని కింకను కనులమంపు విడలేదు. నాలుగుగంటలయినటులు తలపోసి యతఁడు శరీరపరిశ్రమ చేసి దీపపు వత్తి యెక్కించి చూచెను. గడియారపుముల్లు ఒకటిమీఁద, అలారపుముల్ల నాలుగవగంటమీఁద.

అతఁడు మరల ఒంటిగంటలమీఁద పదునేను నిమిషములకు అలార మిచ్చి ప్రతీక్షించుచుఁ గూరుచుండెను. పది నిమిషములు దాఁటెను. పదునేను నిముషములు దాఁటెను, గడియారము సత్యాగ్రహ మొనరించి కూరుచుండెను.

'పదిరూపాయలు పాడుచేసితినే! తిన్నగా నడవనిచో పదిరోజులలోఁ దెచ్చియిచ్చినచో పుచ్చికొందు నన్నాఁడుగదా!' అని యనుకొని యతఁడు నిదురించెను. తెలవాఱుజామున లేచి కాలకృత్యములు నెఱవేర్చెను. 'ఘనాబుడు తుమ్మాల్' అనుకొని మరల పరిశ్రమించెను. చెమట యాఱఁబెట్టుకొని నగుమొగముతో స్నానము చేసెను. కాఫీ త్రాగి పోస్టాఫీసునకు వెళ్లెను.

యూనీఫారము తొడుగుకొని తపాలా జవానులు ఉత్తరములను సార్టుచేసికొని చుండిరి. వారిముందు పూర్ణచంద్రరావు!

అహోబలుఁడు జలదరించెను. అతఁడు మెల్లగాఁ బోయి పూర్ణచంద్రరావువెనుక నిలిచెను.

పూర్ణచంద్రరావు వెనుదిరిగి చూచెను. తనతలమీఁద బారెఁడెత్తున అహోబలుని ముఖము!

పూర్ణచంద్రరావు ముసిముసి నవ్వులు నవ్వుచు రోడ్డుమీఁదికిఁ బోయి నిలువఁ బడెను.

సార్టు చేయుట అయిపోయెను. తపాలా వాఁడు తల యెత్తి చూచెను. లోఁగడఁ దాను జూచిన మనుష్యునకును ఈమనుష్యునకును హస్తిమశకాంతరము, అతఁడెంత వామనుఁడో, ఇతఁ డంత బేతాళుఁడు. కావున తపాలా వాఁడు తెల్లఁబోయి 'అహోబలుఁ డుగా రేరండీ?' అని యడిగెను. 'నేనే'

పూర్ణచంద్రరావు నవ్వెను. అహోబలుఁడతని కొక చెంపకాయ యీయఁ దలఁచెను గాని రాత్రి వినిన యేసుదాసు నుపన్యాసము మనసు నంటియుండెను. 'భగవంతుఁడు నిన్ను మంచిదారికిఁ దెచ్చుఁగాక!' యని లోలోపల నాశీర్వదించెను. పూర్ణచంద్రరావు పాఱిపోయెను.

'అతనిపేరు పూర్ణచంద్రరావు. నాయుత్తరము దొంగిలుట కతఁ డిచటికి నాపేరుతో వచ్చెను' అని అహోబలుఁడు తపాలావానితోఁ జెప్పెను.

'మంచిది నాకు హెచ్చరిక చేసితి'రని తపాలావాఁడు కృతజ్ఞత తెలిపెను. అహోబలుఁడు తనగదికి వెళ్లిపోయెను. అతఁ డాంజనేయుని ప్రతిమను ముందిడుకొని రామనామ మొనరించెను. రజస్తమస్సుల దాఁటి యతని మనస్సు సత్త్వప్రవాహమునఁ బడెను. దానికి గుఱుతుగా అశ్రుప్రవాహము కనులనుండి గండస్థలముమీఁదుగాఁ బ్రవహించెను.

భక్తులకును భామినులకును కన్నీ రొక యలంకారము, ఒక యూఱట. దానితో ఆనాఁడు సార్థకము.

అహోబలుఁడు కనులు తెఱవఁగనే కానిపించినది గడియారము. అతఁడు దానిని విప్పెను. అలారపుచుట్ట వదులుగానుండెను. దాని కతఁడు కీపెట్టెను. అది ముడుచుకొనెను. కాని యది గణగణమని యలారముకొట్టదు. అతఁడు నేర్పుతో చుట్టను వదలించెను. వదలింపఁగనే యది పామువలె లేచి దవుడకుఁ దాఁకెను. దవుడ చీరుకొనిపోయెను. కొంచెము నెత్తురు స్రవింపఁదొడఁగెను. మరలు నెత్తురు చూచును గాఁబోలు!

పాములవాఁడొక క్రొత్తత్రాఁచును స్వాధీనముచేసికొనునటులు అతఁ డాయలారపు చుట్టను స్వాధీనముచేసికొని యథాస్థానమున దాని నునిచి మరల మూసివయిచెను. పిదపఁ జెవికడ నిడికొని యాలకించెను. అది టిక్కు టిక్కు మనుచుండెను. సంతసించి యతఁడు దానిని గూఁటిలోనుంచి గాయమును శుభ్రపఱిచికొనెను.

అతఁడు చాలసే పాలోచించి, గడియారపు షాపువానికి – 'గడియారము అలారము కొట్టుటలేదు గాన మీకడనుండి ప్రత్యుత్తరము రాఁగానే ఈగడియారము మీకిచ్చి మఱియొక గడియారము తీసికొనఁదలచితిని' అని యొక రిప్లై కార్డు వ్రాసెను. గడియారముదెసఁ జూచెను. పది!

కార్డు జేబులో వేసికొని నడిదారిలో టపాలోఁ బడవయిచి పూఁటకూలియింటికి వెళ్లెను.

సంతవలెనుండు పూఁటకూటియిల్లు పుంతవలె నుండెను. ఎక్కడి వక్కడ సవరించి కొని యందఱును శయ్యలఁబఱచికొనిరి. శయ్యలనఁగా పీఁటలు, విస్తళ్లు, విసరుకఱ్ఱలు, చేఁటలు వగైరాలు. 'పదిగంటలకే యిదేమి చెపుమా!' యని యహోబలుఁ డనుకొనెను.

'ఇదేమండీ పండ్రెండుగంటలకు వచ్చితిరి?' అని పాచకుఁ డనెను. అహోబలుఁడు తెల్లఁబోయి 'నా గడియారమున పదియే యయినది' అనెను. 'మీ గడియారము స్వదేశీ గడియారమా?' అని పాచకుఁ డనెను.

అహోబలుఁడు పీఁటమీఁదఁ గూరుచుండి యెదురుగాన్ను గడియారమున ఒంటి గంట చూచెను. గడియారములమీఁదను, వాని నమ్మువారిమీఁదను అతనికి కినుక కలిగెను. పనిచేయనిచో వాపసు చేయుమన్నాఁడుగదా అని యనుకొనెను. అతఁ డెటులో భుజించి గదికడకు వెళ్లి తలుపు తాళము తీయఁదొడఁగెను. లోపల గణగణగణగణ! తాళము జాఱి యతని పాదముమీఁదఁ బడెను.

గడియార మొక వింతజంతువు. విశేషించి అలారపుగడియారము, ఒకతూరి గడియారము కొనినవాఁడు 'ఇంకొక గడియారము కొనినచో గాయత్రి సాక్షి' అని శపథము చేయును. గడియార మొక వ్యసనము. ఒట్టుపెట్టుకొన్నవాఁడు కొన్నాళ్లలోనే వెలగల మఱియొక గడియారము కొనును. లేదా ఇబ్బడి డబ్బిచ్చి దానిని బాగుచేయించుకొనును. కొలఁది నాళ్లలోనే యది మూలఁబడును. కానిచో బావమఱఁదికిఁగాని, యల్లునకుఁ గాని బహుమతిగా బోవును.

గడియారము బలే మోసగాఁడు. అది టిక్కు టిక్కు మనుచునే యాఁగిపోవును. నడచుచో గంట ముందు. పీఁకుచో గంట వెనుక. అది రైలును, పరీక్షలను తప్పించును.

కర్మముచాలక యది పనిచేయఁజొచ్చెనా నమ్మిన బంటు!

అహోబలుడు హసన్ముఖముతో లోనికేఁగి గడియారమును జూచెను. దాని శ్వాసలాఁగిపోయెను. అతఁడు కీ యిచ్చెను. ఇచ్చిన కొలఁది తిరుగుచునేయుండెను. పింగళివారి పేకి. కీ వదు లాయెనా, లేక పోయెనా?

అతఁడు దాని నొకమూల నుంచెను. తలుపుమూసికొని ప్రక్క పఱచుకొని చక్కగా శయనించెను.

కొన్నాళ్లవఱకు వసుమతికడనుండి గడియారపువానికడనుండియు ప్రత్యుత్తరము రాలేదు. అతఁడు గడియారపువానికి మరల నొక యుత్తర మిటులు వ్రాసెను:

"మీకడ నేనుకొన్న అలారపుగడియార మునుగుఱించి మీకు రిప్లైకార్డు వ్రాసికొని యుంటిని. దానికి సమాధానము వ్రాసితిరికారు. పనిచేయనిచో వాపసు చేయుఁడని కొనునపుడు మీరు మాటయిచ్చియుంటిరి. దీనిని దీసికొని మఱియొకదాని నిచ్చుట మంచిది. కానిచో డబ్బిచ్చినను మంచిదే. ఈరెంటిలో ఏపనిచేయుటకును వీలులేదని మీకు తోచిన యెడల గడియారమును పంపుచున్నాను. మీరు తీసికొనుఁడు. 'గడియారము కొనుట యొక తప్పు' అని నాకు, 'ఇట్టి గడియారము లమ్మఁగూడ'దని మీకును ఒక నీతిచిహ్నముగా నిది యుండఁగలదు. దీనిని మీరు శాంతముగా గ్రహింతురుగాక."

అతఁ డీయుత్తరమును గడియారమును పాచిపని చేయుదాని కిచ్చి పంపెను కొలఁది కాలమునకే యది తిరిగి వచ్చి యొక చీటి యిచ్చెను. అం దిటు లుండెను - "మీరు పంపిన గడియారము మరమ్మతు చేయుటకు రెండురూపాయ లగును. పైకము చెల్లించి నాలుగయిదు రోజులలో గడియారము తీసికొని పోవచ్చును."

ఈయుత్తరమును జూడఁగనే యొక యానందము విద్యుద్వేగముతో నతని శరీరమునఁ బ్రవహించెను. 'రెండురూపాయలకే యీతూరిక్రొత్తగడియార మొకటి వచ్చును!'

ఆమఱునాఁ డతనికి వసుమతికడనుండి ప్రత్యుత్తరము వచ్చెను. దానితోపాటు పూర్ణచంద్రరావుగూడ వచ్చెను. అతఁ డాయుత్తరమును గడు జాగ్రత్తగాఁ జదివికొనెను. పిమ్మట పూర్ణచంద్రరావును జూచి 'ఈయుత్తరమును జూడవలయునను కోరిక నీకున్నచో తీసికొనిపోవచ్చును' అని యహోబలుఁడు దాని నతని ముందుంచెను.

పూర్ణచంద్రరావు తెల్లబోయెను. శుష్కపరిహాసమున కతనికి జిత్తులతోఁ బనిలేకపోయెను. జడిపింపఁబోయి తానే జడిసెను.

అహోబలుఁ డా యుత్తరమునుగాని పూర్ణచంద్రరావును గాని చూడక ప్రక్క మీఁద కనులు మూసికొని పడుకొనెను.

ఉత్తర మున్న పాళముగనే యుండెను. గంభీరమగు ముఖముతో పూర్ణచంద్రరావు మాఱుమాట లేక వెళ్లిపోయెను.

## 9

వసుమతి చీటిలో రెండే వాక్యములు :-

ఒకటి, నేను చదువు మానను. రెండు-, మీరు మానుటకును వీలు లేదు.

అహోబలుఁ డీరెండు వాక్యములను రెండు గంటలసేపాలోచించెను. తాను వేసి కొనిన పునాదు లాఁపవలసివచ్చెనని నిర్ధారించుకొనెను.

ఈపాటి కేఁబండ్రు అఱువండ్రు బాలుర నడుమ సింహాసనమయి యుండవలసిన కుర్చీ ఆగదిలో దండ్యునివలె గోడకు నిలువఁబడి యుండెను. పల్లెటూరివా రందఱకును ఆశ్చర్యమును కలిగింపవలసిన స్టవ్ మొద్దమ్మాయి వలె మూలఁ గూరుచుండెను.

అతఁడొకసాయంకాలమున గడియారపు దుకాణముకడకు వెళ్లెను. దుకాణాదారు అతనిని జూచి చిఱునగవుతో 'ఇదిగో మీగడియారము సిద్ధముగా నున్నది' అని చేతి కందిచ్చెను. అహోబలుఁడు గడియారము చెవికడ నిడికొనెను. 'ఇది యంతయు టక్కు' అను నటు లది టక్కుటక్కు మనుచుండెను.

'అలారము సరిగా నున్నదా?'

'గడియార మొకటి, చాకిమడత యొకటి, విప్పినచో సరిగా పెట్టుట కష్టతరము. మీరు విప్పక సూటిగా మాకడకుఁ గొనిరండు! బాగుపడును. ఇపుడు పరీక్షించి చూచి కొనుఁడు.

'మీరు చెప్పినచో మరలఁ జూచుకొన వలసిన పని యుండదు.'

దుకాణాదారు మాటాడలేదు. అహోబలుఁడు రెండురూక లొసఁగి గడియారముఁ గైకొని ఆయంగడి నవమానమునుబలె దాఁటి పోయెను. గడియారము గూఁటి నలంకరించెను.

అతఁడు మంచిరోజు చూచుకొని స్కూలునఁ బ్రవేశించెను. 'ఫ్రెంచ్ లీవ్' అని యొకఁడును, 'స్కాట్ ఫ్రీ' అని యొకఁడును, 'మేఘసందేశ' మని యొకఁడును అతనిని గేలిచేసిరి. అతఁడు వాని నన్నిటిని నూతనానుభవములక్రిందఁ జమకట్టుకొనెను.

సెలవులలో నతఁ డింటి కేఁగెను. వీర వెంకమ్మ క్రొత్తపిండివంటలకు నంకురార్పణము చేసెను. దక్షిణాది చీరలు కొనెను. పట్టంచులబట్టలు విలిచెను. ఈసంరంభ మంతయుఁ జూచి యహోబలుఁడు 'ఇది యంతయు నెందులకు?' అని ప్రశ్నించెను.

'కోడలు రాఁగలదు.'

'తానే వచ్చునా? లేక నీవు కబు రంపితివా?'

'తనంతట తాను రాఁగూడదా? లేక నేను కబురంపఁగూడదా? రెండును జరుగ వచ్చును. సరి కాని, యీ యాఁదుగోడంతయు నీ కేల?'

'ఎపుడు వచ్చును?'

'ఎల్లుండి.'

'అమ్మా! దానిని దీసికొని రావలదు' అని కుమారుఁడు పలికి ప్రత్యుత్తరము విననొల్లక యచటినుండి వెళ్లిపోయెను. ఈ మాటలో నెంతవంత యున్నదో, యీ వెళ్లిపోవుటలో నెంత యశాంతి యున్నదో యాతల్లి గమనింపలేదు. 'నేఁటి కుర్రవాండ్ర తీరంతయు వింతయే. వారి పుస్తకము లేమో వారి బడియేమో కాని యిల్లువాకిలి తల్లి పెండ్లాము ఈ మొదలగు విషయములు వారిమదికెక్కవు. పూర్వులందఱును 'పెండ్లా మెపుడింటికి వచ్చునా?' యని బెంగపడిపోయెడివారు. ఈకాలపువారికి పెండ్లామే యక్కఱలేదు. ఆకాలపుప్రేమ లెక్కడ? అంతయురైలుబండి. ఒకటే గబగబ! ఒకటే తొందర!' అనుకొనుచు తనపనికిఁ దాఁ బోయెను.

ఆమఱునాఁడు వసుమతికొఱకు పురోహితుఁడు పూర్ణయ్యసిద్ధాంతి వెళ్లెను. కూఁతునత్తింటికిఁ బంపుటలో సోమమ్మకునుకైలాసరావునకును వాదప్రతివాదము లాయెను. క్రొత్తగా ఈడేఱిన వసుమతితో వెళ్లుట కాఁడుతోడెవరునులేరు గావున నిపుడు పంపరా దని సోమమ్మ వాదము. 'నీవు వెళ్లఁగూడదా?' అని కైలాసరావువాదము.

పదియేండ్లవెనుక నిమ్మళించిన క్షయ కైలాసరావున కిపుడు బయలుచూపెను. 'ఇట్టి స్థితిలో నే నెటులు వెళ్లఁగల' నని సోమమ్మ వాదము.

వసుమతి యీవాదప్రతివాదముల నాలకించెను. వారినడుమకు వచ్చి, 'నాకు తోడెవరక్కఱలేదు, నేనే వెళ్లి వచ్చెదను' అనెను. కైలాసరావుముఖము కలకలలాడెను. సోమమ్మ ముఖము ధుమధుమలాడెను. వాదప్రతివాదములు ముగిసిపోయెను. పూర్ణయ్యసిద్ధాంతితో వసుమతి యత్తిల్లు మెట్టెను. వసుమతి రైలు దిగఁగనే అహోబలుఁ డింకొక రైలుమీఁద గ్రామాంతర మేఁగెను.

గ్రామములోనికి క్రొత్తకోడలు వచ్చినను మోటారుబండి వచ్చినను ఒకటే సందడి. బూరా యూఁదువాఁ డొకఁడు, చక్రము లొత్తువాఁ డొకఁడు. బండి యెక్కువాఁ డొకఁ డు, బాటరీ త్రిప్పువాఁ డొకఁడు. క్రొత్త కోడలి కన్నుచూచువా రొకరు, ముక్కు చూచువా రొకరు. మొగము చూచువారొకరు మూతిచూచువా రొకరు. వస్తువు నందఱును నాణెముచేసిరి. పద్మము లేకున్నను లక్ష్మి నివసించిన దనిరి. ఇది ప్రధానాభిప్రాయము.

పిదప లేఁతమాటలు రాలేకపోలేదు. ఇంగ్లీషు చదువునఁ బడఁగనే ఆఁడుదానికి మీసకట్టు వచ్చునని యొక యమ్మ యనుకొనెను. పెండ్లి కాకమునుపే ఒకస్నానము చేసినదఁట యని యొకతె యనెను. కాలు పొడగు గాని చిన్నదే యని యొకయామె యనెను. చిన్నదఁట, ఏమిచిన్నది? కార్యము చేయుచో ఈపాటి కొడినిండ బిడ్డ లుండవలసినదని యొకయామె యనెను.

నీలకంఠావధానులు రెప్పవాల్పక చూచి చూచి, 'వీర వెంకూ! నీకొఁఅంత తీరినదమ్మా' యని ప్రశంసించెను. పేరి శాస్త్రిచూచి, 'పిల్లలగ్గమునకు మొగము వాచుకొన్నది' అని చెవిలో చెప్పెను. రామసోమయాజులు చూచి గుండె బాఁదుకొని, 'పిల్లకాదురా, ఫైల్మాన్' అనుకొనెను.

క్రొత్తకోడలు బజాఋన అమ్మకమునకుఁ బెట్టిన వస్తువు. విమర్శనీయమగు నూతన కావ్యమో లేక నాటకమో! ఎవరికిఁ దోఁచిన మాటలు వారాడిపోవుటలో నెవరికిని సంకోచము లేదు.

ప్రదర్శనశాలలోని కొకక్రొత్త జంతువు వచ్చినపుడు మనుజులు గుమిగూడి చూచిపోయిన చందము వసుమతికి గుఋతు వచ్చెను. వసుమతి పల్లెటూరి పిల్లయే కావున ఈ చూడవచ్చినవారి వ్యాఖ్యానములను టీకలను శాంతముగనే గ్రహించెను. వసుమతికి తన యత్తింటి సంగతు లన్నియు బోధపడెను. ఆమఋనాఁడు వసుమతి తనయత్తగారి పనులన్ని యుఁ దానే సవరింపఁదొడఁగెను.

'తలపాగ పెట్టుకొని ఆపీసుకు వెళ్లుదు వనుకొంటిని గాని గరిటెగూడ చేతఁ దొడగఁ గలవటమ్మా? ఇవి నేర్చుకొనుటకు నీకు తీరిక యేడది తల్లీ?' యని అత్తగారు కోడలిని ప్రశ్నించెను. వసుమతి మాటాడక తనపనులు తాను జూచుకొనుచుండెను. వీరవెంకమ్మ కోడలికరకౌశలమును అబ్బురముగాఁ జూచుచు నిలుపఁబడెను. తా నీ యింటికి క్రొత్తగా కాఁపురమునకు వచ్చిననాఁటిముచ్చటలన్నియు వీరవెంకమ్మ మనోదర్పణమున బింబితములగు చుండెను. ఆమె యాపాదమస్తకము గగురుపొడిచెను. కనులలో బాష్పము లుదయించెను. ఆమె వెనుదిరిగి కన్నీరు తుడిచికొనెను. ఈలోపుగా వసుమతిచాలఁ బనులుచేసివైచెను. వీరవెంకమ్మ కోడలిని జూచి, 'కోడ లత్తయయినది. అత్త కోడలయినది' అనెను, వసుమతి చిఋనవ్వుతో 'ఈ పూఁట నేను వంటచేయుదు' ననెను. అత్త పక్కున నవ్వి, 'నాకును నీ చేతిపాకము రుచి చూడవలయునని తొందరగనే యున్నది; కాని ఇదిగో వసుమతీ! ఇంగ్లీషు బడులలోఁ జదువువారికి మనకు ఆచారములని కొన్ని యున్నవనియే తెలియదు. కాని నీకు తెలియుట కెంతకాలమో పట్టదులే! కన్నె చెఋ నెంత వదలించుకొనిన అంత వడిగా నీవు నాకు రుచి చూపఁగలవు' అనెను.

అత్తగారు వంటయింటిపెత్తనము వహించి కోడలికి గది చూపెను. వసుమతి గదిలోఁ గూరుచుండెను. తాను రాఁగనే భర్త తఱలిపోవుట అపుడు వసుమతికి లెస్సగా నాటెను.

సంసారము, బడిచదువు, తండ్రిశిక్ష యీమూఁడును వసుమతి మానసమున ఆవర్తమువలెఁ దిరుగఁజొచ్చెను. సంసారము సాపేక్షము. బడిచదువు ఉదరపూరకము. తండ్రి శిక్షణము శాంతి కపోష్టికము.

విసంవాదముతో గృహప్రవేశము. గృహప్రవేశముతో పతివివాసము. ఈ యపశ్రుతిలో అత్తగారి ప్రేమాలాపము జీవగఱ్ఱ.

వసుమతి ప్రకృతివిషమస్థితిలో నొక్కొక విషయమునే వేఱువేఱుగా నాలోచింపఁ గడఁగెను. ఎంత యాలోచించినను ఆదియే గాని యంతము లేదు. ఒకొక్కవిషయమ మొకొక్క రస్తా. ఆరస్తా బ్రహ్మాండమంతయుఁ జుట్టఁబెట్టి మఱల మొదటికే వచ్చి కలియుచుండెను.

వీరవెంకమ్మ వసుమతిని భోజనమునకుఁ బిలిచెను. అత్తయుఁ గోడలును భుజింపఁ గూరుచుండిరి. అత్త యిటులనెను–'అమ్మాయీ! నేను పెద్దదాన నయితిని. ఇఁక ఈయింటిభారమంతయు నీది. ఏను గృహదేవతను, మీరు ఉత్సవవిగ్రహములరు. మీ నాయనగారా క్షయకు గుఱియయిరి. మావాఁ డా యిఁకవ్యవసాయము వేదాయము చూచుకొనవలయును. నీ వింకను బడి నంటిపెట్టుకొనియుంట తగదు. ఇప్పటికే ని న్నందఱును అనరానిమాట లనుచున్నారు. ఏమందువమ్మా? నామాటకు మాఱుమాట చెప్పవని నాకుఁ దెలియును.'

కోడలు మాఱుమాట చెప్పలేదు. 'సమాధానము లేదా' యని యత్త యడిగెను. కోడలు మాటాడలేదు. అత్తగారిముఖము గంభీరమాయెను. ఆమె చేయి విదిల్చి అన్నము విడనాడి లేచెను. కోడలును లేచెను. లేచి పను లన్నియుఁ జక్కఁబెట్టెను. వీరవెంకమ్మ అపసోపాలుపడుచు వంటయింటనే పయఁట పఱచెను. వసుమతి గదిలో శయనించెను. అచట నున్న ప్రతివస్తువును పరికించెను. కుంకుమాలంకృతమయిన వీరాంజనేయ విగ్రహ మొకటి వసుమతి నాకర్షించెను. ఆంజనేయుని గాథలఁ దలఁచికొనుట నట నిదిరించెను.

ఉన్న మూఁడురోజులును అత్తకోడండ్రకు మఱి సంభాషణ లేదు. తెచ్చిన వస్త్రములు తెచ్చినటులనే యుండెను. వసుమతి వచ్చిన చందముగా వెళ్లిపోయెను. అత్తగారు చూచుచుండఁగా వీరాంజనేయ విగ్రహమును వసుమతి తనపెట్టెలోఁ బెట్టుకొనెను.

వసుమతి యిటు వెళ్లఁగనే అహోబలుఁడటు వచ్చెను. అహోబలుఁడు రాఁగనే వీరవెంకమ్మ 'నాయనాఁ కోడలు నీ వీరాంజనేయము చూచి చాల మెచ్చుకొన్నది. తీసికొని వెళ్లు'మని ఇచ్చితి ననెను.

అతఁ డీమాట కిష్టానిష్టము లేమియుఁ గనఁబడనీయలేదు. తల్లికిఁగూడ దాఁ పఁదఁగిన వింత యొకటి కుమారుని మనస్సునఁ దూఱినదని వీర వెంకమ్మ యనుకొనెను.

## 10

అమ్మవారిని ఓలలాడించి యింటికి వచ్చు ముత్తైదువులవలెను, పీరులను బంపి వచ్చు ముసలమానులవలెను బాలు రందఱును బడులకు వచ్చిరి.

అహోబలుఁ డీతూరి మిగుల నోపికతో వ్యాసంగము చేయఁదొడఁగెను. 'పాఠము రావలయును; కడుపు నిండవలయును' అని యతఁడు శపథము చేసికొనెను. అతఁడు వల్లింపఁ గూరుచున్నచో టఱిగిపోఁ దొడఁగెను. చెమటకుఁ దడిసి కాకితము చినుఁగఁ బాఱును. అప్పటికి పాఠము వచ్చును. పిదప నన్నము తినును. చేయి కడుగుకొనఁగనే ధారణయు క్షాళిత మయినటు లగును. అతఁడు క్రమ్మఱఁ జదువును. వల్లించుచునే బడికిఁబోవును. పాఠము నెటులనో యప్పగించును. ఉపాధ్యాయుఁ డుపన్యసించున దతని కయోమయము. అవమానమనుకొనక అతఁడు ప్రశ్నించును. చివాట్లు తినితిని బోధపఱుచు కొనును. బడినుండి పోవుచు మననము చేయును. గడిమెట్లు ఎక్కఁగనే యదియంతయు వమనమయిపోయినటులగును. దుర్బలమగు నెద్దును గానుగకు కట్టినచో నెటులీడ్చునని యతఁడు లోలోపల ననుకొనెను.

ఉపన్యాసరంగములం దహోబలుఁడు పలుమాఱులు ప్రాణాయామ పరాక్రమము వినియుండెను. తెలవారుజాముననే సాము చేసిన పిదప స్నానమొనరించి యతఁ డిపుడు ప్రాణాయామమునకుఁ గూరుచుండును. నీటివేళ దాఁటినపిదప నల్లిని త్రిప్పినచో నది యొక ధ్వనిచేయును. గుడుగును పీల్చుచో నొక కలరవముదయమగును. అతఁడట్టిధ్వనితో గాలిని లోనికిఁ బీల్చును. సొట్టపడునటులు ముక్కు మూసికొనును. ఊపిరితిత్తులు క్రిందట్టు మీఁదట్టగును. గ్రుడ్లు ప్రత్తికాయ లగును. ఉబ్బిన నీరు గట్టుత్రెంచుకొని పాఱినటులు శ్వాసలు గుండెలతోఁగూడ బయటఁబడును.

ఇటు లొక యరగంట గాలితో గారిడీ చేసి యతఁడు పుస్తకముచేతఁబట్టును. అక్షరములన్నియు నతని కేకాకారముగా గానిపించును; సొక్కువచ్చును. అప్రయత్నముగా నిదిరించును. పిదప గాలి లోనికివచ్చుట యొకయెత్తు; బయటి కేఁగుట యొకయెత్తు. అతఁడు లేచి దగ్గును. ఈరీతిగా ప్రాణాయామముచే పుస్తకము విడనాడుట యటుండఁ

గా శరీరమును గూడ విడనాడవలసిన పని పట్టె నని యతఁడు తెలిసికొనెను. ఆనాఁడే ప్రాణాయామమున కతఁడు తిలోదకములు విడుచుకొనెను.

అఁడు దని సరస్వతి నహోబలుఁడు పూజింపఁడు. గణపతి గజ మని కాసునకుఁ గొనఁడు. హయగ్రీవునిది గుఱ్ఱపుఁ జదువని పెదవి విఱుచును. బ్రహ్మ యతనికి విద్యాపతి. అతఁడు తన యెట్టెదుటిగోడకు నలువ చిత్తరువును నిలువఁదీసెను. అతఁ డర్పించు గంధమాల్యములతో చిత్తరువు లోపించెను.

ఈపూజలచే కాలమునందు వ్యయము మాత్రము అతనికిఁ గానిపించుచుండెను గాని విద్యలోమాత్రము ఆయము కానిపించుచుండుటలేదు. గ్రుడ్డివాఁడు కావున మిల్టను విద్యాదేవతను కొండాడుకొనెనని యతఁడు తెగడెను. సరస్వతిని స్తవ మొనరంచిన విట్మన్ అతనికి వెఱ్ఱివాఁడు. మఱునాఁ డాచిత్తరువు ముక్కలుముక్కలయి మునిసిపాలిటీ ఖజానాలో నిలువయాయెను.

ఒకనాఁ డాతఁడు యతుల కొఱకును, ప్రాసముల కొఱకును అప్పకవీయం నవలో కించుచుండఁగా కర్మము చాలక కవితారసాయనములు కంటఁబడెను. బాగుగా పరిశీలించి దినుసుల పేరులు వ్రాసికొని ఒకరూపాయ డబ్బులు జేబున వేసికొని బజారునకుఁ బోయి వసయుఁ దేనెయు బెల్లమును గొని గదికి వచ్చి మెత్తగా నూతీ తాల్చి వస్త్రగాళిత మొనరించి కలిపి రెండు పెద్ద పారణ-ముద్దలు చేసెను. దీపం జేగంటవలె నుండెను. పుస్తకముల నిటులు నమిలి మ్రింగవలయు ననునటులు అతఁడు పుటలు విప్పి చదువుకొనుచు వసముద్ద విఱిచి నమిలి మ్రింగఁదొడఁగెను.

'అబ్బా! బెల్లం తక్కువ యయినది' అని యతఁడు మఱి కొంచెం బెల్లం కలిపి మరల మ్రింగెను. ముఖద్వారం మూసి కొనెను. ఇంత తేనెకలిపెను. ముద్ద పలుచబడెను. కొంచెం వసయు బెల్లమును గలిపి ముద్దకట్టు సరిగాఁజేసెను. పిదప పుస్తకం చూచుచు వసముద్ద మ్రింగుచు, వసముద్ద మ్రింగుచు పుస్తకంచూచుచు, ఓకరించుచు సహ్యం చేసికొనుచు, సహ్యం చేసికొనుచు ఓకరించుచు, గూండ్రించుచు అడఁచుకొనుచు, అడఁచుకొనుచు గూండ్రించుచు రెండుజాములగువఱకు రెండు ముద్దలను మ్రింగి కూరుచుండెను. అటుపైని పుస్తకం భూమ్యాకాశములు చీఁకటివెలుఁగులు ఏకమయి పోయెను. చేతితో నెవరో అంత్రమును దేవినటులుండెను. హఠాత్తుగా వాంతి సూచిత మాయెను. అతఁడు దమించుకొనెను. అతఁడు చాలసేపు జీర్ణకోశముతో పోరాడెను. వస కైవసము కాలేదు. తుద కతఁడా విద్యారసాయనము నంతయు వెడలఁద్రోలవలసి వచ్చెను. బొడ్డునుండి నోటిదాఁక నొకటే వసకంపు. ఆహో బలుఁ డంతయు వసాగంధుఁ డయిపోయెను. అతనికి గ్లాని హెచ్చెను. కనులు లోనికిఁ బోయెను. ముఖం చెమట

చెలమయాయెను. శయ్యపయిఁ బడెను. వసయంతయు బయటఁబడినపిదప నతఁడు నిదురఁబడెను.

అతఁడు పదిగంటలకు లేచెను. వస గుఱుతువచ్చెను. బుద్ధి బరువాయెను. విద్యా రసాయనమున కుపవాసమే విఱుగుడని నిశ్చయించెను. కోలుకొనుటకు కొన్నాళ్లు పట్టెను.

అతఁడు వసుమతిమీఁద కారములు మిరియములు నూఱెను. చిన్ననాఁటఁ దనకుఁ దిన్నగా వసపోయలేదని తల్లిని తిట్టుకొనెను. వసుమతికి మరల నొక లేఖ వ్రాసెను. దాని కెన్నాళ్లకును ప్రత్యుత్తరం రాలేదు. దాన వసుమతి బడి మానియుండు నని కొంచెం నిశ్చయించెను. సందేహం మాత్రం సమయలేదు. గడియారమును గాంచెను. పది. రైలుకు బయలుదేఱెను.

ప్లాట్ ఫారంమీఁద నొకపిట్టయేని లేదు. రైళ్లు మాఱినావేమో యనుకొని స్టేషనులోని కేఁగి గడియారము చూచెను. పండ్రెండు. అతనియొడలు మండుకొనిపోయెను. వెనుదిరిగి వచ్చెను. గడియారమును గోతవయిచెను.

ఆ మఱునాఁడు కాకినాడకు రవాణా యాయెను. స్కూలుగోడలప్రక్క నక్కి నక్కి కూరుచుండెను. ఒంటియెద్దుబండి యొకటి వచ్చుచుండెను. దాన నలుగురు బాలికలు కలరు. వారు గేటుకడ దిగి పుస్తకహస్తములతో లోనికిఁ బోవుచుండిరి. అహోబలుని హృదయమున నొక సుడిగుండము గిర్రునఁ దిరిగెను. ఆహోబలుఁ డచటనే కూరుచుండి దుఃఖించుచు ఆలోచించుచు, ఆలోచించుచు దుఃఖించుచు నుండెను.

అహోబలుఁ డిటులు దుఃఖించి యాలోచించి, యాలోచించి దుఃఖించి యత్తెత్తి చూచువఱకు బడినుండి బాలురందఱును వెళ్లిపోవుచుండిరి. తుట్టతుదకు పదిమంది బాలికలలో రాణివలె వసుమతి నడచిపోవుచుండెను. ఒక సౌందర్య తరంగ మాకాశమున ముంచి గాలిలోఁ బోయెను. దాన నహోబలుఁడు ముగ్ధుఁడై పిదప శాంతుఁడై తిరుగు రైలెక్కెను.

అతఁనొకనాఁ డిటులనుకొనెను - మన చదువు వేదం కాదు, శాస్త్రం కాదు, భూగోళం, చరిత్రం. వీని నెందులకు కంఠపాఠ మొనరింపవలయును?

అతఁడు వల్లన మానివయిచెను. గుఱుతిడుకొను టలవాటు చేసికొనెను : దానితో బుద్ధిపయి శ్రద్ధ కలిగెను. అతఁడిపుడు మఱపు గుఱుతులనడుమఁ బడెను. క్రమక్రమంగా గుఱుతుముడి యందెను. మఱపు చోటున గుఱుతు అదిష్టమాయెను. ఇపుడు ప్రవాహము నందు కొంచెము కొంచెము కాలానఁదొడఁగెను.

లోఁగడ ఆంధ్రోపాధ్యాయుని మొదలు ఆంగ్లోపాధ్యాయుని వఱకును అహోబలున కెద్దు ముద్ది చూపిరి. ఆంధ్రోపాధ్యాయుఁడు మహిష శతక మంతయును వినిపించెను. ఇతఁ డింకఁ బనికి రావచ్చు నని ఆంగ్లోపాధ్యాయుఁడుకూడ ననుకొనెను.

విద్యార్థులలో పెద్ద కలవర మొకటి బయలు దేఱెను. అహోబలుఁడు పరీక్షకుఁ బంపఁబడియెను. నాయకుఁడు హాజరుకాలేదు. గాని బాడ్మింటన్ కోర్టుముందు టీపార్టీ యొకటి అహోబలునిపేర బాలురు జరిపిరి.

పరీక్షలు సమీపించెను. సగం బెదురు తోడను సగం ధైర్యంతోడను అతఁడు పరీక్షకుఁ గూరుచుండెను. కంగారను మాట అహోబలుఁ డెఱుఁగఁడు. చేతినుండి కాకితములు లాగుకొను వఱకును మెలమెల్లగా నాలోచించి వ్రాయుచు 'ఈయవలసివచ్చెనే' యని యతఁడు పరీక్షాపత్రము లిచ్చెను.

## 11

అహోబలుని కెఱుక లేకుండ వీరవెంకమ్మ గ్రామమునందు నలుగురిని విందునకుఁ బిలిచి వచ్చెను. బడిపంతులహోబలుని జూచి వెనుక వెనుక కొదిగెను. 'మీరు మాకు కలకట్టరయి రావాలి' అని పెద్దరయితు రామయ్య ప్రశంసించెను. బడిపిల్ల లందఱును అహోబలుని చుట్టు మూఁగిరి. అహోబలుఁడు ప్యాసాయెను!

ప్యాసయినవాఁడు జుట్టు ఝాడించును. వానికి బంధము లుండవు. వాఁడొక భావ విహంగం. లా అండ్ ఆర్డరులకు అతఁడతీతుఁడు. అతఁడొక జీవన్ముక్తుఁడు.

అహోబలునిసంగతి వేఱు. అతఁడు చెమటోడ్చి యోడ్చి రోఁజిరోఁజి యేడ్చియేడ్చి తానీ బరువునుబాఱవయిచెను. కర్మము చాలక ఆబరువు సరియగుచోటునఁబడెను. దీనితో మరల నొక క్రొత్తబరువు తయారు!

వసుమతి తప్పదని యతనికి నమ్మకం. పిదప నామె చదువు మానకపోవుట శిలా క్షరము. దానితోఁ దన కింకఁ జదువు నిర్బంధం. అందఱును పరీక్షలు తప్పి యేడ్తురు. అహోబలుఁడు పరీక్ష యిచ్చి యేడ్చెను. 'వసుమతికి మఱల చీటి వ్రాయుచో చండాలుఁడ!' యని యతఁడొట్టిదుకొనెను.

ఈ సెలవులలో మంచిరోజు చూచి ముహూర్తం పెట్టింపుఁడని వీరవెంకమ్మ స్వయంగా వెళ్లి కైలాసరావు నింటికడ తేవినీవెసెను.

'మా అమ్మాయి స్కూల్ ఫైనల్ పరీక్ష యిచ్చిన తరువాత' నని కైలాసరావనెను.

అల్లుఁడు ప్యాసగుటచే సోమమ్మ కైలాసరావులకు రాజీకుదిరిపోయెను గాని ముహూర్తమాఁపుటచే దొడ్డకలఁత యేర్పడెను. కైలాసరావు క్షయ పీడితుఁడయి యుండుటచే

వియ్యపురాలు మూకీభావముతోడనే తన పక్షమును సమర్థించుకొని వెళ్లిపోయెనుగాని సోమమ్మ మాత్రం వ్యాధి చేయవలసియున్న పనులన్నింటికిని తిట్లతోడను తిమ్ములతోడను దాను పూఁటపడెను.

వసుమతి డబుల్ ప్రమోషను బడసి స్కూలుఫైనలులోఁ జేరెను; అహోబలుఁ డింటర్ మీడియేటులో.

ఇపు డిచట నతనికి దిగ్భ్రమ కలిగెను. ఈయడవిలో దారియు లేదు; డొంకయు లేదు. దొర యుపన్యసించుచుఁబోవు నింగ్లీషు - ఉచ్చారణ మతనికి గొంతుక దిగలేదు. ఇదివఱకుఁ దనకు వచ్చిన పదజాలమునం దెచటను అట్టి పద మొకటియు లేదు. ఇదంతయు నొక గొలుసుకట్టు. ఒకవేదారణ్యం కాసుపాసు!

హిందూ ప్రొఫెసర్ల సంగతి గూడఁ దక్కువగా లేదు. తుదకుఁ దోడి బాలుర సంగతియు నీడుజోడే. తుదకు హోటలులోఁగూడ గల్లంతే. ఇది లండనా? తెలుఁగు పండితుఁడు కూడ నింగ్లీషే. ఇట్టి యీ యింగ్లీషు గుర్రముతోఁ దా బరుగులెత్తు టెటులు?

హైస్కూలులో తెలిసీ తెలియని స్థితి. అచట విచారపడుటకుఁగాని వల్లించుటకుఁ గాని కొంచె మవకాశం కలదు. ఇచట విచార మొకటియే శరణ్యము. అహోబలుఁడు మరల నహోబలుఁ డాయెనని యతఁడు తెలిసికొనియెను. ఒకొక్కరోజు గతించినకొలఁ దియు నతని కధీరత మెండు కాఁదొడఁగెను. అతని కనుల కంధకారము కానిపించెను. క్రమముగా ఆ చీఁకటి అభేద్యమగు గోడ యయిపోయెను.

అహోబలునకు మాటిమాటికి వసుమతి గుఱుతువచ్చును. పుస్తకములు చేతఁ దాల్చి తల యెత్తుకొని సూటిగాఁ బోవుచున్నటులుండును.

ఆఁడుది. విశేషించి యొకని భార్య. దానను రూపము. ఈ రూపపరిమళముతో పలువురు బాలురలో నిత్యనివాసము. తన మాట వినని, ప్రత్యుత్తరముగూడ పంపని అవినయము. ఇది యంతయు నతని గోరుచుట్టునకు రోకఁటిపోటు.

ఇట్టి దుస్థితిలో నతని పాలిట కృతయుగ మారంభమాయెను. 'ఇంగ్లీషు బడులను బహిష్కరింపుఁడ'ని గాంధి శంఖం పూరించెను.

ఈ శంఖధ్వని ముమ్మొదట నహోబలునకు వినఁబడెను. వెంటనే బడిని బహిష్కరించి కూరుచుండెను.

బడిని బహిష్కరించినవారి నామావళిలో అహోబలుని పేరు ఆద్యం. ప్రతి పత్రికయు నతనికి జయపెట్టెను. ప్రతి విద్యార్థియు నతనిని సందర్శించెను. అతఁడు తొల్లి ప్యాసయిన దసత్యం; ఇపుడు నిజం.

కథా నిలయం శ్రీకాకుళం

మెడికల్ కాలేజీలోఁ జదువుచున్న వాసుదేవరావు అహోబలుని జూడవచ్చి 'తలకుఁ దగనిపని చేసితివోయీ!' అనెను. అహోబలుఁ డటనుండి యోసరిల్లెను.

మంగలకత్తియొకటి, ట్రంకుపెట్టె యొకటి కిట్‌బాగొకటి కొని యతఁడు రైలెక్కెను. అహోబలుఁడీ బలుపుతో నింట దిగఁగనే తల్లి చూచి– 'పరీక్ష గెలిచి వచ్చితివా నాయనా?' అని యడిగెను.

గెలుపును ఓటమిని దాఁటియే యతఁడు వచ్చెను. గాన 'లేదమ్మా! గాంధీగారి హుకుము చొప్పున బడిని బహిష్కరించి వచ్చితిని' అనెను.

'వసుమతిగూడ మానుకొనెనా?'

అహోబలుఁడీమాటకు బదులాడలేదు. తాను దెచ్చినవస్తువుల నన్నిటిని అచటనచట సర్దుకొనుచుఁ గూరుచుండెను.

వీరవెంకమ్మ దాని యర్థమును గమనించెను. ఆమె హృదయము కంటకిత మాయెను. ఆమె చాల వాచాల. కాని యపుడు మూకీ భావము వహించి మప్పితముగా నిటులనెను – నీ కింకొకపెండ్లిచేయుదును.'

అహోబలుఁడు తల్లిని జూచెను. తల్లి యహోబలుని జూచెను. కుమారుని కనులలో రెండు బాష్పబిందువులు. తల్లి కనులలో రెండు స్ఫులింగములు. ఇటు లొకరిమొగము లొకరుచూచుకొని యెవరిపనులకు వారేఁగిరి.

ఆ మఱునాఁటినుండియు అహోబలుఁడు తన పూర్వసంకల్పములు కొనసాగుటకుఁ గావలసిన పరికరముల నన్నింటిని సమకూరుచు కొనఁదొడఁగెను. వీర వెంకమ్మ సంబంధములను వెతుకఁజొచ్చెను.

అహోబలునకు ప్రకృతోద్యమమున నచ్చిన దొక్కటియే. అది పాఠశాలా బహిష్కరణం. ఈ విషయమున మహాత్మునితో నతనికి సంపూర్ణైకమత్యము. విదేశవస్త్ర బహిష్కరణ మతనికి గిట్టదు. అహింస యొకటి యతని కభిమతము. మిగిలిన విషయములయెడ నతఁడు జాత్యంధుఁడు. ఇపుడే వార్తాపత్రిక తెప్పింపఁదొడఁగెను.

వీరవెంకమ్మ బంధు సముద్రమునందలి కన్యారత్నములఁజాలవఱకేతెనుగాని గుణము నను, రూపమునను, చదువునను గృహ నిర్వాహకత్వమునను వసుమతి కీడయిన దింకొకతె కలదని యనుకొనలేదు. వసుమతి యున్న మూఁడు రోజులును మూఁడునెలలై, మూఁడేఁడులై, మూఁడుశతాబ్దులై యామెకుఁ గానిపించెను. ప్రతిపనిమీఁదను వసుమతి కరశిల్పము రూపముతాల్చి కానిపించెను. ఇట్టి కోడలిని విడనాడి మఱియొకకోడలిని వెతుకుటలో నామెకు కష్టము లేకపోలేదు. అయినను తప్పని సరి.

దగ్గఱ బంధుగులలోఁ దనకుమారునకు పిల్ల నిచ్చుటకు ముందడుగు వేసిన వారొకరును లేరు. ఆస్తిచూచి కైలాసరావు టోపి పడిపోయినాఁడని చాటుటలోఁగూడ వారు వెనుదీసినవారు కారు. అట్టి చుట్టములు పెండ్లి మీఁదిపెండ్లి యయినను ఇపుడు పిల్ల నిచ్చుటకు సందేహింపరని యామె నమ్మకము. ఏల? చుట్టములే మోసపడిపోయిరి. అహోబలుఁడు ప్యాసయి కూర్చున్నాఁడు!

ఇంటివెనుక నున్న రెండుకరముల దొడ్డిని అహోబలుఁ డాశ్రమముగాఁ జేయ సంకల్పించుకొనెను. నూయి యుండనేయుండెను. కొన్ని మావిళ్లున్నవి. కొన్ని మొక్కలు, పాకలు మాత్రమే తరువాయి. పాకలనియు, పర్ణశాలలనియు, ఆశ్రమములనియు పేరులో మాత్రం దారిద్ర్యంకాని అవి రాతికట్టడములే కావలయును.

అతఁ డెన్నఁడేని యేపనినేని చేయించి యుండలేదు. ఇదియే మొదలు. 'ఇల్లు కట్టిచూడు; పెండ్లి చేసి చూడు' అను సామెతను గూడ వినియుండలేదు. బస్తీనుండి పనివాండ్ర రావింపఁ దలఁచుకొనెను. గాని గ్రామమునందలి కొందఱ సలహావలన ఊరిపనివారిచేతనే పనిచేయింపఁదలఁచెను. స్వదేశాభిమానంలో స్వగ్రామాభిమాన మున్నదని యతఁడు సులువుగనే గ్రహింపఁగలిగెను.

దావీదు వచ్చి సలాం చేసెను. అహోబలుఁడు తల వంచుకొని 'మన యూరిలో వడ్రంగ మెవరు బాగుగాఁ జేయుదురు?' అని యడిగెను.

'హుఁణ్ణాడ్‌గా అండీ షుబ్బణ్ణాసారి!'

ఇంతలో సుబ్బన్నాచారి వచ్చి నమస్కరించెను. అహోబలుఁడు తల వంచుకొని 'మన యూరిలో గోడ లెవరు బాగుగాఁ గట్టుదురు?' అని యడిగెను.

'దావీదువంటి మేస్త్రీ మఱీ దొరకఁడు' అని సుబ్బన్నా చారి యనెను.

అహోబలుఁడు తలయెత్తి దావీదును జూచి 'రోజుకూలి యెంత?' అని యడిగెను.

ఈ ప్రశ్న వినినతోడనే దావీదు కనులెఱ్ఱబాఱెను. 'మేం ఖూలిసేస్తాం? రోజ్ నామా బోలో సర్కార్! రోజ్‌నామా! రోజీనా బోలో సర్కార్! ఆ ఫంతుల్‌గారు వుండాదే హూల్ ఖాంతంగారు!' ని యాదావీదు దూరంగానున్న పూలకాంతమ్మయిల్లు చూపి 'ఆరు యిచ్చార్‌గాహండీ రెండో రూఫాయకు ఫావల్ తక్వా' అని యనెను.

'రెండురూపాయలకు పావలా తక్కువా?'

'హాఁ సర్కార్.'

'కాదు రూపాయన్నర.'

'అట్లాగయితే అన్నం పెట్టించండి' అని సుబ్బన్నాచారి యనెను.

అహోబలుఁడు కొంచెం మాలోచించి అంగీకరించెను. దావీదును సుబ్బన్నా చారియు బజానా తీసికొని వెళ్లిరి.

## 12

వేయి రూకలు చాటుగా నిచ్చినచో పిల్ల నిత్తుమని దగ్గఱ చుట్టములలో నొకరు వీరవెంకమ్మకు వార్తనంపిరి. వీరవెంకమ్మయే వేయి నూటవదార్ల కట్నమున కాసపడియుండఁగా ఈవార్త. దీనితో నామెయొడలు మండుకొని పోయెను.

'మేము రెండవపెండ్లి చేసికొనుచున్నామ'ని వీర వెంకమ్మ యీసందడిలో సోమమ్మకు కబురు పంపకుండ నూరకుండలేదు. 'మా పిల్లకు మేమును రెండవపెండ్లి చేయఁగలమ'ని వియ్యపురాలికి సమాధానమిడుటలో సోమమ్మయు వెనుకాడలేదు. ఈ వార్త లన్నియు విని శయ్యాతుఁడగు కైలాసరావు చెవులు మూసికొనియెను. వసుమతి నవ్వెను.

అహోబలుఁడు బడిని బహిష్కరించి నటులును ఆశ్రమమొకటి స్థాపించు చున్నటులును ఇంగ్లీషు పత్రికలలోను, తెలుఁగు పత్రికలలోను కైలాసరావు చదివి యుండెను. బడి మానుకొనుట అంత యపాయం కాదుగాని ఈ యాశ్రమస్థాపనం మించిన పని యని యతఁడనుకొనెను. ఊరక సోమరిపోతయి తిరుగుటకన్న నిది మంచిదే యని యతఁడెంచెను.

వసుమతి యత్తింటి కొంటిగా వెళ్లినపుడు అహోబలుఁడు గ్రామంతర మేఁగుటయు తన జబ్బులో నొకమాఁటేని రాకుండటయుఁ జూడ నతనిమనమునఁ గలఁకపుట్టెను. కూఁతు నిపుడత్తింటికిఁ బంపఁ దలఁచెను గాని పరీక్షలు సమీపించెను దినదినమును దనకు నూట రెండు డిగ్రీలకుఁ దక్కువలేదు. అల్లుఁడు తన కడకురానిచోఁ దానే పోవలసిన స్థితి పట్టెను. మఱియు రెండవ పెండ్లికి ఏర్పాటులు జరుగుచున్న యీసమయమున తానచటికి వెళ్లుటచెల్లదు. ఈచిక్కులచే నతనిజ్వరమునకు మనోజ్వరం తోడాయెను.

వసుమతి తండ్రిస్థితిని గుఱుతించెను. తన మీఁది ప్రేమచేతనే యిరువాగుల వారును ఇక్కట్టుల పాలగుచున్నారని తనకుఁ దెలియును. కావునఁ దండ్రితో నిటులనెను. – 'తమ యాజ్ఞయగుచో నే నత్తింటి కేఁగెదను.'

నిక్కమున కత్తవారియింటి కేఁగుట కొకరియాజ్ఞానుజ్ఞ లక్కఱలేదు. తలిదండ్రులు పంపుటనున దాచారం. మగనికడ కరుగుటకు మనస్సే గురువు. వాంఛ కలుగుచో కాలభూము లడ్డమాఁకలు గావు.

కూఁతుమాట నాలకించి తండ్రి యిటులనెను. –'అమ్మా! ఈ యాజ్ఞయను కళ్లెమును నాచేతులలో నుంచుకొనలేదు.'

కూఁతురిటు లనెను. – 'తమ శిక్షణవలన నాయెఱింగినమాట మనవి చేయుచున్నాను. పుట్టిన తరువాత ఆఁడుదానికి మగనితో కాఁపురము చేయుటయే పనికాదు.'

తంట్రియిటులనెను– 'అదియు ఒక మకాము.'

కూఁతు రిటులనెను.– 'ఆ మకాము చేరుటకు బాట బాగుచేసికొన వలయుగదా!

'అగును. అట్టిధీరత యున్నచో నా కిఁకఁ జింతలేదు.'

'మీరధైర్యపడకుఁడు! తమ యనుగ్రహమువలన నాకట్టిధీరతలోఁ గొఱఁతలేదు.'

కైలాసరావు ముఖం వికసించెను. కొంచెముసే పూరకుండి – అతఁడు తొందర పడి రెండవపెండ్లి, – అని ఆ వాక్యమును పూర్తి చేయఁజాలక పోయెను.

'నాయనా! దానికిఁజింత వలదు. అట్టిది జఱుగదు. జఱిగెనా ఆ రెండవయామె నాబరువులోఁ జాలభాగం సహింపఁగలదు.'

కైలాసరా వాకసము చూచి 'సంసారమెఱుఁగని బాలికమాటలేనా యివి?' అని యనుకొనియెను.

దినములు గతించుచున్న కొలఁదిని వీర వెంకమ్మ కశాంతి యెక్కుడాయెను. బెండకాయ ముదిరినను, బ్రహ్మచారి ముదిరినను పనికిరా రని యామెకుఁ దెలియును. ఎన్ని సంబంధములు వచ్చినను శుల్కబలి గోరుచునే యుండెను. దీనితో నామెకు తనస్థితి బాగుగాఁ దెలిసివచ్చెను.

అహోబలునకు రెండవపెండ్లి యెందులకో నిక్కముగా నెవరికిని దెలియదు. కర్మము చాలకయో దిద్దువారి పొరపాటుననో అహోబలుఁడు ప్యాసాయె ననియు నిపుడు చదువు మానుకొని కూరుచుండుటచే వసుమతి యతని నవహేల చేసె ననియు నందఱును అనుకొనిరి. 'ఆఁడువారు చదువులు చదివినచో మానమర్యాద లుండునా? అహోబలుఁడు అహోబలమ్మయు, వసుమతి వసుమయ్యయు నయిపోయి ర'ని కొందఱు అనుకొనిరి. వంటింటి కప్పగించి గొడ్డుచాకిరి చేయించు మగవారి బయిసి బయటఁ బడిన దని కొంద అనుకొనిరి. వీర వెంకమ్మ లోలోపల కోడలిగుణముల కాకర్షింపఁ బడకపోలేదు. ఆ యాకర్షణమే ప్రకృత మీసుగా పరిణమించెను.

వీరవెంకమ్మ యిక్ష్వాకులకాలంనాఁటిదని వేఱుగా నిర్వచింపఁ బనిలేదు. ఆమెకు చదువుసందెలు రావు. చదువుసందెలు నేర్చిన కుటుంబమున కేని కోడలుగా రాలేదు. పుట్టినింట నేడుతరములవారిలోను, మెట్టినింట నేడుతరములవారిలోను విద్యాదేవతా కటాక్షం లేదు. పెట్టిపెంచినవారి చెప్పుచేఁతల వలనఁ గలిగిన యనుభవమే యామె

చదువు. కులగౌరవ కుటుంబగౌరవములే యామెకు పరమావధి. ఆపరమావధికి బ్రాఁకులాడుటయే నిత్యకర్మ. దాని కిపుడు భంగము కలుగఁజొచ్చెను. కోడలెంత గుణవతి యయినను ఈడేఱినపిదప చదువులబడిలోనికి వెళ్లుట ప్రాయశ్చిత్తం లేని యధర్మమే. అదిగాక చదివి పరీక్ష లిచ్చి పాగబెట్టుకొని ఆఫీసుకు వెళ్లునా? కొడుకు గరిటె బట్టుకొని వంట యింటఁ గూరుచుండునా? తా నిది యంతయుఁ జూచుచుఁ జూచుచు నెటులు సహింపఁగలదు? కావున శుల్కము నొసఁగి యయినను ఎవతనో యొకతను దెచ్చి ముడిపెట్టవలయును. వియ్యపురాలి ధీమాను చూర్ణమే చేయవలయును. కోడలి యవినయమునకు జవా బొసఁగి తీఱవలయును.

వీర వెంకమ్మ శుల్క మిచ్చెనని వంగి వచ్చినను దగ్గఱచుట్టము లిపు డెవరును ముందులకు రాలేదు. భరణమునకు వసుమతి దావా తెచ్చితీఱునని వారికి బెదురు. భరణము లెస్సగా నిప్పించుచున్న హైకోర్టు తీర్పులు వారి కోదార్పులుగా లేవు. అహోబలునిలో నుద్యోగసద్యోగములు చేయుసందర్భములా కానరావు. 'పిల్లవాని కేమి? బంగారుపిచ్చుక. ఒకరిజోలి యతని కక్కఱలేదు. ఇచ్చుటయే కాని పుచ్చికొను టెఱుఁగఁడు. ఉపకారమే కాని యపకారము లేదు. కొట్టిన దులుపుకొనిపోవును; తిట్టిన తుడిచికొని పోవును. ఉండవలసిన 'మనిషి.' ఈ భరణంసంగతి చూచిన తరువాత పిల్ల నిచ్చు విషయ మాలోచింతమ'ని యెవరికి వారు లోలోపల ననుకొనిరి.

వసుమతికి పరీక్షలయి పదినాళ్లాయెను. కైలాసరా వెముకల గూఁడై పోయెను. అతని శరీర మొక తెల్ల మడత. ముడతలు లేని యతనిమోమున బ్రహ్మవర్చసమే ఘటవిహిత మగు దీపకళికవలె చూపఱ కక్కజం గొలుపును. అతఁడమ్మా యనఁ డబ్బా యనఁడు. ఓరిమి యతనిని అతఁ డోరిమిని పన్నిదము చఱచి పరీక్షించుచుండిరని వసుమతి యనుకొనెను. రేయంబవలు తంద్రిశయ్యకడఁగూరుచుండి కనిపట్టుచున్న వసుమతికి ఆస్థితి యంతయు తన యదృష్టమున తొంగిచూచుచున్నయటు లుండెను.

రోగికి రోగ మొక యనుభూతి. మృత్యువొక ద్వారం. ద్రష్టకు రోగ మొక పాఠం. మృత్యు వొక పరీక్ష.

కైలాసరావు కష్టంతో కనులెత్తి చూచెను. లక్ష్యసిద్ధుఁడగు యోగివలె వసుమతి యతనిని జూచెను. పరస్పరాలోకనం లాముష్మికమను గుఱించి యాలోచించు కొనుచుండెను.

సెలవులలో వాసుదేవరావు రైలు దిగి వచ్చి కైలాసరావునకుఁ బ్రణమిల్లెను. కైలాసరా వాశీర్వదించి 'నాయనా నీకు సెలవులు లేవు. ఇటచఁ గూడ నీవు చదువుకొనుట కొక

క్రొత్త కాలేజి కలదు' అనెను. ఈమాటకు చిఱునగవే ప్రత్యుత్తరంగా వాసుదేవరావు కైలాసరావును కనుఁగొనుచు నిలువఁబడియెను. గాలితో నతఁడు పోరాడుటొక యెత్తుగను, అతని మొగమున వెలుఁగొక యెత్తుగను ఉండుటచే వాసుదేవరావు సంభ్రమాశ్చర్యములతో కైలాసరావునం దొక యపూర్వమగు వ్యాధి సాధకుల సమ్మేళనమును కనుఁగొనుచు నిలువఁబడిపోయెను.

ఇంతలో సోమమ్మ దర్భలతో నచటికి వచ్చెను. వాసుదేవరా వామెకు నమస్కరించి యాశీర్వాదం బడసెను. వాసుదేవ రావు సోమమ్మకేసి చూచెను. ఆమె మొగమున రూకంత కుంకుమబొట్టు కలకలలాడుచుండెనుగాని అధైర్య మొక బొట్టయినను లేదు. ఈ కుటుంబం కాలప్రవాహమున కనుకూలముగా గతి గలుపుకొనఁగల దని యతఁడనుకొనియెను.

సోమమ్మ తెచ్చిన దర్భలను కైలాస రావు చూచి – 'అచట పఱపుము' అనెను. సోమమ్మ పఱచెను, నడుమనడుమ నెడముండుటచే మరల లోనికేఁగి కొంత దర్భతెచ్చి చక్కగాఁబఱచెను.

కైలాసరావు మెల్లగా మంచంమీఁది నుండి లేచి యాదర్భశయ్యపై నొఱగ నాతో మీరందఱును నంత్యప్రార్థన చేయుఁడని కనులను మూసికొనెను. అందఱును ప్రక్కగాఁ గూరుచుండి ప్రార్థింపఁగడఁగిరి. కైలాసరావు ముఖము గంభీరమయి లలాటమున తేజస్సు పుంజీభవించెను.

## 13

ఒకొక్క చుక్కయే ఆకాశవేదిక కెక్కి జపించుటకుఁ గాఁబోలుఁ గూరుచుండెను. వెలుఁగును చీఁకటియు కుస్తీపట్టుటకు చేతులుచేతులు కలుపుకొనుచుండెను. గాని ప్రాణాయామము చేయఁదొడఁగెను.

సోమమ్మ కిపుడు తులసికోటయే కోట. ఆమె యందు గూరుచుండి జపము చేయుచుండెను. ఆ జపమంతయు వసుమతి.

ఆమె అసలు జపమును, వసుమతి – జపమును ముగించి నామపారాయణ మొనరించు కొనుచుండెను.

వసుమతి యింటిపనులో మునిఁగి తేలుచుండెను. అపుడు వాసుదేవరావుభార్య రాధయు, వాసుదేవరావును వచ్చిరి.

రాధ వడివడిగా వసుమతికడ కరిగి చేతనున్న పత్రిక యెత్తి 'సంతోషవార్త తెచ్చిన దాని కేమియీయఁగలవు. అని ప్రశ్నించెను.

'సంతోషముకన్న మిన్న యగున దేదేని యున్నచో దాని నీఁగలను' అని వసుమతి యనెను.

'మేలు' అని రాధ కౌఁగిలిగొని వసుమతి నంబరు చూపెను. వసుమతి చూచెను.

'తన తండ్రి చూడకయే గతించె'నని కాఁబోలు, ఒక నిట్టూరుపు విడిచెను.

ఈ ప్రసంగ మాలకించుచున్న సోమమ్మ మోము వికసించి వెంటనే ముకుళించెను. వాసుదేవరావు సోమమ్మకడకు వెళ్లికూరుచుండెను.

'నాయనా! ఇది ప్యాసగుటకన్న తప్పి పోయినచో నేను చాల సంతసించి యుందును' అని సోమమ్మ యనెను. వాసుదేవరావు మౌనముద్రనే ప్రత్యుత్తరముగాఁ జేసెను.

రాధ సమీపించి 'ఏమిటండీ అత్తగారూ! వసుమతి యనఁగనే మీమాటలనుండి కారము రాలును!' అనియెను.

'కారము లేనిదే పాకము రుచింపదు, రాధా! కూరుచుండుము' అని రాధకుఁ జెప్పి సోమమ్మ వాసుదేవరావుదెసఁ జూచి 'నాయనా! నీ ధర్మసోదరి కొకదారిఁ జూపవా' అని సోమమ్మ యనెను.

'బాబయ్యగారు పోవుటవలననే ఆ బరువు నాపైఁ బడినది' అని వాసుదేవరావు లోపల ననుకొనియెను.

'మే మిరువురమును వెళ్లి ముకుద్రాడు వోసి అల్లుని ఇచటికిఁ దీసికొనివత్తుము' అని రాధయనెను.

'ఓహో! ఆ గిత్తకు త్రాడువోయుటకు ముక్కులు లేవు, కొమ్ములును లేవు' అని వాసుదేవరావనెను.

సోమమ్మ కొంచెమునవ్వి 'నాయనా! నీవు వెళ్లి మాటలాడి ముహూర్తము పెట్టుకొని రావలయును' అనెను.

వాసుదేవరావు సమాధానము చెప్పక ముందే వసుమతి యచటికి వచ్చి 'నేనే అచటికి వెళ్లఁగలను' అనెను.

ఈమాటతో వాసుదేవరావునకుఁ గాని, రాధకుఁగాని ప్రత్యుత్తరము చెప్పవలసిన అక్కర తీరిపోయెను. ఆ మఱునాఁడే వసుమతి అత్తింటికి పయనమెత్తెను.

వీరవెంకమ్మ అహోబలునకు వడ్డించి గ్రామమునందలి నాలుగిండ్లును పెత్తనము చేయును. పెత్తనము ముగించి చెఱువునకుఁ బోయి రెండుబిందెల మంచినీళ్లు ఎత్తుకొని వచ్చును. అప్పటి కహోబలుని సాపాటులో సాఁబా లగును. అతఁ డన్నమును పెఱుగగు నటులు నమలును; పెఱుగును నీరగునటులు నమలును; నీ రావిరి యగునటులు

నమలును. అతఁ డేకాగ్రతతో భుజించును. భుజించునపుడు నమలుటతక్క నింకొకటి యెఱుఁగఁడు. నమలుచు నమలుచు రుచిలోని యానంద మనుభవించును. 'అన్నం బ్రహ్మేతి వ్యజనాత్.'

అతఁడు ప్రతిముద్దకు 'గోవింద' అనును. 'ముద్దముద్దకు బిస్మిల్లా.'

అభిఘారమునకుఁగాక అతనికి నేతితో మఱి పనిలేదు. అతనికి పొగపు అక్కఱ లేదు. శాకముల నిజరసమునెడ నతఁ డభిజ్ఞుఁడు. అతనికి వండఁబడునది చేబియ్యము.

అతఁడారోగ్యప్రకాశిక చదివికొనిగాని, జలవైద్యము తెలిసికొనిగాని ప్రకృతివైద్య మొఱిఁగి కొనిగాని యీమార్గ మవలంబింపలేదు. ఇది యంతయు అతని తలనే పుట్టెను.

వసుమతి యత్తింట నడుగిడిన దాహార వేళ. వసుమతి తలుపులు తెఱచెను. 'ఎవరువారు?' అని తన్నెవరును ప్రశ్నింపలేదు. వసుమతి సూటిగా వంటయింటిలోనే కేఁగెను. వసుమతి యహోబలుని జూచెను. అహోబలుఁడు వసుమతిని జూచెను. వసుమతి తలవంచుకొని యెదురుగా నున్న గదిలోనికిఁ జని తలు పోరగా వేసికొని తలుపుచాటున నిలువఁబడెను. అహోబలుని ముఖమున సాయంతన సమయమునందలి యాకాశ చ్ఛాయలు కొన్ని వడివడిగా నడచెను. క్రమముగా నతని మోము పరిమ్లాన మాయెను. అతఁడు పీఁట మీఁదినుండి రివ్వున లేచి దొడ్డిలోనికి వెళ్లెను. అతఁడు ముఖమును కాలుసేతులను కడుగుకొనుట వసుమతి చెవికిఁ దాఁకుచునే యుండెను. అతఁడు మఱి లోనికిరాలేదు.

వసుమతి లోలోపలఁ గొంచెము నవ్వుకొని, దొడ్డిలోనికి వెళ్లి కాలుసేతులు కడుగుకొని వచ్చి గదిలో చక్కఁగాఁ గూరుచుండెను.

పెత్తనము ముగించి బిందె బుజమునఁ బెట్టుకొని వీరవెంకమ్మ వచ్చెను. వాకిలి తెఱచియుండెను. 'ఇంతవడిగా భోజన మయినదా?' అని అనుకొని ఆశ్చర్యపడి ఆమె వడివడిగా లోనికి వచ్చెను. పీఁట ఖాళీ. విస్తరిలోని యన్నము వీసమేని తఱుగలేదు. 'నాయనా? నాయనా?' అని పిలిచెను. సమాధి లేదు దొడ్డిలోని కేఁగి చూచెను. శూన్యము ఆమె వెంటనే లోనికి వచ్చెను.

గదిలోనుండి వసుమతి యెదురువచ్చి అత్తగారికి నమస్కరించెను. వీరవెంకమ్మ తెల్లఁబోయెను. కొంతసేపటికి 'అబ్బాయి గదిలో నున్నాఁడా?' అని యడిగెను.

ఈ ప్రశ్నచే వసుమతికి నగవును, ఏడుపును వచ్చెనుగాని నడఁచుకొని మిన్నకుండెను.

వీరవెంకమ్మ గదిలో తొంగి చూచి వాకిటిలోనికిఁ బోవుచుండెను. అపుడు వసుమతి యిటులనెను.: 'వారు భుజించుచుండఁగా నే నింటిలోని కడుగిడితిని. వారు లేచి పోయిరి. ఈ పుణ్యమునాది.'

వీరవెంకమ్మ మఱిమాటాడక లోనికి వచ్చెను. వారిరువురును మౌనము వహించిరి. మౌనమే వారి యిరువురకును అర్ధభాగమొనరించెను.

వీరవెంకమ్మ కుమారునికొఱకుచూచి చూచి విసివి తుదకు మౌనమును వదలి 'నూతి కడకు వెళ్ళి స్నానముచేసి రమ్ము; నీకు అన్నము పెట్టెదను' అని కోడలితో ననెను. వసుమతి స్నానమునకుఁబోయెను.

'మగనిని వెడలనడిచి తిండి తినుటకే యిది వచ్చినటు లున్నది' అని వీరవెంకమ్మ యనుకొనెను.కాని వసుమతి స్నానముచేసి వచ్చి 'అత్తా! నేఁడు నేను భుజింపను. మీరు లేచి భుజింపుఁడు' అనెను.

'సరి, కొడుకును వెడలఁ గొట్టుకొని మూఁడుకాళ్ల ముదుసలిని నేను భుజింపనిచో లోకమునకుఁ గొఱంత రాదు.' అని వీర వెంకమ్మ వంటయింటి తలుపులు మూసివేసెను.

'మీరు భుజింపనిచో నామీఁదొట్టు' అని వసుమతి యనెను.

'ఒట్టుగానే యున్నది. యీ యొట్టులతోఁ తిట్టులతో నాకుఁ బనిలేదు' అని వీరవెంకమ్మ కొడుకును వెతుకుకొనుటకు గ్రామము లోనికిఁబోయెను.

వసుమతి లోలోపల నవ్వుకొని చెఱఁగు బఱచికొని శయనించెను.

వెతకి వెతకి వేసారి వీరవెంకమ్మ యింటికి వచ్చెను. వారును వీరును వసుమతిని జూడవచ్చిరి. 'కోడలడుగు పెట్టి కొడుకును వెళ్లఁగొట్టె'నని కొందఱాడిరి. 'గుఱ్ఱమంత పెండ్లామింటికి రాఁగా కాళ్లసవారీ చేసినాఁ'డని కొందఱనిరి, ఎవరికిఁ దోఁచిన మాటలు వారు విసిరి పెద్దలందఱును దయచేసిరి. 'అహోబలునిదే తప్పని పిన్నలని నిష్క్రమించిరి.

వసుమతి మూఁడునాళ్లు ప్రతీక్షించెను. అహోబలుఁడు రాలేదు. మఱి మున్నాళ్లు చూచెను. రాలేదు. ఈరీతిగా ఒకనెల దాఁటెను. రాలేదు. వసుమతి పుట్టింటి కేఁగ స్థిరసంకల్పము చేసికొనెను. ఒకనాఁ డత్తగారితో నిటులనెను – 'కోడలు వచ్చి అత్తగారిచే నిట్రుపాసములు చేయించెను. కొడుకును వెడలఁగొట్టెను. నాకిఁక సెలవు. నామీఁద తమకు దయగాని, ప్రేమగాని కలుగుచో వార్త పంపుఁడు. పంపిన వెంటనే రాగలను'.

వీరవెంకమ్మ మాటచెప్పలేదు. వసుమతి భూమిమీఁదికి వంగి నమస్కరించి రైలునకు వెళ్లిపోయెను. వసుమతి ఇంటికి వెళ్లిన నెలకు అహోబలుఁడు ఇంటికి వచ్చెను. వసుమతి యింటికిఁ జేరఁగనే సోమమ్మ 'అల్లుఁడు రాలేదా?' అనెను. 'నన్ను జూడఁగనే ఆయన గ్రామాంతరము లేచిపోయెను' అని వసుమతి యనెను. 'ఏ మొగముతో నింటికి వచ్చితివి' అని సోమమ్మ యనెను. 'నా మొగముతోనే నే నింటికి వచ్చితిని. నా కిసుమంతయి చింతలేదు. నాకొఱకు నీకుఁ జింతింపఁ బని లేదు. అమ్మా! నేనే నీకు

కొడుకునయి పుట్టియున్నచో నీ విటులనఁగలుగుదువా?' అని వసుమతి యనియెను. 'పుట్టలేదు కావుననే యిటులనవలసి వచ్చినది. అని సోమమ్మ యనెను. 'నేఁటినుండి నన్ను కొడుకుగా భావింపుము' అని వసుమతి యనెను. సోమమ్మ కనులవెంట జలజల నీరురిలెను. వసుమతి వారించి జరిగిన కథయంతయు నెఱుకపఱిచెను. అటుపిమ్మట సోమమ్మ యేమియు ఆర్భాటము చేయలేదు. కూఁతురుగ నగ లడుగఁగా 'ఎందులకు' అనిగాని 'ఇవి యెంత వెలచేయును?' అని గాని ప్రశ్నింపలేదు. తనకూఁతుమాట తానే వినుచోఁ దన కూఁతురు తన తపస్సున కడ్డము కాదని తలపోసెను.

వసుమతి ఇల్లు అమ్మి ఒకానొక అదృష్టదేవత సాహాయ్యమును నమ్మి ఇంటర్మీడియేటు చదువుటకు చెన్నపట్టణము ప్రవేశించెను.

## 14

గ్రామములలో సామాన్యముగా ఒక జట్టు మనుష్యులు, లేక కొన్ని జట్టుల మనుష్యులుందురు. బహుళముగా వారు తంజావూరు సత్రమునకు తగినవారు. వారికి ఈ లోకముతో కంటె పరలోకముతో నెక్కువ పని. అదృష్టదేవతమీఁదనే వారినమ్మకము. వారి కేపని యెడలను క్రమనియమములు లేవు – యదృచ్ఛాసృష్టివాదులు. వారికి ముద్ది నిలువదు – పరిణామవాదులు. వారి నాలుకకు పగ్గములు లేవు– స్వతంత్రవాదులు. తమలోఁ దమకు ఐక్యములేదు – 'జీవః ప్రతిక్షణం భిన్న' –వాదులు.

ఆ జట్టులో ఒకనాఁ డొకనికి లోకులలో నొకనిమీఁద కర్మము చాలక కోపము వచ్చును. వెంటనే అందఱకును కోపము వచ్చును. అట్టితఱి వారిలో వారికి మితియు మేరయు లేని ఐక్యము! ఆ రీతిగనే ఒకనిమీఁద అకారణముగా గౌరవము కలిగెనా వాఁడు బ్రహ్మరథముమీఁద ఊరేఁగవలసినదే – చిత్తస్వైరత!

ఆ గ్రామమునఁ గల ఇట్టి జట్టులో ఒకఁ డొకానొక శుభ ముహూర్తమున 'ఓబిళం గారు చాలా దొడ్డవారు రా' అనెను. వెంటనే మఱియొకఁడు 'ఛాలా దొడ్డబాబురా' అనెను. ఇంకొకఁడు 'ఛాలా యేమిటిరా? ఛాలాఛాలా దొడ్డబాబురా' అనెను. అందఱును గలిసి 'ఓబిళంగారికి జే' అని ముమ్మాఱఱచిరి.

అహోబలుఁడీ బ్రహ్మరథమునుండి పడిపోననుకొనెను. అతఁడొకనాఁడొక చిన్న సభచేసి ఆ గ్రామమునకు తపాలాకచేరీ, రోడ్డు, సహకార – సంఘము, వ్యవసాయ– పరిశోధన – క్షేత్రము, చిత్రకళామందిరము, రామభజనాలయము : ఇవి యావశ్యకము లని ఉపన్యసించెను. పెద్దకారువారు పెడగనే యుండిరి. కాని జట్టులోనివారెల్లరును అన్ని విషయములను అంగీకరించిరి.

ఆ యూరికి రైలుస్టేషను కలదు. తపాలా కచేరిలేకపోవుట తప్పు కాదా? దానికి వెంటనే అహోబలుని చేవ్రాలతోడను అయిదాఱు వందల నిశానీలతోడను కూడుకొనిన అర్జీలు తామరతంపరగా నడచెను. తనిఖీలమీఁద తనిఖీలు జరిగిన పిమ్మట 'ఎక్స్‌పెరిమెంటల్ టపాకచేరి' శాంక్షన్ చేయఁబడెను.

వెంటనే అహోబలుఁడు పెట్టెఁడు కేటలాగులు సంపాదించెను. కొన్నిఁటిని కొనియెను. దినమునకు రెండు రూపాయల కార్డులుకొని దుకాణాదారులతో వ్యవహారము సాగించెను. క్రొత్తక్రొత్త వార్తాపత్రికలకు చందాదారాయెను. అతనికి కొన్ని వీ.పీ.పీ.లు, బుక్ పోస్టులు దిగఁదొడఁగెను.

ఎక్స్‌పెరిమెంటల్ టపా పెట్టఁబడిన నాఁటినుండియు ఆ జట్టువారికేకాక గ్రామములో ప్రతివానికిఁగూడ అహోబలుఁడనిన అమ్మా యనిపించెను. దానితో నహోబలుఁ డుత్సాహముఁబడిసి రోడ్డుకు ప్రయత్నింపఁబూనుకొనియెను. రైలు ప్రక్కనుండి జనరల్‌రోడ్డు పోవుచునే యుండెను. ఇఁక గ్రామమునకు సంబంధము లేకుండుట ఒక యధిక్షేపము కాదా? కావున అహోబలుఁ డహోరాత్రములు దానికి తిరుగాడెను. అతనిరాకపోకలవలననే మునిముందుగా ఆ దారియంతయు రోడ్డయి పోయెను.

ప్రసెడెంటుకు వోట్లు ఇప్పించుటయు, రోడ్డుకగు వ్యయమున సగము భరించుటయు సంభవించుచో ఈ ప్రయత్నము నెఱవేఱు సూచనలు కానిపించెను. అహోబలుఁడు ఇందుల కంగీకరించెను. రోడ్డుపని ఆరంభమాయెను.

ఈ రోడ్డు పడుటవలన గ్రామస్థుల కహోబలుఁడొక పురాణపురుషుఁడాయెను. ఇదివఱ కెవరింతపని చేసిరి? భగీరథుఁడే గంగను తెచ్చెను; అహోబలుఁడే రోడ్డు తెచ్చెను.

దీని తలదన్నిన దింకొకటి - సహకార సంఘము! ఈ సంఘము కుబేరుని నిధి; అహోబలుఁడు బలిచక్రవర్తి!

గ్రామస్థులలో ప్రతివాఁడును ఏఁబది మొదలుకొని ఏనూటి వఱకును ఉచితముగా తీసికొనిపోయినటులు తీసికొనిపోయిరి. ఆఱునెలలు తిరుగకమునుపే అందఱకును సహకార సంఘమనిన పులిని జూచినంత పూర్ణాను రాగమేర్పడెను. తమ తమ - ఆస్తులతో పాటు తమ తమ బందుగుల ఆస్తియు తమతమకొఱకు తాకట్టు. ఒకళ్లొకళ్ల జుట్టులకు ముడి. ఈ ధనము తమ కొసఁగిన దొకానొక యదృష్టదేవత. దానికి గవర్నమెంటు గార్డియన్!

ఇటుమీఁద నింకొక వింత - వ్యవసాయ పరిశోధన - క్షేత్రము! దీనికిఁగాను అహోబలడు పదియెకరముల క్షేత్ర మిచ్చెను. దీనిలో నాలుగెకరములు చెట్లు వేసి

క్రొత్తరకముల యెరువులతో పోషించి వాని పెరుగుతఱగులను క్రిమికీటకములను జాడ్యారోగ్యములను పరీక్షించుటకును, ఇంకొక నాలుగెకరముల ఖండములో పల్లపుసాగును విదేశ దోహదముతో పెంచి పరీక్షించుటకును, మిగిలిన రెండెకరములను బీడుగా నుంచి అందు ఆఁబోతులను అచ్చుపోసి తిరుపతి వేంకటేశ్వరుల పేర విసర్జించుటకును ఏర్పాటు చేయఁబడెను.

ఈ యేర్పాటెల్లరకును అక్కజము గొలిపెను. ఇరుగుపొరుగు ఊళ్లవారికి ఆ క్షేత్రము క్షేత్రమే యాయెను. ఆ దారిని బోవునపుడు రైలుతలుపొకటియు మూయఁబడియుండలేదు. 'బసవశాల' అని వ్రాయఁబడిన బోర్డుమీఁది అక్షరములు అందఱను ఆకర్షించుచుండెను.

ఇంకొక తమాషా - చిత్రశాల. అతఁడు కొన్ని చిత్తరువులను సంపాదించెను. అవి యన్నియు 'మేము అనుకృతములముకాము' అని వాచారుచున్నటు లుండెను. అహోబలుఁడు చిత్రించిన పురుషచిత్రములు కొన్ని కలవు. అవి స్వతంత్రములు. వానిలో కొన్నిఁట ఆంధ్రోపాధ్యాయుడును, కొన్నిట పూర్ణ చంద్రరావును మఱికొందఱు సహాధ్యాయులును గోచరించుచుందురు. స్త్రీ చిత్రము లన్నిఁటటికిని వసుమతి యధిదేవత.

స్త్రీలకును పురుషులకును ఆ చిత్రశాల దేవాలయములేని కొఱఁతను దీర్చెను.

ఇంకొకటి భజన మందిరము! దీనికి గ్రామమునందలి రైతు లందఱును సంకల్ప శుద్ధిగా రాయి త్రోలిరి; సున్నము తెచ్చిరి; ఇసుక గొనివచ్చిరి; గానుగాడిరి. సున్నపు వెలయు, కట్టుకూలియు అహోబలునిది.

ఈ భజన మందిరమున జానపదులు తనను బరివేష్టింపఁగా మృదుమధురమగు కంఠముతో అహోబలుఁడు రామదాసు కీర్తనలను, తూము నరసింహదాసు కీర్తనలను, తరంగములను పాడి వారిచేత పాడించును.

ఆ జట్టులో నొకఁడు మద్దెల నేర్చుకొనెను. వాని జూచి మఱియొకఁడు నేర్చుకొనెను. అందఱును నేర్చికొనిరి. క్రమనియమములను పాటించి వారు సాధించిన దీ మద్దెలదరువులో ముక్తాయింపులు మూఁడు!

భజనమందిరమునం దహోబలుఁడింకొక్కనాఁడు రామకార్యము సాధించిన వీరాంజనేయుఁ డగును. వెంటనే వసుమతి గుఱుతు దగులును.

అతఁడు వెంటనే అశ్రువులు రాల్చుచు శబరి యగును.

'ఒరేయ్! మన ఓబళంగారికే దేముఁడు కనఁబడతాఁడురా' అని బడిలోని బాలుఁ డొకఁడు మఱియొకని చెవిలోఁ జెప్పును. 'ఒరేయ్! ఆయనకు కనఁబడుతుంటే నేను చూసానురా, అప్పుడే - ఆయన కళ్లంబటే - నీళ్లు కారతయ్' అని యతఁ డనును.

ఇటులు ఆఱువింతలతో ఆ గ్రామము అచ్ఛన్నమాయెను. ప్రతిమాటలో అహోబలుఁడు! ప్రతిచేంతలో అహోబలుఁడు!

అహోబలునకు రుచింపని దొక్క పుస్తక భాండాగారవ్యాపారము. మింజుమలె అతఁడొక పౌరాణికుని రావించెను. నాలుగుపుట్ల వడ్లు ఏర్పాటు చేసి ప్రతిరోజును రాత్రి పురాణము చెప్పుటకు నియమించెను. అహోలునకపు డాంధ్రోపాధ్యాయుఁడు గుఱుతు వచ్చెను. 'అతఁడిపుడిది చూచి పోవుచోనా?' అని యనుకొనియెను.

గ్రామమునందు జన్మపట్టికకంటె మరణపట్టిక యెక్కుడగుటచే ఆసుపత్రి లేకపోవుటొక లోపమని యహోబలునకు కొలఁది నాళ్లలోనే తెలిసివచ్చెను. మందులు చేయుటకును, ఇచ్చుటకును శివలమల్లయ్యను నియోగించెను. దీని కేటేటను కళ్లమునకు కావడిధాన్యము చొప్పున చందాలు వేయించెను.

ఈ ప్రయత్న బీజములన్నియు ఫలింపక ముందే కుక్కమూతి పిందెలు పడఁదొడఁగెను.

తపాలాకచేరీ ఒక యేఁడాదిపాటు తిన్నగా నడచెను. ఆ యేఁడు పంతులుగారే పోస్టుమాస్టరు. బాలురే జవానులు. ఈరీతి కార్యాంతరప్రసక్తివలన గురుశిష్యులకు విద్యయెడ విసుకు తగ్గెను. రెండవయేఁడు టపాకు హవిస్సులేదు. వచ్చునుత్తరము లేదు, పోవునుత్తరము లేదు. నట్పేటు లంతకన్న లేవు. మనియార్డరులు మంగళము. రిజిస్టరులు రిత్త. వచ్చునవి వార్తాపత్రికలు. అవియు నొకటియో రెండో! కాన తపాలా యెత్తివేయుటకు ఆలోచన లారంభమాయెను.

రోడ్డు పడ్డతరువాత గ్రామమున నాలుగయిదు ఒంటియెద్దుబండ్లు వెలసెను. సివారులు పోవుటకు వానికి కిరాయి దొరుకుచుండెను.

ఇంతలో కొలఁదినాళ్ళలో లోనే జనరల్‌రోడ్డు మీఁద సేనాప్రదర్శన మొకటిజరిగెను. ఆ యెడ ఆ రోడ్డుమీఁదినుండి గ్రామపరిసరములకు పిరంగిబండ్లును,సేనలును వచ్చెను. గ్రామమునందలి ఆలకును, జేలకును కొంత చేటు కలిగెను. చిన్నచిన్న కంతలనుండి బిక్కుబిక్కుమని చూచిన ఆఁడువారికి ఆందోళనము కలిగెను. సైనికులు కొన్ని గంటలే మకాము చేసిరిగాని రోడ్డు ధర్మమా యని ఆ యూరివారికి నేఁటివఱకు నాఁటిముచ్చటలతో గుండియ లవియుచుండును.

రోడ్డు వలన దొంగలదాడి యొకటి కలుగఁదొడఁగెనని ప్రవీణులు నిశ్చయించిరి. ఏది యెటులున్నను ఏనేండ్ల పదపట నది పక్కా రోడ్డయి పోయెను.

సహకార – సంఘములో పుచ్చికొనినవారే గాని ఇచ్చిన పాపమునఁ బోయిన వారెవరును లేరు. ఆఱునెలలు, ఏడాది, రెండు, మూఁడేండ్లు దాఁటెను. సంఘమునకు వసూలు వట్టిదాయెను.

సారవంతము లయిన చేలు లోఁగడనే తాకట్టులలో నిఱికికొనియెను. మిగిలిన పొలములను కొనువా రెవరును లేరు.

మెంబరులలో కొందఱకు ఆస్తిలేదు. వారి జామీనుదారులకునులేదు. లేకున్నను వారిమాటయే ప్రమాణముగాఁ దీసికొని అహోబలుఁడు అప్పు పెట్టెను. వారెన్నఁడును ఈయ మని అనరు. కాని యెన్నాళ్ల కును వచ్చు దారిలేదు. పలుకుమాత్రము శిలాక్షరముగా నిలిచియుండెను.

ఈయప్పు తీర్చుటకుఁ గొందఱు క్రొత్త ఋణములుఁ దెచ్చిరి. కాని అవి సంసారము క్రిందఁబడెను.

దీని విముక్తికిఁగాను దీర్ఘ–వాయిదాలు ఏర్పాటు చేయఁబడెను.

వ్యవసాయ–పరిశోధన–క్షేత్ర మొకొక్క యేఁడెక్కినకొలఁది వహ్వా యనిపించెను. ఎన్నఁడును ఎఱుఁగని పంట! ఎకరమునకు నాలుగయిదుపుట్లు!

మామిడియంట్లు సపోటాలు వెర్రికాపు. ఒక్కొక్క మావిపండు సేర్లకొది బరువు. సపోటా ముప్పదియయిదు తులముల తూకము. వీని యెరువులకు వ్యయపఱచినది పదిరెట్లు!

ఆఁబోతులు నందులు! జాతియగుగోజాతి యుత్పన్నమాయెను. దానితో సంఘమునకు కొన్ని యప్పులు తీరునని యహోబలుఁ డనుకొనెను.

చిత్రశాలను చిన్నలును బెద్దలును రెండునెలలు చిత్రముగా జూచిపోయిరి. పిదప దాని గుమ్మమున గడ్డి మొలిచెను. కాని దానఁ గుమ్మరులకు లాభము కలిగెను. అందలి చిత్తరువులఁజూచి కుమ్మరులు బంకమట్టితో అట్టి బొమ్మలను జేసి ఆవమునఁ గాల్చి తెచ్చి అహోబలునకుఁ జూపిరి. అవి నీగ్రోలవలెనుండెను. అహోబలుఁడు రంగులు తెచ్చి రంజిత మొనరించుట వారికినేర్పెను. దానితో వారికి జీవిక యేర్పడెను.

కొందఱు ఒకొక్కనాఁడు వచ్చినను రాకున్నను, మద్దెల వాచుటకు 'మేముమే' మని తగవులాడి పృష్ఠములనే మద్దెళ్లుగను దవడల మీఁద చేతులనే తాళములుగఁ జేసినను, స్వరములు ఖఱస్వరము లయినను, పియానో స్వరము లయినను భజనమందిరము వలన భ్రంశమేమియు కలుగలేదు.

భారతమున యుద్ధపర్యాంతమువఱకును పురాణము నిండోలగము. శాంతి పర్వమారంభమాయెను. వినువారందఱును వెంట చిఱిచాఁపలను దెచ్చికొనఁ దొడఁగిరి. అహోబలుఁడెంత కట్టుదిట్టమగు శ్రోతయయినను పౌరాణికుఁడు మిగుల వాచంయముఁ డయిపోయెను.

ఆసుపత్రిలో ఆసవము లంత మొందెను. అరిష్టములు ఆఖరాయెను. ఆనందభైరవి అపరూపము. పైత్యాంతకమునకు పస్తు. లేహ్యములు లేవు. చేఁదుమందులు చెక్కు చెదరలేదు.

గ్రామస్థులు మొదటియేఁడు వద్దిచ్చిరి. రెండవయేఁడు బకాయి పెట్టిరి. మూఁడవ యేఁడు మూల్గిరి. నాలుగవయేఁడు నాస్తి చెప్పిరి. ఆసుపత్రి బరువంతయును అహోబలుని మీఁదనే విఱుచుకొనిపడెను.

## 15

వీరవెంకమ్మ పెత్తనమునకుఁ బోయెను. గృహమెల్ల రహస్యములు చెప్పుటకు చెవులు కొఱుకుచున్నటులుండెను.

అహోబలుఁడు కిటికీదేఖీలు మూసివయిచెను. కలమును కాకితమును బట్టుకొని కూరుచుండెను.

'మా రెండు పొట్టలకును లేక మఱియొక పొట్టకును ఈ యున్న యాస్తి చాలదా? మూఁడుపుట్ల వడ్లు మాకుఁ జాలు - పొట్టకుపుట్టెఁడు. ఇఁక నాకు పొగవులతో పని లేదుగదా' అని అనుకొనెను.

కొంచెమునే వూరకుండి 'పైపొట్టలకు పైఖర్చు?' అనుకొనెను. అతఁ డాలోచించుచు నాలోచించుచు మెలమెల్లగా నిటులు పద్దులు వ్రాయఁదొడఁగెను.-

**శ్రీరామ**

| | | | |
|---|---|---|---|
| నేయి | నెలకు | 3 వీ | 9-0-0 |
| నూనె | నెలకు | 1 వీ | 1-0-0 |
| కందులు | నెలకు | 3 మా | 1-0-0 |
| పెసలు | నెలకు | 1 మా | 1-0-0 |
| మినుములు | నెలకు | 1 మా | 1-8-0 |
| ఉప్పు | నెలకు | 1 మా | 0-4-0 |
| మిర్చి | నెలకు | 1 వీ | 0-8-0 |
| చింతపండు | నెలకు | 2 వీ | 0-8-0 |

| | | | |
|---|---|---|---|
| ఆవ, జీర, మెంతి | నెలకు | | 1-0-0 |
| నిప్పుపెట్టెలు | నెలకు | | 0-2-0 |
| తలంటు సామగ్రి | నెలకు | | 1-0-0 |
| దీపసామగ్రి | నెలకు | | 1-0-0 |
| విస్తళ్లు | నెలకు | 2 కట్టలు | 0-10-0 |
| చాకలి | నెలకు | | 1-0-0 |
| మంగలి | నెలకు | | 0-8-0 |
| దాసి | నెలకు | | 4-0-0 |
| చిల్లరమల్లరలు | నెలకు | | 1-0-0 |
| | | | **25-0-0** |

'వెరసి పాతికరూపాయలు. పండ్రెండు పాతికలు = మున్నూఱు. సంవత్సరమునకు మూఁడుపుట్ల వడ్లును మున్నూఱు రూకలును ఉన్నచో కొల్ల. ఇపుడు నాలుగుపుట్ల ధాన్యమునకు ధోకాలేదు. శిస్తులు మున్నూటికి పదియో యిరువదియో యెక్కుడే వచ్చును. కొల్లోకొల్ల' అని యనుకొని కొంచెముసేపాలోచించెను.

'వసుమతి భరణమునకు దావావేయుచో ఎటులు?' అను ప్రశ్న అతని మతికి గాఢముగాఁ దాఁకెను. తలక్రిందఁ జేయిదుకొని పడుకొని ఆకాశమువంక నొక పావుగంట సేపదేపనిగా చూడఁదొడఁగెను.

'వసుమతి యీపాడుపనిచేయఁజాలదు' అని దృఢముగాఁ బలుకుచు లేచి కూరుచుండెను.

కొంచెముసేపతఁడు కనుల బిగియఁబట్టి చూపు నిలిపి కూరుచుండి 'చదివికొనిన యాఁడుది భరణముకొఱకు దావావేయకుండఁ గూరుచుండఁజాలదు' అని యనుకొని మరల వెలకిలఁ బండుకొనియెను. కొంచెము సేపు కుడి ప్రక్కమీఁదను, కొంచెము సే పెడమ ప్రక్క మీఁదను ఆనుకొని పిదప మోచేతిని తలాఁపిగాఁ జేసికొని ఆకసముదెసఁ జూచుచు బండుకొనెను.

తమయూర టపాకచేరీ తఱలిపోవుటచే తపాజవాను పొరుగూరినుండి యిపుడు రావలయును. మూఁడునెలల కొకఁడు మాఱుచుండుటచే ఎల్లపుడును క్రొత్తరోగమే. ఇపుడొక క్రొత్తవాఁడువచ్చి 'అహోబలుఁడుగా రెచట, అహోబలుఁడుగా రెచట?' అని అఱచుచు అహోబలుని యాలోచనలను అట్టిట్టొనరించెను. బిడాయించిన తలుపులను దెఱచి అహోబలుఁడు హడావడిగా అరుఁగలమీఁదికి వచ్చెను. టపావాఁడొక కవరును,

కొన్ని వార్తాపత్రికలను ఇచ్చి వెళ్లిపోయెను. అహోబలుఁడు వానిని దీసికొని తలుపులు మూసికొని యథాస్థానమునఁ గూరుచుండి మునిముందర కవరు విప్పెను. వసుమతి చీటి.

తలక్రిందుగా చేతికి అందిన ఆ చీటిని తలక్రిందుగాఁ ద్రిప్పెను. అది క్రిందఁ బడెను. అతఁడు చేకొనెను. అడ్డముగా వచ్చెను. తొట్రుపాటును, తొందరను అడఁచికొని చీటిని విదిలించి తుదకు తలబట్టకొని గబగబ చదివి కొనెను.

'ఇంటర్మీడియేటుతో ఇల్లు వగైరాలు చెల్లెను. నా నగ కట్టుతోడను, అమ్మనగ కట్టుతోడను, ట్యూషనులతోడను మెడికల్ కాలేజిలో మూఁడుపాళ్లు ముగించితిని. సంతత కృషిచే కొంచెము జబ్బుపడితిని. ఈయేఁడూ మీ సాయముతక్క వేఱుపాయము లేదు.'

అహోబలుఁడు రెండు మూఁడుసారులు చదివి ఉత్తరమును మడఁచి 'దావాకు ఇదియే నాంది' అని యనుకొనెను. 'రిజిస్టరు నోటీసు వచ్చినపిదపనే దీనిసంగతి యాలోచింతము' అనియనుకొని దానిని ఇనుపపెట్టెలోఁ బెట్టి బీగము వయిచెను.

వీరవెంకమ్మ కొలఁదిరోజులలోనే కొడుకు కవళికను గమనించెను. మెలమెల్లగా పునర్వివాహ ప్రస్తావమునకు గణేశపూజ చేసెను. అందుల కెన్నఁడును అభిముఖుఁడుకాని అహోబలుఁడు ఇపుడిపుడు తలవాల్చి వినీవిననటులు వినఁదొడఁగెను.

అచట వసుమతికి నేఁటివఱకును విశేష చింతకలుగలేదు. తన కొక కూఁతురున్న దనియు సోమమ్మ యనుకొనలేదు.

వసుమతి ఇంటర్మీడియేటు చదివి మెడికల్ కాలేజీలో ముప్పాతికపాలు దాఁటు వఱకును ఈగతిగనే నడచెను. ఇప్పటికి ఉన్నదంతయు సర్వమంగళమయి తల్లిబిడ్డలు మిగిలిరి.

గంజాముజిల్లాలో హెల్త్ ఆఫీసరుగా పని చేయుచున్న వాసుదేవరావు నడుమ నడుమ రాధను బంపి సోమమ్మ వసుమతుల యోగక్షేమము లరయుచుండెను. రాధవచ్చి యీతూరి ఇటులు చెప్పెను: 'వసుమతి మెడబోసిపోయెను. ముక్కుదూలమున కిరుతట్టుల గాసులైట్లవలె నున్న బేసరి అర్ధచంద్రులు రెండును ఆఱిపోయి ముక్కుతూములే మిగిలెను. చేతులకు గాజుల అఱవళ్లు మాత్రము శేషించెను. వసుమతి యిపుడు పుట్టినపిల్లవలె నున్నది. శిష్టుల యింటిలోవలె కుండలో వంటకము. నన్నుఁజూచి కూరలు ఇంటిని తొంగిచూచినటులున్నవి.'

అక్కఱ కలిగినపుడు తన సాయమును తప్పక వసుమతి కోరు నని వాసుదేవరావు తలఁచి యుండెనుగాని అట్టి యాచూకి యావంతయు నగపడకపోవుటచే వసుమతి యెంత యభిమానధనయో యిపు డతనికిఁ దెలిసి వచ్చెను. వెంటనే నూరురూపాయలు మనియార్డరు చేసెను.

'అమ్మా! నాకొఱకు వాసు నూఱురూపాయలు మనియార్డరు చేసినాఁడు' అని వసుమతి యొకనాఁడు తల్లికిఁ జెప్పెను. సోమమ్మకనులలో ఆనందబాష్పము లుదయించెను. కొంచెమాలోచించి యిటులనెను: 'కూఁతురు దర్జీ దగుచో తల్లియు అయినటులే. రేపటి నుండి నాకుఁగూడఁ గొన్ని దుస్తులు కుట్టుటకుఁ బట్టుకొనిరమ్ము. ఈ కొలఁది కాలమును గూడ ఇటులనే యీఁదుదము.'

వసుమతి తల యూఁపి మనియార్డరు తిరుగఁగొట్టుట దురుసుగా నుండునని పుచ్చికొని ఆ నూఱురూపాయలను భద్రపఱిచెను. నాఁడేకాదశి. ఆనాఁ డింట నూకలు లేవు. అంగడిలో అప్పు. తల్లికి నిట్రుసపాము. తల్లి దుఃఖమునే పాథేయముగాఁ గొని వసుమతి కాలేజికి ట్రామెక్కెను.

వసుమతి రూపమును సౌకుమార్యమును, స్వరసౌభాగ్యమును శ్రవ్యతను, గనిపట్టుచున్న సినీమా డైరెక్టరొకఁడానాఁ డాసమయమున మోటారులోఁ బోవుచు వసుమతిని జూచెను. అతఁడు ట్రామును వెంబడించి వసుమతి మెడికల్ కాలేజీకి వెళ్లుట కనుఁగొనియెను. అతఁడు ప్రిన్సిపాలుతో మాటాడి వేఱొక పనిమీఁద వెళ్లిపోయెను.

వసుమతి సాయంకాల మింటికి వచ్చుసరికి నవుక రొకఁ డొక యుత్తరము తెచ్చి యిచ్చెను. సినీమాకు వేషధారణ మొనరించునెడల ఇపుడు నెలకు మున్నూఱు రూకలు ఈయఁబడుననియు, ముందుముందు పదియేనువందలవఱకు వృద్ధిచేయఁ బడు ననియు దాని సారాంశము.

పావుసేరునూకలకు కరువుగా నున్నపుడు మూఁడువందల జీతము! దీనితో వసుమతి కొంచెమాందోళనముచెందెను. కొంతవడికి 'ఎటులు చచ్చెను? అనునది అంతగా ఆలోచనీయము కాదుగాని – ఎటలు బ్రతికెను? అనునది ఆలోచనీయము' అని యనుకొనియెను. పిదప ఈ సమాచారము తల్లికిఁ జెప్పకుండఁగనే యిటుల ప్రత్యుత్తరించెను. 'తమకు ధన్యవాదములు. మీరింకొకరికొఱకు ప్రయత్నించుకొనవచ్చును.

నవుకరు నిర్గమించెను. చూపు ఆనిన వఱకును వానిని జూచి నిట్టూర్చెను. పిదప బదులుకొఱకు బయలుదేఱెను.

బెదురుచు బెదురుచు ముందు కోమటి దుకాణముకడకు వెళ్లెను. అప్పుతీర్పనిదే అరువు పుట్టదని యతఁడు నిష్కర్షగాఁ దెలిపెను.

గత వత్సరము తానొక జమీందారు సోదరికి ట్యూషను చెప్పియుండెను. వసుమతి యిపుడా గౌరవమును తాకట్టు పెట్టఁదలఁచెను. సూటిగా అతనియింటికేఁగెను.

జమీందారు పిన్నవాఁడు. చదువు సందెలెత్తిఁగినవాఁడు. 'ఎట్టికెట్' తెలిసిన వాఁడు. అతఁడు మరియాదగా వసుమతి నాహ్వానించెను. వసుమతి తన స్థితిగతులన్నియుఁ దెలుపు కొని యిరువదిరూకలు అప్పుకోరెను. అతఁడు చిఱునగవుతో 'జవాను చేతి కిచ్చి మీవెనువెనుకనే పంపఁగలను' అనియెను. వసుమతి సెలవుగొనెను.

ఆమె యింటికేఁగి కూరుచున్న మఱి నిమిషముననే జవాను ఒక కవరొసఁగి వెళ్లి పోయెను. వసుమతియు వెంటనే లేచి బియ్యము కొనుట కంగడికి పోయి కవరు విప్పెను నూఱురూపాయల నోటు!

వసుమతి శరీరము కంపించెను. ఆమె కొంచెమాలోచించి తుదకు మార్చి అప్పుతీర్చి కావలసిన సంబారమును కొని యింటికి మరలెను. నాలుగునాళ్లు నడచినపిదప వాసుదేవరావు పంపిన నూఱురూపాయలు తీసికొని జమీందారుకడకు వెళ్లెను. ఆమెను జూచుచునే అతఁడిటులనెను: 'మొన్న తక్కువగా నుండుటచే కొలఁదిగాఁ బంపితిని. నేఁడు –'

'అయ్యా! అక్కఱలేదు. తమకు చెల్లించుటకే వచ్చితిని. యీయుపకారము స్మరించుకొందును' అని వసుమతి నూఱురూపాయలును ఎదుటనిడెను.

అతఁడు చాల నసంతుష్టుఁ డాయెను. అయినను తుదకతనికి పుచ్చుకొనక తప్పలేదు.

ఆ మఱుసటిరోజు కాలేజీకి సెలవు. వసుమతి ఆనాఁడు ఆ వీధిలో మరియాదగల కుటుంబముల నన్నిఁటిని గాలించి ఒక బట్టల మోపింటికిఁ దీసికొని వచ్చుచుండెను. సహాధ్యాయ లిలీయను నామె యామె కెదురుపడి యిటులనియెను. –

'చాకితయా?'

'కాదు. దర్జీ.

రాత్రులందు కుట్టుపని పెట్టుకొనుటచే వసుమతి కిపుడలంకారము లేకున్నను కనులకు అలంకారములు పెట్టుకొనవలసివచ్చెను. మైక్రోస్కోపుతో ఆమె చేయవలసిన పరిశోధనములు కొన్ని దాన మానవలసివచ్చెను. దర్జీపని దర్జాగా నున్నను కనులను

బలిగోరుటచే కొన్నాళ్లకే దానిని విడనాడెను. అటుపిమ్మట శ్రోత్రియులగు అఱవవారియిండ్ల మడిబట్ట లాఱవేయు పనిని సంపాదించెను. కొన్నాళ్లు అది లాభించెనుగాని వసుమతి తెలుఁగుదని తెలియుటచేత ఆమె వారి మడికిఁ గాకపోయెను. ఇంతియకాక యామె కన్య. కన్య మడియా? దానితో ఆమె కాపనియూడెను.

ఆనాఁడామె అతిగ్లానితో కాలేజీకి వెళ్లెను. మైక్రాస్కోపుతో పరిశోధనచేయు చుండఁగా శోషచే పడిపోయెను. ఆమెతో పాటు పరిశోధనలో నున్న మేరీయను ఆంగ్లోఇండియన్ స్త్రీ యొకతెయు మతీ యిరువురును చక్కఁగా ఉపచరించిరి. వడిగానే వసుమతి కోలుకొనెను. కొంచెముసేపయినపిదప మేరీ యిటులనెను : – 'ఇంగ్లీషువారి అంగడులలో పని సంపాదించుట మేలు. సాయంకాల మయిదు గంటలనుండి రేయి తొమ్మిది గంటలదాఁక చల్లని పని. మంచిడ్రెస్సు మంచి టాయ్‌లెట్టు దొరుకును. టర్కిష్‌బాత్ ఉచితము. జీత మేఁబదికిఁ దగ్గదు. నే నిపుడు నూటపదిలో నుండి చదువుకొనుచున్నాను.'

ఇంకొకతె యిటులనెను: 'అంగళ్లలో పని దొరకవచ్చును, దొరకకయుఁ బోవచ్చును. హోటళ్లలో అప్లికేషన్ తరవాయి. స్నానభోజనములు ఉచితము. వలయుచో శయ్యగూడ దొరకించుకొనవచ్చును. నాచెల్లెలొకతె తొంబదిలోనుండి చదువుచున్నది.

'కాదుకాదు. వసుమతి నైటింగేల్, ముఖము సూదంటురాయి. ఈమె పాటకును, ఆటకును పుట్టి మాయమందులలో పడిపోయినది ఆపెరాకు ప్రయత్నించుచో లక్షలు మూటకట్టవచ్చును' అని వేఱొకతె యనెను.

వసుమతి వినివిని యిటులనెను – 'వాసుదేవరావును మీ రందఱెఱుఁగుదురు గదా!'

'బరంపురములో నిపుడు హెల్త్ ఆఫీసరా?'

'ఆఁ. అతఁడు మాయన్న.'

'అగుచో మూటలు మోయనేల? ఉపవాసములేల?' అని లీలయనెను.

'నాఁటి కతఁడింకను కాలు నిలుఁద్రొక్కుకొనలేదు. ఇటుముందతనిసాయము లభింపఁగలదు' అని వసుమతి అనెను.

అందఱ మొగములందును సంశయము ప్రతిఫలింపఁగా ఆనాఁటి సంభాషణ మంతమొందెను. ఈ సంభాషణమునకు ఫలముగా పదిరోజులలో వాసుదేవరావు చెన్నపట్టణము చేరెను. వసుమతి కాలేజినుండి ఇంటికివచ్చి ఇక్కట్టునఁబడెను. ఇల్లంతయు తన రహస్యమును బయటఁబెట్టుచుండెను. అతనికిఁ బెట్టఁదగిన ఆహారపదార్థ మిల్లె. ఇంట నున్నది, పరబ్రహ్మము – ఏనుఁగులు తిను బియ్యమును, త్రిమూర్తులును – ఉప్పు, చింతపండు, మిర్చి.

వసుమతి మార్కెటుకుఁ బోవ సిద్ధపడుచుండఁగా కనిపట్టి వాసుదేవరా వామె నాఁపి, 'బాబయ్యగారి హయామునుండియు మార్కెటుపని నాది' అని తాను వెళ్లెను. ఆఱునెలలకు సరిపడు సామగ్రిని బండిమీఁద తోలించుకొని వచ్చెను.

'రేపు సంతర్పణ మేమేని తలపెట్టితివా?' అని సోమమ్మ యనెను.

'మా అమ్మ కాఁడుపుట్టువు లేని లోటు వసుమతితోఁదీఱెను. మీకు మగపుట్టువులేని లోటు నాతోఁ దీఱదా? పిన్నమ్మ గారూ!' అని వాసుదేవరావనెను. సోమమ్మ కనులలోని వాత్సల్యధారయే ప్రత్యుత్తరమాయెను.

'పద్దు ఎంతయినది?' అని వసుమతి యడిగెను.

---

**15వ అధ్యాయంలో పద్దుల గురించి**

ఆ పద్దులు - 1932 - ఓబయ్య రచన/ ప్రచురణ కాలం నాటిది. బ్రిటిష్ పాలన ఉన్న భారతదేశంలో నాటి ద్రవ్యమానం రూపాయలు, అణాలు, పైసలు (లేక) దమ్మిడీలు - లో ఉండేవి.

| | |
|---|---|
| 12 పైసలు / దమ్మిడీలు | ఒక అణా |
| 2 అణాలు | ఒక బేడ |
| 4 అణాలు/ 2 బేడలు | ఒక పావులా |
| 8 అణాలు / 2 పావులాలు | ఒక అర్థరూపాయి |
| 16 అణాలు/ 2 అర్థరూపాయలు | ఒక రూపాయి |

1956 నుండి - దశాంశమానాలు (మెట్రిక్ పద్ధతి) ప్రవేశపెట్టబడినాక - ద్రవ్యమానం రూపాయలు - పైసలకు మారింది.

| | | |
|---|---|---|
| | 100 పైసలు | ఒక రూపాయి. |
| కొత్తలో - | 6 పైసలు | ఒక అణా |
| | 12 పైసలు | ఒక బేడా |
| | 25 పైసలు | ఒక పావులా |
| | 50 పైసలు | అర్థరూపాయి - గా మారకం జరిగేది. |

తరువాతి కాలంలో రూపాయలు అణాలు - దమ్మిడీలు పూర్తిగా రద్దు చేయబడి - వాడకం లోంచి మాయమయ్యాయి. అలాగే

బరువులు, ద్రవపదార్థాల కొలతలు కూడా - పాత పద్ధతుల నుండి దశాంశ పద్ధతిలోకి మారిపోయాయి.

పాత పద్ధతి రద్దయేవరకు - మార్పిడి - ఈ క్రింది విధంగా ఉండేది.

| | | |
|---|---|---|
| వీశ | - | 1400గ్రా |
| మానిక | - | దాదాపు 2 లీటర్లు |

నేటి చదువరుల సౌకర్యం కొరకు ఈ వివరణ ఇవ్వడం జరిగింది.

'శత్రువు నడిగినటులడుగుచున్నావే?' అని వాసుదేవరావనెను.

'కాదు వాసూ! నేఁటినుండి ఆఱునెలల వఱకు నాకొక నోమున్నది. దాని ఫలమును రాధకు త్యాగము చేసితిని' అని వసుమతి యనెను.

వాసుదేవరావు నిర్ఘాంతపోయి నిలువఁబడెను.

## 16

ఆశ్రమము తయారాయెనుగాని అహోబలుఁడు దానిచే చిక్కులపాలాయెను. తలుపులను తీసినచో మఱి పడవు. ఎటులెటులో మూసినచో మఱి రావు. గచ్చు మీఁద కూరుచున్నచో మరిలేచుట కష్టము. లేచినచో మరి కూరుచుండుట కష్టము.

అది యాశ్రమముగనుక అందు పిట్టలును, పాములును విరోధములేక నివసించెను. వానిని హింసిపక బాలురు బయటనివసించుచుండిరి.

ఇది యిటు లుండఁగా పండుగు ప్రలయములు కలిసివచ్చినటులు గ్రామము లోనికి స్కూళ్ల యిన్‌స్పెక్టరు వచ్చెను. పంతులుగారికానాఁ డహోబలుని యింట వారము. ఇన్‌స్పెక్టరు గారికిఁగూడ నచటనే వారము.

వీరవెంకమ్మ మెల్లగా వాకిటిలోనికిఁజని జవానును బిలిచి ఇన్‌స్పెక్టరుగారిపేరు, ఊరు, హోల్ మకాము, జీతము, సంతానము, ఈమొదలగు విషయము లన్నియుఁ గనుఁగొనెను. మెల్లగా కాఫీకి నీళ్లుపెట్టి రెండింధ్ల పెత్తనము చేసి లోనికి వచ్చి ఇన్‌స్పెక్టరును జూచి 'నాయనా! సదాశివా! నీవెవరో యనుకొంటిని, మా పుట్టింటివారు విస్సావఝులవారే నాయనా! నీ కెందఱు కూఁతుండ్రు? కొడుకులెందఱు భార్యను పిల్లలనుగూడఁ దీసికొనిరాక ఒంటిరిగా వచ్చితివి?' అనెను.

ఇన్‌స్పెక్టరు మితరీతిగా ప్రత్యుత్తరము చెప్పెను. వీరవెంకమ్మ లోని కేఁగి కాఫీతెచ్చి యిచ్చి 'నాయనా! నాకుమారుఁడు స్కూల్ ఫేలో యేదో, ఆఱువక్లాసు కాఁబోలు, ప్యాసయి కూరుచున్నాఁడు. గాంధిగారిమాట విని బడిమాని అదిగో ఆ దొడ్లో ఆశ్రమము కట్టినాఁడు. అక్కడ ఒక బడిట! దానినిఁ గూడఁ జూచిపో. అది తప్పో ఒప్పో నాకు తెలియదు నాయనా!' అనెను.

'ఇపుడే చూచి వచ్చెద' నని అతఁడు కాఫీ త్రావెను. మిగిలినది చాటుగా జవాను త్రావెను. దానిలో మిగిలినది పంతులు త్రాగి ఇన్‌స్పెక్టరు ముందులకు వచ్చెను.

'ఈ క్రొత్తబడిలో నెందఱు పిల్లలున్నారు?'

'గ్రామములో పనిలేని పిల్ల లందఱును ఇచటనే యున్నారు.'

'గ్రాంటుకొఱకు మనకు దరఖాస్తు పెట్టుకొనలేదేమి?'

'ఇది స్వదేశీబడికాదు; విదేశీబడియుఁ గాదు. ఇదొకరకము.'

'అనఁగా?'

'ఈబడిలో పుస్తకములు లేవు. పుస్తక విద్యలో నహోబలుఁడుగారికి నమ్మిక తక్కువ. ఇచట భజన చేయుదురు. వీరికి భక్తియెక్కువ. ఇచట బొమ్మలు గీయుదురు. కళల మీఁద మక్కువ.'

'ఇతనికి గ్రాంటు అక్కఱలేదా?'

'అక్కఱ యుండకపోవచ్చును.'

ఈసంభాషణ మయిన పిదప ఇన్‌స్పెక్టరు గడియారము చూచి దుస్తులు ధరించెను. కనులకు జోడు పెట్టుకొనెను. ప్రేపబెత్తము చేతఁబుచ్చికొనెను. చెప్పులు తొడుగుకొనెను. జవాను ముందు ముందు నడచెను. ఇన్‌స్పెక్టరు వెనుక నడచెను.

'దారి యెక్కడికి తీయుమ'ని సెలవు?'

'ఆశ్రమములోనికి.'

పంతులు వీరవెంకమ్మను జూచి 'ఇన్‌స్పెక్టరుగారు మీ పుట్టింటి పేరివారని నీకెటులు తెలిసె నమ్మా?' అని యడిగెను.

'జవాను చెప్పెను నాయనా!'

'ఇన్‌స్పెక్టరుగారికి గారెలు చాల ఇష్టమని జవాను చెప్పినాఁడు విన్నారా?'

'అటులనా? బొబ్బట్లు చేయఁదలంచితిని. గారెలు గూడఁ జేయుదును.'

'మంచిది. మీయింట వడియములు అప్పడములు పెట్టినారా?'

'వెనుకటి వారమునాఁడు నీకు తినిన గుఱుతు లేదా?'

'అమ్మగారూ! నేను బడిలోనికి వెళ్లి మరల వచ్చెదను.

'మంచిదినాయనా!'

జవాను మునిముం దేఁగి ఆశ్రమము లోపల నీరు ఎత్తిపోయుచున్న అహోబలుని గవాక్షమునుండి చూచి 'ఏమయ్యా! ఇన్‌స్పెక్టరుగారు దయచేసినారు' అనెను.

తనపనిలోఁ దాను మునిఁగి తేలుచు అహోబలుఁడు 'మంచిది' అనెను.

ఈ 'మంచిది' జవానుకు చెడ్డదాయెను. ఇన్‌స్పెక్ట రంతవాఁడు స్వయముగా చూచుటకు రాఁగా బడిపంతులు 'మంచిది' అని గూడవేసికొనుటయా? చేతులు కట్టుకొని యెదురుగా వచ్చి నిలుఁబడి గజగజలాడుచు నీళ్లు నములుచు చేతులు నులుముకొనవలసిన విధి కాదా? అర్ఘ్యపాద్యము లీయనక్కఱలేదా? అహోబలుని ఔదాసీన్యము తనంతవానికిఁ గూడ పరువుకాదు. తా నెవఁడు? 'ఇన్‌స్పెక్టరుగారి' జవాను!

ఆ జవాను తనబిళ్లను ఎదురొమ్ముమీఁద తిన్నగా సవరించుకొనుచు 'నీకు గ్రాంటు వలదటయ్యా?' అనెను.

ఈ ప్రశ్నకును ప్రత్యుత్తరము బడయక అతఁడు వెనుదిరిగిపోయి 'అయ్యా! ఇది స్వదేశీబడి' అనెను.

ఇన్‌స్పెక్టరు మాటాడక చుట్టునున్న ఆవరణమును జూచుటకు బయలుదేఱెను. కట్టవ లోని ఛాయావృక్షములు ధీరులవలె తలలెత్తుకొని నిలువఁబడియుండెను. జీడిమావిళ్లు జవానులవలె వంగి వంగి సలాములు చేయుచుండెను. కలేచెట్లు ఈఁటెల వారివలెఁ దవ్వులకుఁ గొట్టెను. పెడలపూలు ముకుద్రాళ్లు వోసి దాపులకు లాఁగుకొనియెను.

ఇన్‌స్పెక్టరు ముదముఁగొని ఆశ్రమద్వారముకడకు వచ్చెను. తలుపింకను తెఱవఁబడి యుండలేదు. గౌరవలోపము లేకుండటకు జవానుకొంచె మధికారమును ప్రయోగింపఁ జూచెనుగాని దొరకనన్నచే ఔదాసీన్యమును అలవఱించుకొనఁ దొడఁగెను.

ఇన్‌స్పెక్టరు ఆ కట్టడమును క్రిందనుండి మీఁది కొకతూరి చూచి నివ్వెరపడెను. దావీదు రోజీనా లెక్కచూచికొని పట్టుకొనిపోయి యెన్నినాళ్లో కాలేదు. చూపఱను భయపెట్టుటకుఁ బోలె ఆ గోడలు మీఁదిమీఁదికి దుముకుచున్నటులుండెను. గవాక్షములును, తలుపులును మూయఁబడియున్నను ఆశ్రమ గర్భములోనికి పిట్టలు రెక్కలు జాడించుకొనుచుఁ బరువెత్తుచుండెను. వాస్తుపురుషునకు కన్నులగు గూండ్లలో నొకటి చిబుకము మీఁదను మఱియొకటి పెడతలమీఁదను అమరియుండెను. సింహద్వారము ఈ క్రింది పాటను అభినయించుచుండెను – 'ఓ చెలియా! ఓమగువా! నే తాళలేనే!'

ఇట్టి కట్టడపుఁ దలుపు దట్టఁబోయి ఇన్‌స్పెక్టరు వాతరోగివలె కాలిని వెనుకకుఁ బీఁకుకొనియెను.

'తేలు కుట్టినదా అండీ?'

'లేదు.'

'పక్షవాతము–'

'ఆ, కాదు.'

జవాను తెల్లఁబోయెను. ఇన్‌స్పెక్టరు కొంచెము నడచి దక్షిణపుగోడ గవాక్షముకడ నిలువఁబడెను. అది మూయఁబడియుండెను. లోపలినుండి పెద్దధ్వని వినఁబడుచుండెను. అతఁడు వంగి గూటిక్రిందఁ జూచెను. ఏదో కలుగు! దాని యుపయోగమును శంకించు

కొని అతఁడు పరీక్షించుచుండెను. అంతలో గూడతో నీరు తోడు చప్పుడు వినఁబడియెను.

ఇన్స్పెక్టరు జవానును బిలిచి 'దీనిలోపల నూయి యున్నదా?' అని యడిగెను.

'లేదుగాని ఒకచోట చీలమండలలోఁతు నీరును మఱియొకచోట మోఁకాలిబంటి నీరును గలదు. వేసఁగిలో చల్లగానుండుటకు చిన్న చెలు వేమేని కట్టించిరేమో యనుకొంటిని.'

ఇంతలో ఒక గూడెఁడునీరు ఆ కలుగు చివరకు వచ్చి అతిథి ముఖము నవమాన పఱచుట యెందుల కనియో కట్టిన పనివాని నేర్పరితనమును పాడొనరించుట యెందులకనియో మరల లోనికే పోయెను.

మరల ఛటాత్కారము. ఊరెగిరి పోవునంత చప్పుడేకాని బయటికి వచ్చెడి నీరాకదోసెఁడు.

ఇన్స్పెక్టరు కిది యెంతయు నగమ్యముగా నుండెను. అతఁడు ద్వారముకడ కరిగి 'అయ్యా! తలుపు తెఱువుఁడు' అని యాచించెను.

ఒక పిలుపునకు బదులు లేదు. పిలుపు మీఁద పిలుపుగా నాలుగయిదు పిలుపులకు 'ఆ' యను ప్రత్యుత్తరము వినఁబడెను.

'తలుపు?'

అహోబలుఁడు తలుపుల కానుకొని ప్రయత్నించి ప్రయత్నించి గడియతీసి మెలమెల్లగా నటునివలెను, కవాతు చేయువాని వలెను తప్పుకొనఁ దొడఁగెను. వెనుకకు బరుగెత్తు వెఱ్ఱి వానివలె రెక్కలు గబాలున విడఁదొడఁగెను. అహోబలుఁ డాంజనేయునివలె వెనుకకు దుమికి, జాతి వెనుకగోడ కానుకొనెను.

అహోబలుని ప్రయాణపు మంచమును ఇన్స్పెక్టరుగారి కొఱకుఁ బఱిచి నీటి చెంబులను దానిక్రిందఁ బెట్టి జవానుకు పొగాకు సంపాదించి రొఁజుకొనుచు వచ్చి పంతులుగారు ఇన్స్పెక్టరుగారి ప్రక్క చేతులు జోడించుకొని లా అండ్ ఆర్డరులను పరిపాలించుచు నిలువఁబడిరి.

ఇన్స్పెక్టరును జూచి అహోబలుఁడు లోనికి ఆహ్వానించెను. అతఁడు భయ సంభ్రమములతో లోని కడుగిడెను. అతని వెనువెనుకనే జవాను. జవాను వెనువెనుకనే పంతులు.

ఇన్స్పెక్టరు అహోబలుని చూచి యిటులనెను 'తెఱచుటకు ఒకయేనుఁగు బలమును ఉపయోగింపవలయుచో నిఁక మూయుట కెంత బల ముపయోగింప వలయునో!'

అహోబలుఁడు నవ్వి 'లోపలికి దయచేయుఁడు' అనెను.

తాను ఇన్‌స్పెక్టరుకడ వేచియున్నటులు తెలుపుటకు ఇంతవఱకును పంతులుగారికి సందు దొరుక లేదు. ఇపుడు దొరుకఁగా నిటులనెను. 'పనివాఁడు ఈ తలుపులను బిగించిన నాఁడు గడియబెట్టుటకు ఊరెఁడుమంది పోగయిరి. ఈ తలుపున కొకగడియు, ఆ తలుపున కొకగడయు పోటీపెట్టి పదుగురు పదుగురు తలుపులు త్రోసి నొక్కిపట్టుకొనిరి. ఒక తలుపు ద్వారబంధమున కొకబెత్తెఁ డెడముగను మఱియొకటి జానెఁ డెడముగను బోయెను. త్రోయఁగాఁద్రోయఁగా నొకపెద్ద చప్పుడు మొదలాయెను. గ్రామమునందలి కుక్కలే కావు, పందులే కావు జంతుజాల మంతయు పోగాయెను. తీవ్రవేదనతో, గూంఁడ్రింపులతో, కొండకేకలతో తుదకు తలుపులు పడెను. ఇఁక గడియ బెట్టుట కొకఁడు భయపడుచు భయపడుచు బోయి ప్రక్కగడల లెస్సగా పరికించి వెనుక ముందాడి గడలవారిని హెచ్చరించి దిగ్గన వేయఁ దొడఁగెను. అది పడుట కియ్యకొనక గోంఁడ్రుపెట్టెను. గడలవారు గోంఁడ్రునకు భయపడి పట్టువదలిరి. గడియవయిచు వాఁ డిపుడు ఆసుపత్రిలో కోలుకొనుచున్నాఁడు లెండు!' అనెను.

ఇన్‌స్పెక్టరు అహోబలుని జూచి 'నేను నిర్భయముగా లోనికి రావచ్చునా?' అనెను.

జవాను వెంటనే యిటులనెను. 'అయ్యా, ఇది సిమెంటు చప్టాకాదు. నాచు చప్టా. దీనిలో గుంటలు చెలమలు చెఱువులుగూడ నున్నవి! అదిగోఁ బయికిఁ జూడుఁడ' దని నివ్వెరపడెను.

ఇన్‌స్పెక్టరు క్రిందుమీఁదులు చూచి ముందరికాలు వెనుకకుఁ బెట్టి వెనుదిరిగి గబగబ వాకిటిలోనికి వచ్చి యొక నిట్టూరుపు విడిచెను. జవానును పంతులును భయపడి ఇన్‌స్పెక్టరు కడకుఁ బాఱిరి.

పంతు లిటులనెను 'ఈ యూరిలో యమబ్రహ్మలు –

'యమబ్రహ్మ లేమిటండీ? మయబ్రహ్మలుకాదా?' అని జవాననెను.

'ఆ, ఇరువురు! ఒకఁడు దావీదు, రెండు, సుబ్బన్న. పూర్వము ధర్మరాజునకు మయుఁడే కట్టెను. ఇపుడహోబలుఁడుగారికి దావీదు సుబ్బన్నలే కట్టిరి.'

'గ్రామములోని వారిపట్ల ఆ మాత్రమభిమానము వలదటండీ?' అని యనుచు అహోబలుఁడు వెలికివచ్చి దాపున నున్న చెట్టుక్రింద కూరుచుండుటకుఁ జాఁప పఱిచెను.

ఇన్‌స్పెక్టరు వెఱ్ఱిచూపులతో పదిగజములు వెనుకకుఁ బాఱి 'దీని నెందులకుఁ గట్టించితిరి?' అని యడిగెను.

'ఇది యొక పాఠశాల!'

'బాలురనుమాత్రము దీనికి పదిగజముల యెడమునఁ గూరుచుండఁ బెట్టుఁడు. యముఁడొక్కొక్క మాటొక్కొక ప్రాణమే కొనును; ఇది యొక్కమాటే పలువుర ప్రాణములఁ గొనును'.

'పడిగనే మరమ్మతు చేయింతును.'

'మరమ్మతా? పడఁగొట్టి మరలఁ గట్టించుటయే దీనికి మరమ్మతు. మఱియు దీనిని బడగొట్టింప నక్కఱలేదు. నేఁడో రేపో తనంతటఁదానే పడిపోవును' అని యిన్స్పెక్టరు పలుకుచుఁ బలుకుచు అహోబలుని చేయి పట్టుకొని పదిగజముల దవ్వులాఁగుకొనిపోవు లోపల ఆయాశ్రమపు తూర్పుగోడ పెళపెళమని భూశయన మొనరించెను.

## 17

ఇన్స్పెక్టరు భుజించి నిదిరించెను. సాయంకాల మయిదుగంట లయిన తరువాత బడిని బరీక్షింప బయలు దేఱెను.

కొందఱు బాలురు వాగులలోను, పసుల పాకలలోను దాఁగిరి. కొందఱు అటకల మీఁది బోనపు పెట్టెలలో దాఁచిన లాగుచొక్కాలు ధరించిరి. కొందఱు అహోబలుని యిల్లు తొంగి తొంగిచూచుచు అటు, ఇటు, నడయాడఁ దొడఁగిరి.

బడి నేఁడు నిండిన యేటివలె నుండెను. నేఁడు రమారమి నలుఁబది యేండ్ల యీడుగలవారు మొదలుకొని నాలుగేండ్ల యీడుగల వారి వఱకును గల విద్యార్థులచే బడికిటకిట లాడిపోవుచుండెను.

నలుఁబదేండ్లవారి ముచ్చట కొంచెము ఇచట చెప్పఁదగియున్నది. వారసలు కూరఁగాయలు అమ్ముకొనువారు. వారు ఇపుడు 'డట్' ప్రత్యయమువలె సంఖ్యాపూరకులు, వారీనాఁడే యీ బడిలోనికి వచ్చిరి. ఈనాఁడే పండితులవలె బడిని విడనాడఁగలరు. ఈనాఁడుమాత్ర మిచట ముడ్డి మోపుటకు ఎనిమిదణాలు కూలినేర్పాటు చేసికొని బడిలోనికి వచ్చిరి.

ఇన్స్పెక్టరుగారు తమ సనాయ నిశానీలతో వచ్చి కుర్చీలోఁ గూరుచుండిరి. వారు ముక్కాఁకలు తీరినవారు. వారు లోఁగడ కఠిన పరీక్షలు చేసిచేసి విసివిరి. ఇపుడు స్థాలీపులాకముగా పరీక్షలు చేసిపోవుచుందురు. వారు కనులకు జోడుపెట్టుకొని బాలురవంక నొకసారి ముఖము త్రిప్పిరి. బాలురందఱును మెఱుమును చూచినటు లయినదిగాని వృద్ధ బాలురమాత్రము ఇన్స్పెక్టరుగారికి తమ కౌతుకమునే స్వాగత మొనరించిరి.

'పంతులూ! హాజరుపట్టీయేదీ?' అని ఇన్‌స్పెక్టరడిగెను.

'పంతులు హాజరుపట్టీని చేతులతోఁ బట్టుకొని నిలువఁబడెను.

ఇన్‌స్పెక్టరు తీసికొని తెఱచి 'పుల్లయ్యా' అని బిగ్గరగా అనెను.

ఈ పుల్లయ్య వృద్ధబాలుఁడు. అతఁడు తడఁబడెను. పంతులు అతనిని కఱకుగా చూచెను. పుల్లయ్య పెదవులు కొఱికికొని 'పంతులు చెప్పిన మాట మఱచాను' అని గొణుగుకొని తుదకు ('పెంట-పెంట-సార్') అనెను.

వెంటనే పంతులు 'ప్రెజెంట్ సార్' అనెను. వృద్ధబాలు రందఱును నవ్వి 'ప్రెజెంట్ ప్రెజెంట్' అని అనిరి. పిదప ఇన్‌స్పెక్టరు 'రామయ్యా' అనెను.

ఈ వృద్ధబాలురలో రామయ్య యనువాఁడొకఁడును లేఁడు. రమణయ్య యనువాఁడు కలఁడు. అసలు రామయ్య ఊరికి పోయెను. 'రేఫమువలన గుఱుతు' దవులు నని తలఁచి 'రామయ్యా' అని పిలువఁగనే ప్రెజెంట్‌సార్' అని చెప్పుమని పంతులు రమణయ్యకుఁ జెప్పెను. కాని రమణయ్య ఇన్‌స్పెకటరుభూతము ముందది యంతయు మఱచెను.

వృద్ధబాలు రొకరిమొగ మొకరు చూచుకొని 'మాలో రామయ్య యెవరూ లేరండీ' అనిరి. పంతులు రమణయ్యనుచూచెను.

'వాటీజిట్?' అని ఇన్‌స్పెక్టరనెను.

అపుడు రమణయ్య 'ఆపుసెంట్ సార్' అనెను.

'ఆపుసెంటుకాదు; 'ప్రెజెంట్ సార్' అని పంతు లనెను.

రమణయ్య 'ప్రెజెంట్ సార్' అనెను.

తరువాత ఇన్‌స్పెక్టరు కనులజోడు సర్దుకొని అతిగంభీరముగా పంతులుగారి మోము తిలకించి 'వేంకటేశ్వర్రావ్' అనెను.

ఎవరును మాటలాడకముందే పంతులు 'ప్రజెంట్‌సార్' అనెను.

పిదప ఇన్‌స్పెక్టరు హాజరు పట్టీలోని పేళ్లన్నియు చదువుచుండఁగా పంతులు 'ప్రెజెంట్‌సార్' అని చెప్పఁ దొడఁగెను. తుదకు ఆ పరీక్ష ఆఖరాయెను. ఇన్‌స్పెక్టరు కొంచెము సేపటటు చూచి 'పంతులూ! ఈయేడు పంచాంగము చూచితివా?' అనెను.

'చిత్తము.'

'వృశ్చికవృద్ధియెంత?'

'పదమూఁడు.'

'తన్నాశము?'

'ఒకటి.'

'మంచిది' అని ఆ యిన్‌స్పెక్టరు బాలురకు మార్కులు వైచి ఆ కాకిత మచటఁ బెట్టి వాకిటిలోనికి వెళ్లెను. పంతులు ఆ కాకితమును జూచుచుండఁగా నతనిముఖ మంతయు కలకల లాడుచువచ్చెను.

వెంకయ్య యను బాలుఁడొకఁడు లేచి 'మేష్టార్! నేను ప్యాసయినానా?' అని యడిగెను.

'ఆ ప్యాస్.'

'నేను?' అని వెంకటరామయ్య అడిగెను.

'ప్యాస్.'

'నేను నేను నేను' అని బాలురందఱడి గిరి. 'ప్యాస్ ప్యాస్ ప్యాస్' అని పంతులు ప్రత్యుత్తరించెను. అడుగనివారు వృద్ధబాలురు. కాని 'మేమింక వెళ్లవచ్చునా?' అని వారడిగిరి.

'ఉండుఁ డుండుఁడు' అని పంతులు వేలితో సైగచేసెను. ఇన్‌స్పెక్టరు వడివడిగా లోనికిఁ బరువెత్తుకొని వచ్చి 'ఊరు తగులఁబడిపోవుచున్నది, ఊరు తగులఁబడి పోవుచున్నది; ఇక్కడ పెద్దపెద్ద పిల్లలున్నారు, వెంటనే చల్లార్పుఁడు, పరుగెత్తుఁడు, పొండు' అని యఱచి చెప్పుచుండఁగా ఆ బడి యంతయు శూన్యమయిపోయెను.

ధూమవాలము ఊరంతయుఁ జుట్టుకొనియెను. రత్నగర్భ పగిలి వెలికిఁ గ్రక్కు రత్నములవలె స్ఫులింగములు దోఁచెను. స్ఫోటశబ్దముతో లేచిన పన్నగరాజు పడగలవలె మంటలు లేచెను. ధూమశిఖావచూడమగు నా మహోజ్వాల భూమ్యాకాశములకు నిచ్చెన కట్టెను.

పశువులు తోఁకమట్ట లెత్తుకొని యిండ్ల చుట్టు తిరుగాడఁ దొడఁగెను. పిల్లలు తల్లుల కాళ్లకు సంకెల లయిరి. ఇండ్లన్నియు కొల్లగొట్టఁబడినటులు వాకిండ్లు సామానులతో నిండెను.

మంట లార్పుకొనుట మాని యెవరికి దొరకిన సామాను వారెత్తుకొని పోఁజొచ్చిరి. గ్రామము నంతయు అగ్ని అరాచక మొనరించెను. బ్రాహ్మణు లగ్నిసూక్తములు పఠించి ఆజ్యము నాహుతి చేయఁగడగిరి. అగ్నిదేవుఁడు వారిభక్తి కానందించి వారిహస్తము లను స్పృశించి యాలింగనము చేసికొన రాఁదొడఁగెను.

పలువురు తెల్లఁబోయి చూచుచుండిరి అఱుపుటకుఁగాని, తడుపుటకుఁగాని యొకఁ డును ప్రయత్నింపఁ దలఁచుకొనలేదు.

అపు డహోబలుని బడిలోని బాలురందఱు చేతులతో కుండలు తీసికొని బయలు దేఱిరి. చెరువుకడనుండి యిండ్లవఱకును ఇరువదేసి గజముల కొక్కనివంతున నిలువఁ బడిరి. కుండతరువాత కుండ, కుండ తరువాత కుండగా నీరు వచ్చిపడుచుండెను.

ఇన్‌స్పెక్టరు ఆ పిన్నవారి నియతిని జూచి యాశ్చర్యపడెను. బజారులో బేజారుపడి చూచుచుఁ జూచుచు నిలువఁబడియున్న పెద్దవారు వారిని జూచి 'ఓరీ! మీకు ప్రాణములు మీఁద ఆశ తీఱినదఁటరా?' అని విముఖులను గావింపఁ దొడంగిరి. ఇన్‌స్పెక్టరునకు కసిపుట్టెను. 'అమ్మ పెట్టను పెట్టదు; అడుగుకొని తిననయినను తిననీయదు' అను నటులు మీరు చేయకపోవఁగా చేయువారిని గూడ చీలఁదీయుదురేమయ్యా? ఈపిన్న వారిని జూచిన మీకు సిగ్గగుట లేదయ్యా? చాలుఁజాలు, మీరు గూడ కడవలఁ గొనిరండు' అని ఇన్‌స్పెక్టరు ఆ పెద్దవారిని హెచ్చరించెను. 'అగ్నిదేవుని ఆగ్రహము చల్లాఱవలయునుగాని మనచేతులతో ఆర్పవచ్చునండీ? ఆర్పఁగలమటండీ?' అని ఆ పెద్దలు ఇన్‌స్పెక్టరుకు సుద్దులు చెప్పిరి.

'భక్తి శాస్త్రమునుండి వచ్చిన యీవాసన సోమరుల నందఱను పట్టుకొనియున్నది. ఇది యెటనుండి పుట్టెనో ఎచటనెచట వ్యాప్తమాయెనో ఎచట నెలకొనెనో యేరికెఱుక? ఛీఛీ! ఈ గ్రామ మిఁక దగ్ధమగుఁగాక!' అని ఆ యిన్‌స్పెక్టరు ఒక కడవఁ గైకొని యహోబలుని బడిలోఁ జేరెను.

అహోబలుఁ డొకయింటిమీఁదినుండి మఱియొకయింటిమీఁదికి దుముకుచు కడవ లెత్తి నీరు దిమ్మరించుచుండెను.

బడిలోని వృద్ధబాలురు కావళ్లు బుజములమీఁద నిడికొని ఊడనిఁ బాడుచుండిరి. ఇన్‌స్పెక్టరు వారిని జూచి "రామయ్యా! కడవ బట్టుకొనక కావడి బట్టుకొని పాఱిపోవుచుంటివా? రా! రమ్ము!" అనెను.

'నేను రామయ్యనుగాను, రమణయ్యను'

'రమణయ్య వయినను రావచ్చును.'

'ఇఁక నాకు బడితో పనిలేదండీ!'

వీరిటులు సంభాషించుచుండఁగా మిగిలిన వారు దారిలో నున్న వస్తువులను కావడించి కొనిపోయిరి. రమణయ్యయు మాయమాయెను.

అగ్నిహోత్రుని యార్భాటము నవలోకించుచు పలువురు కాపులు తిరుగాడుచుండిరి. ఇన్‌స్పెక్టరు సైపఁజాలక 'ఏమయ్యా! చెఱువా దూరముకాదు. నీరా శూన్యము కాదు. మీరా అశక్తులు కారు. ఆ పిన్నవారలఁ జూడుఁడు! వారేమి చేయుచున్నారో మీరా పని చేయఁజాలరా?' అనిప్రార్థించెను.

'నరకకుండమువలె తగులఁబడుచున్నది. రండురా నాయనలారా బయటికి' అనఁగా వీరు రాకున్నారు. పైఁగా మమ్ముఁగూడ అందులోఁ బడి చావ మందురటండీ మీ రెంత ఇన్‌స్పెక్టరు గారయినను?' అని వారందఱను దొంగతనమునకు సందు గొందులలోఁ జొరఁబడిరి.

'ముదుసలి చచ్చె, ముదసలి చచ్చె' అని ఆర్తనాదములు వినఁబడెను.

ఆ ముదుసలి నేలలో డబ్బు పాఁతిపెట్టుకొనెను. ఎవరయినను ఎత్తుకొని పోదురని అతఁడు దానిమీఁదఁ గూరుచుండెను. ఇల్లు కూలెను.

'దేవుఁడు తగులఁబడుచున్నాఁడు, దేవుఁడు తగులఁబడుచున్నాఁ'డని మఱియొక గంభీరనాదము ఉప్పతిల్లెను.

అందఱును 'దేవుఁడు దేవుఁడు' అని యఱచి దేవాలయముకేసి పరుగిడఁదొడఁగిరి.

అహోబలుఁడిటు లఱచెను - దేవుఁడు అదాహ్యుఁడు, మునిముందు ఈ నరదేవుని బయటికిఁ దీయుఁడు.

ఈ యఱపులతో అందఱును ఆఁగిరి. అహోబలుఁ డింటిమీఁదినుండి దుమికి కూలిన యింటిలోఁ జొఱఁబడెను. అతనివెంట అతని బడిలోని వారు కొందఱు చొరఁ బాఱిరి.

పొగ నలువంకల నలముకొనెను. మెల్లగా అగ్ని పరివేష్టించెను. భూదేవి రక్తము క్రక్కుకొనుచున్నదా యనునటులు పెద్దమంట లేచెను.

'అహోబలుఁ డగ్ని కుండమునఁ బడె'నని ఘోషపుట్టెను. దాపుననే మఱియొక ఘోష యిటులు వినఁబడెను. - 'దేవుని దీయఁబోయి వీరవెంకమ్మగారు దేవళములో వుండిపోయెను.'

ఆశ్రమవాసులలో కొందఱు ఇంటిలోపలను మఱి కొందఱు దేవాలయగర్భమునను బ్రవేశించిరి. కొంతసేపటికి ముదుసలితో నహోబలుఁడును, దేవవిగ్రహముతో వీరవెంకమ్మయు వెలికి వచ్చిరి. వారియొడలు కొంచెము కాలెను. ఉత్సాహపూరితులగు ఆ పిన్న వారందఱును అంతటితో నాఁగక వరుణదూతల వలె నీరు కుమ్మరింపఁదొడఁ గిరి. రమారమి ఒకగంటలో మంటలు చల్లాఱఁదొడఁగెను. ఇన్‌స్పెక్టరు ఆశ్చర్యముగా వారి నందఱను దిలకించెను.

ఊరిబయటికి లేచిపోయిన స్త్రీలును, శిశువులును మరలి రాఁగడఁగిరి పాఱిపోయిన భీరువులును, సోమరులును, పెద్దకాఁపులును దిరిగి వచ్చిరి. అచటనచట నక్కియున్న పాలేళ్లు వాకిండ్లముందు కానిపించిరి. గృహస్వాములు లేని యిండ్లలోని

వెండిబంగారులు పాలేళ్ల పాలాయెను. కాలుచున్న ధాన్యరాసులను కొందఱు ఆర్పఁ దొడఁగిరి.

చీఁకటిపడెను. ఆఱుచున్న మంటలు అగ్నిదేవుని అసంతుష్టములగు ముఖములవలెఁ గాననాయెను. కమిలిపోయిన భూదేవత యూరువులవలె పొగలు చూపట్టెను.

అలసిన వారందఱును శయ్యలపయి చేతులను గాళ్లను పాఱవయిచి నిదిరించిరి.

అహోబలుఁడును, ఆశ్రమవాసులును పోయినది పోఁగా మిగిలిన దిక్కులేనివారి ఆస్తిని కాపాడుటకు ఆ రాత్రియెల్ల వంతులువేసికొని గస్తు తిరిగిరి.

మఱునాఁటి ప్రొద్దున ఇన్‌స్పెక్టరు ఆలోచించుచుఁ గూరుచుండెను. వెనుకటి నాఁటిప్రొద్దుటి అహోబలుఁడు వేఱుగను, వెనుక టినాఁటి ప్రొద్దుటి వీరవెంకమ్మ వేఱుగను మాపటి వీరవెంకమ్మ వేఱుగను అతనికిఁ దోఁచెను. ప్రొద్దుటి అహోబలుఁ డోబయ్య. మాపటి యహోబలుఁడహోబలుఁడు; ప్రొద్దుటి వీర వెంకమ్మ యెంకమ్మ. మాపటి వీరవెంకమ్మ వీరవెంకమ్మ. అహోబలుఁడు మనుష్యదేవతను బ్రతికించుకొని వచ్చెను. వీరవెంకమ్మ ఈశ్వరుని బ్రతికించుకొని వచ్చెను. ఈరెండు సాహసములను ఇపుడు మనోనేత్రమునఁ జూచుచున్న ఇన్‌స్పెక్టరు శరీరమునందలి రోమమును నిక్కపొడిచెను.

అతఁడు కలమును కాకితమునుచేతఁగొని వార్తాపత్రికలకు ఇటులువ్రాసెను.

"నేను శివాగ్రహారమున ఎలిమెంటరీ బడిని పరీక్షింపఁబోతిని. అచట అహోబలుఁడు గారిచే స్థాపింపఁబడిన ఆశ్రమమును జూచితిని. నేను చూచుచుండఁ గనే ఆశ్రమపుగోడ విఱిగి పడెను. ఆ సాయంకాలమున గ్రామము తగు లఁబడెను. అహోబలుఁడుగారును, వారిజనని వీరవెంకమ్మగారును, ఆశ్రమబాలకులును మంటలలో దుమికి చాలఁ బ్రాణములను కాపాడిరి. మంటలలో మునిఁగిన మనుష్యుని అహోబలుఁ డును, దేవవిగ్రహమును వారితల్లియు బయటికిఁ దెచ్చిరి. ఇంత సాహసము ఎన్నఁ డును నేను కని విని యుండలేదు.

ఇపుడీయాశ్రమమునకు ధనమత్యావశ్యకము చేతులున్నవారందఱును చందాలొసఁ గవలెను. ఇపుడు చేయుదానమే దానము - "దాతవ్య మితియద్దానం దీయతే ఽను పకారిణే-"

అని వ్రాసి అహోబలుని చిరునామాతో ముగించెను. సర్కారువారికి మఱియొక విన్నపమును తయారుచేసి అహోబలుని కొఱకు ప్రతీక్షించుచుఁ గూరుచుండెను.

స్నాన సంధ్యా ద్యనుష్ఠానము లొనరించిన పదఁపడి అహోబలుఁడు ఇన్‌స్పెక్టరు గారి కడకు వచ్చి ధన్యవాదము లొనరించెను. ఇన్‌స్పెక్టరు అహోబలుని వీఁపు తట్టి

తాను వ్రాసిన విన్నపముల నమూనాలను జూపెను. అహోబలుండు సంతసించి యిటులనెను: "త్యాగశీలు రెవరేని యిచటికివచ్చి పనిచేయుట ఆవశ్యకముగానున్నదిగాన అట్టి ప్రార్థనగూడ మొదటి విన్నపమునఁ జేర్పఁగోరుచున్నాను."

ఇన్‌స్పెక్టరిటులనెను - "ఈ చిన్నపల్లియకు ఎవరువచ్చి పనిచేయుదురు? అది అనావశ్యకము."

అహోబలుఁ డిటు లనెను - "కాదు; ఆ ప్రార్థనగూడఁజేర్పుఁడు."

"ఎవరు వత్తురని మీయూహ?" అని ఇన్‌స్పెక్టరు ఒత్తి పలికెను.

"దైవ మెవరిని ప్రేరించునో వారు వత్తురు"అని అహోబలుండనెను.

ఇన్‌స్పెక్టరు నవ్వుకొని అనిష్టముతో అహోబలునిమాట దానఁ జేర్చెను. పిదప నతఁడు అహోబలుని ప్రశంసించి వీరవెంకమ్మ కడ సెలవుగొని మఱొక బడిని బరీక్షించుటకు గ్రామాంతర మరిగెను.

## 18

ఈ విన్నపము ప్రకటింపఁబడిన నెలవఱకు అహోబలుండు నోరుకట్టుకొని యుండెను. పిదప నొకనాఁడు 'నాకు మనియార్డరు లేమయినను రాలేదా? యని తపాలాజవాను నడిగెను. 'రాలేదు' అని అతఁడు బదులాడెను.

మఱుతడవ తపాలావాఁడు రాఁగానే అహోబలుండు 'మనియార్డురు రాలేదా' అని యడిగెను. 'రాలేదండీ' అని వాఁడు ప్రత్యుత్తరించెను.

ఇట్టి ప్రశ్నోత్తరములు అహోబలునకును తపాలావానికిని విసువు విరామము లేక జరుగఁదొడఁగెను. కాని తుదకు ఉత్తరము చెప్పుటలో తపాలావానికి కష్టము కలుగఁ జొచ్చెను.

ఇది యిటులుండఁగా నొకనాఁడు తహసీలుదారు వచ్చెను. రెవిన్యూ ఇన్‌స్పెక్టరు వచ్చెను. ఊరివారందఱును అహోబలునికడకు వచ్చిరి. అహోబలుండు లోలోపల నానందించెను. అందఱును గలిసి చేతులుకట్టుకొని తహసీలుదారువారి దర్శనమున కరిగిరి.

అహోబలుండు తహసీలుదారునకు నమస్కరించెను. అతఁడు తల యూఁపెను. పిదప నహోబలుండు రెవిన్యూ ఇన్‌స్పెక్టరుకు నమస్కరించెను. అతఁడు ప్రతివందనం చేసెను. గ్రామస్థులందఱును తహసీలుదారుగారికిని రెవిన్యూ ఇన్‌స్పెక్టరుగారికిని దండప్రణామము లాచరించిరి.

తహసీలుదారుగారిటులడిగిరి - 'అహోబలుఁ డెవరు?'

'నేను.'

'మీగ్రామమున నష్టపు మొత్త మెంత?'

'సరి యయిన లెక్క తెలియలేదు.'

'అంత లెక్కలేనిపని యేల చేసితివయ్యా? పోనీ; సుమారు?'

'ఏఁబది రెండిండ్లు ధనధాన్యములతో దగ్ధమయిపోయిన. సుమారు నాలుగువందల మందికి అన్నము లేదు.'

'అన్నము లేకున్న సరకారువారు చేయునది సున్నవి. ఎవని యన్నము వాఁడు తినవలయును. కాలిపోయినవి పెంకుటిండ్లా, పూరిండ్లా?'

'పూరిండ్లు.'

'పూరిండ్లకు ఇంత హడావడియా? దీనికి అర్జీలు, విన్నపములు వగైరాలా? లోకమున ఎన్నెన్ని గ్రామములు తగులఁబడుటలేదు? సరికాని ఇఁక ఇట్టి పిచ్చిపిచ్చి అర్జీలు పెట్టకుఁడు బంజరులోని తాటాకు కొట్టుకొనుటకు ఆర్డరు వేసెదను. ఇండ్లు కప్పుకొనుఁడు.'

అహోబలుఁ డీమాటలకు తెల్లఁబోయెను. ఎటులెటులో ధైర్యము తెచ్చుకొని 'కలప లేనిదే ఆకు లెందులకు?' అనెను.

'కొండంత దేవరకు కొండంత పత్రి యెవరు పెట్టఁగలరు? కలప తెచ్చు కొనుఁడు; ఆకు లిచ్చెదము' అని తహసీలుదారుగారు మఱొక మకాముకు బయలుదేరిరి.

రెవిన్యూ ఇన్‌స్పెక్టరును, జవానులును పూరక కూరుచుండలేదు; చాటుగా చేయి జాఁపిరి. తహసీలుదారువారి సిబ్బంది యంతయు కొలఁదిసేపటిలోనే వెళ్లిపోయెను.

సరకారువారు చాల సాయముచేయఁగలరని అహోబలుఁ డనుకొనెను. కనీసము కలపయయినను ఈఁగల రనుకొనెను. కాని వారిచ్చునవి ఆకులు.

ఈ యఘాతముతో అహోబలుఁడు ఛాయనుండి సత్యపు ఎండను కొంచెము చూడఁగలిగెను. దరిద్రుల స్థితిని ఆలోచించుచు ఇంటికి మరలుచుండఁగా తపాలాజవాను ఎదురుగా వచ్చుచుండెను. అతఁ డహోబలుని జూచి నిలువఁబడియెనుగాని అహోబలుఁ డతని జూడను లేదు; ఏమియు నడుగనులేదు.

తపాలావాఁ డిటు లనెను - అయ్యా! రానియపుడు 'మనియార్డరువచ్చెనా? మనియార్డరు వచ్చెనా? యని యడిగితిరి. వచ్చినపుడు మాటాడరు."

అహోబలుఁడు తలయెత్తి 'మనియార్డరు వచ్చెనా?' అనియడిగెను.

'వచ్చెను.'

'ఎంత?'

'ఒక అణా'.

అహోబలుఁడు తెల్లఁబోయి చూచుచు నిలువఁబడిపోయెను. తపాలావాఁడు మనియార్డరు ఫారము చేతి కిచ్చెను.

సహాధ్యాయుఁడు వెంకటరావుచే అది పంపఁబడియెను. అహోబలుఁడు దానిని బాఁగ జూచుచు ఆలోచనోన్ముఖుఁడాయెను.

తపాలావాఁడు ఇటు లనెను - 'దీనికొఱకు ఎన్నోనాళ్లనుండి విచారించుచుండితి రే! చేవ్రాలు చేయరేమి?'

అహోబలునకీ మాటలు వినరాలేదు. నిర్నిమేషమయిన యతని చూపు తపాలా వానికి అక్కజము కలిగింపఁగా నతఁ డిటులనెను - 'వాపసు చేయనా?' అహోబలునికీ మాటయు వినఁబడలేదు. వాపసుచేయుటకును పుచ్చుకొనుటకును నడుమనే అతఁడుండెను.

కొంతవడికి 'దైవ ప్రేరితము తృణమయినను కణమయినను స్వీకరింపదగినదే' యని యతనకిఁదోఁచెను. వెంటనే యిటులనెను - 'కలము కలదా?'

'కలదు.'

అహోబలుఁడు కలముఁగొని వ్రాలొనరించి అణా తీసికొనియెను.

తపాలావాఁడు చేయి జాఁపి 'బహుమతి దయచేయరా?' అని నవ్వెను.

అహోబలుడు చేయి తడిమి రూపాయ తీసియిచ్చెను. తపాలావాఁడు తీసికొని నిర్విణ్ణత చెందెను.

పిదప పదిరోజులలో తపాలావాఁ డహోబలుని జూచి నమస్కరించి 'అయ్యా! మనియార్డరు' అనెను. అహోబలుఁడతనిని జూచి యూరకుండెను. తపాలావాఁడు మనియార్డరు ఫారము చేతి కిచ్చెను.

పూర్ణచంద్రరావు నూఱు రూక లంపెను. దానినిజూడఁగనే అహోబలుని కను లశ్రువులు కురిసెను.

తపాలావాఁడీతూరి యేమియు నడుగలేదు. అనంతర మొకనెలకు తపాలా వాఁడు వచ్చి అహోబలునితో 'అయ్యా! తమ కొక వేయిరూకలు ఇన్స్యూర్ వచ్చిన' దని చెప్పి పోయెను. అహోబలుఁడు వెంటనే సమీపగ్రామమున నున్న తపాలాకచేరికి నడచి పోయెను.

ఆ యిన్స్యూరు సీత యను దానికడనుండి వచ్చెను. అహోబలుఁడాపేరు చూచి యాఁగి పోయెను. పోస్టుమాస్ట రతనిని జూచి 'ఏమండీ! అటులు చూచుచున్నారు?' అనెను. 'నాకుఁగొంచెము వ్యవధి కావలయును. తీసికొనుటయో తిప్పి పంపుటయో కొంచె మాలోచించి కొనవలయును' అని యహోబలుఁడనెను. 'మంచిది. ఆలోచింపుఁడు' అని పోస్టుమాస్టరనెను.

అహోబలుఁడు వాకిటఁ గూరుచుండి యాలోచించెను. ఆలోచించి యాలోచించి సీత వసుమతియని తలపోసెను. 'అగుచో వెంకటరావు – అణాకును, పూర్ణచంద్రరావు నూటికిని, వసుమతి వేయికిని సంఖ్యామాత్రభేదముకాని యీవిలో నేమియు తేడాలే'దని యనుకొని కొంచె మాలోచించెను. 'మొదటి దానము నన్ను ఉపహసించెను. రెండవది నన్ను అభినందించెను. మూఁడవది నాతప్పు నాకుఁదెలిపెను' అని యనుకొనెను. పిదప మెల్లగాలేచి గవాక్షముకడ కరిగి 'అయ్యా! పుచ్చుకొందును' అనెను.

పోస్టుమాస్టరు వ్రాలు చేయించికొనెను. అహోబలుఁడు సీళ్లు పరీక్షించి విప్పి చూచుకొని హసన్ముఖముతో గృహోన్ముఖుఁడాయెను.

నాఁటి సాయంకాల మహోబలుఁడొక చిన్నసభ చేసెను. వచ్చిన రూపాయలు చూపెను. కలపకొఱకు అందఱకును సమముగా పంచిపెట్టెను. గ్రామము తగులఁబడుచుండఁగా భయపడి పాఱిపోయినవారును, సోమరులై చూచుచునిలువఁబడినవారును, దొరకినసొమ్ము దోఁచుకొని పోయినవారును మిగిలినవారును ఆధనమును సమముగా ననుభవించిరి.

దీనితో నహోబలునకు పైబరువు కొంత తగ్గెను. పిదప మూణ్ణాళ్లు యోజించి ఒకచీటి వెంకటరావుకును, మఱియొకటి పూర్ణచంద్రరావునకును ఇంకొకటి సీతకును ఈరీతిగా తయారుచేసెను :

"వెంకటరావుగారి సన్నిధిని, నమస్కారములు.

తమ యుపహాసమువలననే నాకీమాత్రపు తెలివితేటలు కలిగెను. మీ దానమును మనఃపూర్వకముగా గ్రహించితిని. ఎల్లపుడును ఇట్టి యుపహాసముతోడనే నన్ను విమర్శింతురని ఆసింతును.

పూర్ణచంద్రరావుగారి సన్నిధిని, నమస్కారములు.

మీ దానమును చేతులొగ్గి గ్రహించితిని. పలువురు దరిద్రనారాయణులను మీరారాధించితిరి. కాని నాకు ఇసుమంతయేని పరిహాసభిక్ష నిడరయితిరి.

సీతగారి సన్నిధికి.

పలువురు దరిద్రుల చేతులతో మీదానమును గ్రహించితిని. మీ దానమును మా యాశ్రమమున శిలాక్షరము చేయుటకు అనుమతింపఁగోరుచున్నాను. ఇంత గొప్ప యీవి యిచ్చిన మీ సలహాలను మెలఁకువతో ననుసరింతును. ఇంకను మీ సాయ మపేక్షితము".

ఈ మూఁడును తయారయిన పిదప టపాలోఁ బడుట కాలస్యము కాలేదు. వెంకట రావు కడనుండియు, పూర్ణచంద్రరావు కడనుండియు ప్రత్యుత్తరము రాలేదు కాని సీతకడ నుండి వెంటనే యీ ప్రత్యుత్తరము వచ్చెను.:

"అయ్యా!

పాదాభివందనములు. నాపేరునకు 'గారు' తగిలింపవలదని మనవి. నేనొకరి దాసిని. మా యేలికసాని తమకు ధనము పంపవలసిన దని యానపెట్టఁగా నే నంపితిని. తమ చీటికి ప్రత్యుత్తరమీదిగువ :

మీ సహస్రబాహువులకును స్వాగతము. నా దానమును శిలాక్షర మొనరింప నే నొల్ల.

తమరు ఇంకను నా సాయ మపేక్షించితిరి. ఇంకొక వేయిరూకలు పంపుచున్నాను."

అహోబలుఁ డీచీటిని, వేయిరూకలను అందుకొనెను. రూకలు దాఁచెను. వెంటనే యిటులు ప్రత్యుత్తరించెను :

"తమ రూకలు నిలువచేసితిని. త్యాగపూర్వకమగు సేవయు, ధనమును మాకు అత్యావశ్యకములు. విశేషించి ధనము. తాము ఈ రెంటికిని సమర్థలని గంపెఁడాసతో నున్నాను."

దీనికి వెంటనే యిటులు జాబు వచ్చెను: "మీ కోరికలో మొదటిదానిని నేను కొలఁదియో గొప్పయో నెఱవేర్పఁగలను. మీ గ్రామములోని నిఱుపేదలకు పరులొసఁగు ధనమే అత్యావశ్యక మని నమ్మునెడల మీరింకను మాయలోనే యున్నారుగాని సత్యములో లేరు. మఱియు మీగ్రామచరిత్ర మంతయు మీ రవగతము చేసికొనలేదను కొందును."

అహోబలుఁడీచీటిని జూచికొని దీర్ఘాలోచన మొనరించి యిటులు ప్రత్యుత్తరము వ్రాసెను :

"తమ చీటిలోని మాటలను కొన్నిఁటి నెఱిఁగికొంటిని. నే నెట్టి మాయలో నుంటినో తెలియఁజాలను. మా గ్రామచరిత్రము మీ రెటు లర్థము చేసికొంటిరో తెలుపఁగోరెదను."

ఈ యుత్తరము వెంటనే టపాలోఁ బడెను గానిప్రత్యుత్తరము వచ్చుటకుఁ గొంచె మాలస్యమాయెను.

## 19

కొడుకున కింకం బెండిలి కాదని వీరవెంకమ్మ దిగులు పెట్టుకొనెను. అసలామె 'భోలా విశ్వనాథే' కాని కోడలిముచ్చట మాత్రము నాలుకమీఁదికి రానీదు. అహోబలుఁ డొకనాఁడు ఉత్తరములను పరికించు కొనుచుండఁగా దాపునఁ గూరుచుండి తల్లి కంటనీరు పెట్టుకొనియిటులనెను – "నాయనా ఆనాటి యగ్రహార మీనాఁటికి – మాన్యమాయెను. చెట్టంతకొడుకవు చీమంత అయిపోవుచుంటివి. ఇల్లుగూడ నిఁక ఆశ్రమమవే కావలసియున్నదా?"

అహోబలుఁడు తాను పరికించుచున్న ఉత్తరములను క్రిందనుంచి విశాలమగు ముఖముతో విప్పారిన కన్నులతో 'అమ్మా! వరహాలవంటి మాటయంటివి. ఎవరియిల్లు ఆశ్రమ మగునో వారు ధన్యులుకదా!' అనెను.

వీరవెంకమ్మ కనుఁగొనలనుండి రెండశ్రుబిందువులు క్రిందికి జాఱెను. అహోబలుఁ డది చూచి – "అమ్మా! కొలఁదిరోజులలోనే" – అని వాక్యమును సమాప్తి చేయకమునుపే వీరవెంకమ్మ అందుకొని 'కోడలు వచ్చునా?' అనెను.

'రావచ్చును.'

వీరవెంకమ్మ యేనుఁగెక్కెను. 'కోడలెవరు? వసుమతియా మఱొకతెయా?' ఈ మొదలగు ప్రశ్నములతో నామెకు పని లేకపోయెను. కోడలనిన కోపించు కుమారుని నోరినుండి 'కోడలు రావచ్చు'నను మాటయే యామెకు సరిపోయెను. వీరవెంకమ్మ 'వేయేండ్ల ఆయుస్సు' అని దీవించి నగుమొగముతో వంటింటిలోనికిఁజనియెను.

తపాలవాఁడు రెండు ఉత్తరములను దెచ్చియిచ్చెను. అహోబలుఁడు ఒకటి విప్పి చూచుకొనెను – "మీరు పరిగ్రహించుచో నాకడ నొక కన్య కలదు."

ఈ వాక్యము చదువుకొనుచుండఁగా తన కనుల యెదుట వసుమతి నిలిచి యున్నటులాయెను. అతని శరీరము రోమాంచిత మాయెను. కొంతసేపు మనస్సునం దానందించి యతఁడు 'అమ్మా!' యని పిలిచెను.

'ఏమి నాయనా?'

'స్కూళ్ల యిన్‌స్పెక్టరుగారు తమకూఁతు నిత్తుమని వ్రాసినారు.'

ఈమాట వినఁబడఁగానే వీరవెంకమ్మకును వసుమతి గోచరించెను.

'నాయనా! తొందరగా ఆలోచించుకొనుము' అని లోని కరిగెను.

అహోబలుఁడు రెండవచీటి విప్పెను. అదొక పెద్ద బుక్ పోస్టు. అది సీతకడనుండి వచ్చెను. :

"నా యుత్తరమును మీరు శాంతముగా పరికించినందులకు వందనములు. పిదప.

| | |
|---|---|
| మీ గ్రామమున జనాభా రమారమి | 1500 |
| తురకలు | 30 |
| నిమ్నజాతులు | 300 |
| అక్షరకజ్ఞానము కలవారు | 20 |
| చదువుకొనువారు | 60 |
| స్త్రీలు | 900 |
| పురుషులు | 600 |
| నలుఁబదికి యిరువదికి నడుమవారు | 700 |
| ఇరువదికి లోపువారు | 800 |
| ముప్పొద్దులు తిండిగలవారు | 400 |
| ఒకపూఁటమాత్రము తిండిగలవారు | 500 |
| తిండిలేనివారు | 600 |
| ఆయకట్టు ఎకరములు | 1314 |
| ఊరి మొత్తపు ఋణము రూ. | 200000 |
| పంట, సుమారు, పుట్లు | 1000 |
| తాకట్లు | 900 |
| పార్టీలు సుమారు | 6 |
| అమలులో నున్న వాజ్యములు | 90 |
| వానికి సంబంధించిన జనము (స్త్రీలు, పురుషులు) | 800 |
| స్త్రీలు | 110 |
| పెంకుటిండ్లు | 4 |
| పాకలు | 592 |
| పెద్దబాటలు | 0 |
| సందులు | 38 |

| | |
|---|---|
| పాడేపడిన దేవళము | 1 |
| గ్రామదేవతల ఆలయములు | 6 |
| ఏటేట బలి యీఁబడు జంతువులు | 500 |
| చెఱువులు | 1 |
| బావులు | 0 |
| విషూచి వ్యాపించు ఋతువులు | 2 |
| మశూచి వ్యాపించు ఋతువులు | 1 |

ఇట్టి మీగ్రామమును పదివేలతో దానమిచ్చినను ఎవరును పరిగ్రహింపరు. సంఖ్యలో భేదమేకాని హిందూదేశమునందలి గ్రామ చరిత్ర మంతయు నొకటియే యని తెలిసికొనఁగలము.

మీ గ్రామమును ఏటేట పదిపండ్రెండు పర్యాయములు దొంగలు దోఁచికొందురు. వారిని బట్టుకొనుట కెవరికిని సాహసము చాలదు. మూఁడునాలుగుసారులు గ్రామము దగ్ధమగును. ఎవరును ఆర్పఁజాలరు. చెఱువులో నీరు పురుగులమయము. దానిని బాగుచేయుటకు బదులు దానిచుట్టు అందఱును రోఁత చేయుదురు. వానలు పడునపు డూరంతయు మురిగిపోవును. ఎవరును శుద్ధి చేయరు. విషూచీ మశూచికలతో ఏటేట నేఁబదిమందికిపైఁగా నశింతురు. దానికి సరియగు వైద్య మవలంబించుటకు బదులు పశువుల ప్రాణములు తీయుదురు.

రైతును పాలేరు నమ్మఁడు. పాలేరును రైతు నమ్మఁడు. ఏరువాక పున్నమరెణ్ణెల లున్న దనఁగానే పాలేరు చెప్పక చాలించుకొనును. రైతు మూణ్ణెలల గింజలు బిగియఁ బట్టుకొని యుండును. దీనితో రైతులకును పాలేళ్లకును అంతులేని అంతఃకలహము.

మీ గ్రామమున తురకలయిండ్లు సుమారు పది. జనాభా ముప్పది. చదువు సున్నకును తక్కువ. ఎవరికిని నవాజు రాదు. కాని మతద్వేషము లెస్సగా వచ్చును. మిగిలిన వారికిని వీరికిని ఎడ్డెమనిని తెడ్డెము. ఈ ద్వేషమును ఎవరును మైత్రిలోనికి పరిణమింపఁ జేయఁజాలరు.

పంట సుమారు 900 పుట్లు. వ్యయము పోను నికరపు ఆయము సుమారు (నేఁటి వెలల చొప్పున) 40,000. ఆయములో వడ్డీ క్రింద పోవలయునది 30,000 మిగిలినదానిని పంచుచో తలకు సాలుకు ఏడురూపాయలు పడలేదు.

నిజముపేదలయినను పెండ్లికి వ్యయింపవలయునది ఆయమునకు నాలుగు రెట్లు.

సాఁబాలు జనులు పాటుపడరు. పరుల గుండెలమీఁదనే వారి కాలు. కూరఁగాయలు కష్టించి పండించికొనరు. అప్పులెగ వేసియయినను కొనితిందురు. పశుపోషణమునకుఁగాని, పశువృద్ధికిఁగాని పాటుపడరు. పాడిమాత్రము కావలయును. పురాణము వినరు. చతుర్ముఖ పురాణమునకు 'సిద్ధము.' ఇచ్చ వచ్చినటులు వ్యయింతురు. ఖాతావ్రాయరు. ఇంటికి మూఁడురోగిశయ్యలు. మందులకును పథ్యపానములకును బదులు దండలకు ముడుపులు. ఇదియంతయు నజ్ఞానమూలకము.

ఇట్టి గ్రామములు భరతఖండమున వేలకు వేలు. వీని నన్నిఁటిని ధనము త్యాగమొనరించి యెవఁడు బాగుచేయఁగలఁడు? ఎవనికి సరిపడు ధనమును వానిచేతనే వ్యుత్పత్తి చేయింపవలయు నని మీకుఁ దోఁచుట లేదా?"

అహోబలుఁ డీనివేదికను జదివికొని 'నేను కూపస్థ మండూకమను' అనుకొనియెను. 'లోఁగడ వ్యయమొనరించిన ధనములోఁ జాలపాలు దుర్వ్యయ మొనరించితి' ననుకొనెను. అతఁ డాయుత్తరమును చదివికొని చదివికొని ఆనందముచే జడత్వమును, ఆలోచనచే చలత్వమును బొందఁదొడఁగెను.

'మా గ్రామచరిత్ర మింత సమగ్రముగాఁ దెలిసికొనిన యీమె వసుమతిగాక మఱెవతె?' అని అనుకొనెను. బాగుగా యోచించి యిటులు వ్రాసెను.

'మీరు నా యజ్ఞానమును బాపితిరి. మీరు నన్ను స్వీకరించుచో నేను మీ వాఁడను. మీరు నా పొరపాటులను దిద్ది లోఁగడనే క్షమించితిరి. ఇఁక క్షమింపుమని యడుగనేల?

నన్ను ధనము గోరితిరి; నేను నిరాకరించితిని. నేను కోరితిని; మీరిబ్బుడిగా నొసఁగితిరి. మీరు మాకతిథులయితిరి. నేను వెడలనడిచితిని; నేను మరల నిపుడు కోరితిని. మీరు అనుగ్రహించితిరి.

మరల మీరు నా మనోదేవతగను, గృహదేవతగను ఈ యింటిని అధిష్ఠింపఁ గోరుచున్నాను.

పెక్కు కాకితములు పాడుచేసి తుదకీ యుత్తరమును వ్రాయఁగలిగితిని".

సీతకడనుండి వెంటనే యిటులు జాబు వచ్చెను."మా యేలిక యిటులు వ్రాయమనెను:

మీ యుత్తరము చేరెను. తాము సజ్జనులని నాకుఁదెలియును.

లోకసేవయే ప్రధానముగాఁ బెట్టుకొని జీవికను నిర్వహింపవలయునని మీరు తలఁచుచో నేను మీ గృహదేవతగా' రాఁజాలను. నాకును లోకసేవయే పరమావధి.

ఇట్టి మనకు లోకసామాన్యమగు దాంపత్యము పనికిరాదు. పతనము లేని యలౌకిక దాంపత్యమును అభిలషింతురేని నేను మీ మిత్రమను."

అహోబలుఁ డీ యుత్తరమును జదివికొని యుప్పొంగెను. వెంటనే వంటింటి లోనికిఁ జని "కోడలు రాఁగలదు" అనెను.

'ఏ కోడలు?'

'వసు – '

వీరవెంకమ్మ ఆశ్చర్యముతో స్తంభించి పోయెను. ఆనందగద్గదమగు నామెకంఠము నుండి 'అమ్మ! నే నిఁక కాశివెళ్లెదను' అనెను.

'మన యిల్లే కాశి.'

'కాకేమి?'

అహోబలుఁడు వెంటనే యిటులు ఉత్తరము వ్రాసెను.

"ప్రియమిత్రమునకు.

ఇఁక మనకు ఉత్తర ప్రత్యుత్తరములతో ఆలస్యమేల?"

ఈయుత్తరము అందుకొనిన పిదప వసుమతి తన మందుల కార్ఖానా నంతయు వాసుదేవరావు వశ మొనరించెను. అపుడపుడే పెరిఁగిపోవుచున్న తన ప్రాక్టీసు నంతయు కట్టిపెట్టెను. ఒకరిద్దఱు రోగులనుమాత్రము విడిచిపెట్టి వెళ్లుటకు వీలు కలుగక పోయెను.

సర్దుపాటులన్నియు అయినపిదప నొక నాఁడు వసుమతి 'సీతా! అమ్మ యెచటను న్నదో చూచి వత్తువా?' అనెను.

'తులసి ముందు.'

వసుమతి మెల్లగా తల్లికడ కరిగి నిలుచుండి 'అమ్మా! రేపు అత్తవారియింటికి వెళ్లుటకు శుభలగ్నము' అనెను.

'కలయా?'

'కాదు. ఈయుత్తరములు చూడుము' అని అహోబలుని యుత్తరములు కొన్ని యిచ్చెను. సోమమ్మ వానిఁ జదివికొని నగుమోముతో 'అమ్మ! నేనిఁక కాశికి వెళ్లెదను' అనెను.

'మన యిల్లే కాశి.'

'కాశియే నాయిల్లు.'

ఆ మఱునాఁడు రాధయు వాసుదేవరావును వసుమతియు సోమమ్మయు సీతయు శివాగ్రహారమునకు పయనమయిరి.

వీరవెంకమ్మయు నహోబలుఁడును వినయవిధేయతలతో అందఱను ఉపచరించిరి. అహోబలునియందు అత్యంతాభిమానముగల గ్రామస్థులందఱును సందుల మొగలన్నియు మావితోరణములతోడను, అరఁటిస్తంభములతోడను అలంకరించి గ్రామము నంతయు మంగళమయ మొనరించిరి.

గ్రామమంతయుఁ బదిరోజులు వేడుకలతో కలకల లాడిపోయెను. వీరవెంకమ్మయు సోమమ్మయు 'భాయి అనఁగా భాయి' అనుకొని కుమారుని కూఁతును ఒప్పించి కాశి కరిగిరి. వాసుదేవరావు పని మానుకొని వసుమతి ప్రాక్టీసును తాను సాగింపఁబోయెను. రాధయు నతనితో నరిగెను.

అహోబలునకును వసుమతికిని గ్రామ సంస్కరణముకొఱకు కేంద్రముల నేర్పాటు చేసికొని కర్మయోగ మారంభించుటకు అటుపిదప ఎంతో కాలము జాలముకాలేదు.

• భారతి - ఏప్రిల్ - ఆగష్టు - *1932* •